ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-11-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 279 పేజీలు: 10+4 వెల: 6.50




నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


# 2034 దాకా అధికారం మాదే

## నా మాట రాసిపెట్టుకోండి.. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు

### సెంటిమెంటో, డెవలప్‌మెంటో జూబ్లీ ప్రజలు తేల్చుకోవాలి

### సొంత చెల్లిని, మాగంటి తల్లిని అవమానించినవారు ప్రజలకు ఏం న్యాయం చేస్తారు?.. మీట్ ది ప్రెస్‌లో సిఎం రేవంత్



ఆదివారం హైదరాబాద్‌లో మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్9:** మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు,2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. నేను చెప్పేది రాసి పెట్టుకోండి... 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, ఈ పదేళ్ల పాలనలో వందేళ్ల అభివృద్ధిని చూపిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందని, పాత పథకాలను కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్త పథకాలు తెచ్చానని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సెంటిమెంటా, డెవలప్‌మెంటా, జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలన్నారు. గతంలో పీజేఆర్ చనిపోయినప్పుడు కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారని అన్నారు. ఖమ్మంలో రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ కేసీఆర్ అదే విష సంస్కృతి తెచ్చారని ధ్వజమెత్తారు. మాగంటి గోపీనాథ్ నాకు మిత్రుడే, కానీ నియోజకవర్గం అభివృద్ధిచేయాలి కదా అని పేర్కొన్నారు. ఫేక్ సర్వేలకు మీడియా దయచేసి ప్రాధాన్యం ఇవ్వొద్దని కోరారు. 1994-2004మధ్య టీడీపీ, 2004-2014 మధ్య కాంగ్రెస్ పాలించాయని, అలాగే 2014-2023 మధ్య బీఆర్ఎస్ పాలించిందని తెలిపారు.ఇప్పుడు 2023 నుంచి పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని స్పష్టంచేశారు.జూబ్లీహిల్స్ గెలవాల్సిందే, అభివృద్ధి జరగాల్సిందేనని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఎంత మెజారిటీతో గెలుస్తామో చెప్పలేమన్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ డిపాజిట్ కోల్పోవడం ఖాయం, బిఆర్ఎస్ ఓడిపోతుందని, ఈ విషయం తెలిసే జూబ్లీహిల్స్‌లో సునీతమ్మను గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేయలేదని పేర్కొన్నారు. తన కళ్ల ముందే బీఆర్ఎస్ కూలిపోతుంటే కేసీఆర్ మౌనంగా కుమిలిపోతున్నారని అన్నారు. ఎన్నికల విషయంలో నాది లీడర్ మైండ్‌సెంట్ కాదని, క్యాడర్ మైండ్‌సెట్ అని చెప్పారు. అందుకనే ఏ ఎన్నికనైనా సీరియస్‌గా తీసుకుంటానని, ఇంటింటికి >>2

# ఇక 'నిశ్శబ్దం'గా తాయిలాలు!

## జూబ్లీలో ప్రచార హోరుకు తెర

## రేపు పోలింగ్, 14న కౌంటింగ్

### మూడంచెల బందోబస్తు ఏర్పాట్లు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్9:** జూబ్లీహిల్స్ అసెంబ్లీనియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేందుకు ఇక ఓటరు తీర్పే మిగిలి ఉంది. ముగ్గురు ప్రధాన పార్టీల(నవీన్ యాదవ్-కాంగ్రెస్,మాగంటి సునీత-బిఆర్ఎస్,దీపక్‌రెడ్డి-బిజెపి) అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్న ఈ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సాధారణ ఎన్నికల్లో కంటే ఈ ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈనెల 11న జరిగే పోలింగ్ నిర్వహణ కోసం ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి. ఈ ఉపఎన్నికలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పెద్దసంఖ్యలో స్వతంత్రులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు పోటీపడుతున్నారు.కాంగ్రెస్‌తరఫున ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలంతా >>2

# పాతబస్తీలో డ్రగ్స్ పంజా



### మైనర్ బాలికల కిడ్నాప్‌లు అత్యాచారాలు

### రాకెట్‌కు మజ్లిస్ అండ.. పట్టించుకోని పోలీసులు: కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** పాతబస్తీలో మజ్లిస్‌అండతో డ్రగ్స్ రాకెట్ హిందూ మైనర్ అమ్మాయిలను టార్గెట్ చేసి కిడ్నాప్, అత్యాచారాలు చేస్తూ వాళ్ల జీవితాలను నాశనం చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలుచేశారు.ఇంత జరుగుతున్నా >>2

# వచ్చే యేడాది టిజిపిఎస్‌సి నోటిఫికేషన్లు


### నేటి నుంచి గ్రూప్-3 సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 9:** తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి)నుంచి నోటిఫికేషన్లు >>2

# దేశవ్యాప్తంగా ఐసిస్ దాడులు?

## గుజరాత్‌లో ముగ్గురు టెర్రరిస్టులు అరెస్టు

### నిందితుల్లో ఒకరు హైదరాబాద్ వాసి



గుజరాత్‌లో అరెస్టయిన ఐసిస్ ఉగ్రవాదులు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** గుజరాత్‌లో ఎటిఎస్ పోలీసులు చేబట్టిన యాంటి టెర్రరిస్ట్ ఆపరేషన్‌లో ముగ్గురు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టయ్యారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి తుపాకులు, తూటాలు, రసాయన బాంబుల తయారీకి అవసరమైన సామాగ్రిని జప్తు చేశారు. అరెస్ట యిన నిందితుల్లో ఒకడు హైదరాబాద్‌కు చెందిన ఎంబిబిఎస్ వైద్యుడు కావడం గమనార్హం. ఈ ముగ్గురు ఉగ్రవాదులు దేశ వ్యాప్తంగా పలు నగరాలలో ఉగ్రవాద దాడులకు కుట్ర పన్నినట్లు గుజరాత్ పోలీసుల విచారణలో తేలింది. మధ్య ప్రాచ్యదేశాలు, యూరప్, అమెరికాలో కొన్నేళ్ల క్రితం విధ్వంసాలు సృష్టించి అమాయకులను చంపిన ఐసిస్ ఉగ్రవాదుల కదలికలు భారత్ లో మళ్లీ కలకలం రేపాయి. ఐఎస్ఐ ఉగ్రవాదులు కొంతకాలంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ కేంద్రంగా >>2






డెహ్రాడూన్‌లో ఆదివారం వేసేతచిత్రాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

# తాయిలాలు!

>> విస్తృతంగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు,మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేశారు. బిజెపి నుంచి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు,నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2 లక్షల 85 వేల 61 మంది పురుషులు, లక్ష 92 వేల 779 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 25 మంది, సర్వీసు ఓటర్లు 18, ఎన్ఆర్ఐ ఓటర్లు 123, దివ్యాంగులు 1,908 ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్ళ వున్న ఓటర్లు 6,859 మంది ఉండగా 80ఏళ్ల పైబడిన వారు 6,053 మంది 85ఏళ్ల పైబడిన వారు 2,134 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే వృద్ధులకు సంబంధించిన ఓటింగ్ లో దరఖాస్తు చేసుకున్న 103 మంది తమ హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సోమవారం రాత్రి యూసఫ్‌గూడలోని విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారని 139 ప్రాంతాల్లో తొలిసారి డ్రోన్‌తో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామ న్నారు. ఉపఎన్నిక కోసం 407 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని అందులో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. ఈసారి ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయన్నారు. పోలింగ్ బూత్ దగ్గర మూడంచెల భద్రత ఉంటుందని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. 45ఎస్ఎస్టీ, 45ఎస్ఎస్‌టి టీమ్స్ నియోజకవర్గంలో పనిచేస్తున్నాయని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో 2,060 మంది సిబ్బంది విధుల్లో ఉండనున్నారని కర్ణన్ పేర్కొన్నారు. ఈ మేరకు 561 కంట్రోల్ యూనిట్లు, 595 వీవీ ప్యాట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే.. శనివారం సాయంత్రం నుంచి 11వ తేదీ సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు వెల్లడించారు. ఉపఎన్నిక నేపథ్యంలో ఓటర్లందరూ ముందుకు వచ్చి ఓటు వినియోగించుకోవాలని కర్ణన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. 65 లొకేషన్స్‌లో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్లు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పారామిలిటరీ బలగాల బందోబస్తు ఉంటుందన్నారు.

# డ్రగ్స్ పంజా

>> పాతబస్తీ పోలీసులు కనీసం విచారణ జరపడం లేదని మండిపడ్డారు. ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ డ్రగ్స్ రాకెట్ అరాచకాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ డ్రగ్స్ విషయాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసినా మజ్లిస్ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహిస్తోందని విమర్శించారు. పాతబస్తీలోని హిందు అమ్మాయిలు అత్యధికంగా చదువుకునే స్కూల్ టార్గెట్ చేస్తూ డ్రగ్స్ ముఠా అరాచకాలు చేస్తున్నా ఇప్పటి వరకు ఒక్క చర్య కూడా తీసుకోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన డ్రగ్స్ ముఠా అంతు చూసి మైనర్ బాలికల జీవితాలను కాపాడకపోతే పాతబస్తీలో వేలాది మంది హిందు యువకులతో రక్షక దళాలలను రంగంలోకి దింపుతామని స్పష్టం చేశారు. మొదట ఈ రాకెట్ ఆ స్కూల్ లో ఒక అమ్మాయిని టార్గెట్ చేసి బర్త్ డే పేరుతో ముస్లిం అమ్మాయి ఇంటికి పిలిపించి తక్కువ డ్రగ్స్ డోసు ఉన్న చాక్లెట్ తిన్పించారు. ఆ తరువాత మెల్లమెల్లగా ఆ చాక్లెట్లలో డ్రగ్స్ డోసు పెంచి వాటిని అలవాటు చేశారు. ఆ తరువాత 6 రోజులపాటు ఆ అమ్మాయిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. అమ్మాయి తల్లిదండ్రులు టెన్షన్ తో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు విచారణ చేయడం లేదన్నారు. ఫిర్యాదు చేసిన ఒకటి రెండ్రోజులకే ఆ అమ్మాయిలను ఇంటి వద్ద వదిలి వెళతారు. విచారణ జరపాలని అడిగితే... మీ అమ్మాయి ఎట్లాగూ వచ్చింది కదా? ఇక విచారణ ఎందుకంటే కేసును క్లోజ్ చేస్తారు. ఆ తరువాత కూడా ఆ అమ్మాయిని తీసుకెళ్లి బట్టలిప్పి రేప్ చేస్తూ మొత్తం వీడియో తీశారు. ఎవరికైనా చెబితే ఆ వీడియోను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తాం..మీ స్కూల్‌కు పంపుతామని బెదిరించారు. ఇది ఒక్క అమ్మాయి విషయంలోనే కాదు. ఇట్లాంటి కేసులు అక్కడ చాలా ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల కిందట జీవనోపాధి కోసం వెస్ట్ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన కొన్ని కుటుంబాలు పాతబస్తీలో కూలీనాలీ చేసుకుని బతుకుతున్నారు. నా పక్కన ఉన్న ఈ ఇద్దరి బిడ్డలను స్థానికంగా ఉండే ఆదిల్ అలియాస్ అజీజ్ ముఠా డ్రగ్స్‌కు అలవాటు చేసి చివరికి బానిసల్ని చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ప్రాణాలతో వస్తే సరిపోతది కదా? అంటూ అక్కడి పోలీసులు సమాధానం చెబుతూ పంపించారు. చివరకు మా బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉమా మహెందర్ వెళ్లి పోలీసులపై వత్తిడి చేసి హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తామని ఒత్తిడి తెస్తే ఆ బాలికను డ్రగ్స్ గ్యాంగ్ పోలీసు స్టేషన్ పరిసరాల్లో వదిలి వెళ్లారు. ఎవరకైనా చెబితే మీ తల్లిదండ్రులను చంపేస్తాం అని బాలికను బెదిరించారు. ఆ బాలిక ఇంటికి చేరింది. మీ బిడ్డ దొరికింది కదా అని చెప్పి పోలీసులు ఆ కేసును క్లోజ్ చేశారు. ఆ బాలికను తల్లిదండ్రులు, కాలనీ వాళ్లు గుచ్చి గుచ్చి అడిగితే తనతో పాటు మరెందరో మైనర్ బాలికలకు డ్రగ్స్ బలవంతంగా తినిపించినట్లు ఆమె చెప్పింది. ఆదిల్ అతని స్నేహితులు (ఆ సమూహ సభ్యులు) వారి లైంగిక చర్యలను వీడియోలు, నగ్న చిత్రాలను చిత్రీకరిస్తూ వారిని లైంగిక చర్యలకు బలవంతం చేశారని ఆ అమ్మాయి వాపోయింది. ఆ సదరు బాలిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈనెల 6 తేదీన, తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో, డ్రగ్స్ గ్యాంగ్ మెయిన్ లీడర్ అజీజ్ అలియాస్ ఆదిల్ అనే వ్యక్తి వాళ్లను అడ్డగించారు. తనతో రావాలని ఆ అమ్మాయిని డిమాండ్ చేసి, స్కూటర్‌పై బలవంతంగా తీసుకెళ్లాడు. తల్లి దండ్రులు అతనిని వెంబడించడానికి ప్రయత్నించారు వాళ్లు పట్టుకోలేక పోయారు. చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 137(2) కింద ఎఫ్ఐఆర్ నెం.192/2025 నమోదు చేయబడింది. పదేపదే పోలీసు అధికారులనుఅభ్యర్థించినప్పటికీ ఎలాంటి ఇన్వెస్టిగేషన్ చేయడం లేదన్నారు. ఆ ఎఫ్ఐఆర్‌లో నిందితుడైన ఆదిల్ పేరు కూడారాయలేదు. ఆడ్రగ్స్ గ్యాంగ్(డ్రగ్స్ వాడకం, బాలిక అత్యాచారం పై ఎట్లాంటి విచారణ చేయలేదు. ఇప్పుడా అమ్మాయి భరోసా సెంటర్‌లో ఉంది. ఇట్లాంటి మైనర్ బాలికలెందరో ఆ రాకెట్ గుప్పిట్లో బందీలై విలవిల్లాడుతున్నారన్నారు. మజ్లిస్ అండతో పోలీసులు డ్యూటీ నిర్వర్తించకుండా డబ్బులు దండుకుంటున్నారని, ఇది ఒక్కరో ఇద్దరో కాదు వందల మంది మైనర్ అమ్మాయిల జీవితాలు, భవిష్యత్తు ఆ డ్రగ్స్ ముఠా చేతిలో నలిగిపోతున్నాయి అని అన్నారు.

# భారత్‌పై దాడులకోసం పాక్‌లో రహస్య ఆర్మీ!

**న్యూఢిల్లీ, నవంబరు 9:** భారతదేశంలో దశాబ్దాలుగా జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల వెనుక పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)లోని ఓ రహస్య విభాగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఎస్-1 అనే కోడ్ పేరుతో పనిచేస్తున్న ఈ యూనిట్,1993 ముంబై వరుస పేలుళ్ల నుంచిఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన దాడి వరకు అనేక దుశ్చర్యలకు సూత్రధారి అని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఎస్1 అంటే సబ్ వెర్షన్ 1. పాకిస్థాన్‌లో సరిహద్దు ఉగ్రవాదాన్ని నడిపించే అతిపెద్ద శక్తి ఇదేనని తెలుస్తోంది. ఈ రహస్య విభాగానికి పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఒక కల్నల్ స్థాయి అధికారి నాయకత్వం వహిస్తుండగా,గాజీ 1, గాజీ 2 అనే కోడ్ పేర్లతో ఇద్దరు అధికారులుక్షేత్రస్థాయి ఆపరేషన్లను పర్యవేక్షిస్తున్నారు. ఇస్లామాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ యూనిట్ కార్యకలాపాలకు అవసరమైన నిధులను ఎక్కువగా మాదకద్రవ్యాల విక్రయం ద్వారానే సమకూర్చుకుంటున్నట్లు సమాచా



రం. ఈ ఎస్1 యూనిట్‌లోని సిబ్బంది అన్ని రకాలబాంబులు, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌ల (ఐఇడి) తయారీలో నిపుణులు. చిన్నపాటి ఆయుధాలను వాడటంలోనూ వీరికి పూర్తి నైపుణ్యం ఉంది. అంతేకాకుండా, భారతదేశంలోని చాలా ప్రాంతాలకు సంబంధించిన సమగ్రమైన మ్యాపులు వీరి వద్ద ఉన్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. గత 25 ఏళ్లుగా ఈ విభాగం చురుగ్గా పనిచేస్తున్నప్పటికీ, దీని పూర్తి కార్యకలాపాల స్వరూపాన్ని భారత భద్రతా ఏజెన్సీలు ఇటీవలే డీకోడ్ చేయగలిగాయి. కేవలం భారత్‌లో దాడులు చేయడమే లక్ష్యంగా పనిచేసే ఎస్-1, పాకిస్థాన్‌లోని జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి అన్ని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉంది. ఈ యూనిట్ సిబ్బంది ఉగ్రవాద శిక్షణా శిబిరాల్లో పొడవాటి గడ్డాలు పెంచి, స్థానిక సంప్రదాయ దుస్తులు ధరించి ఉగ్రవాదులతో కలిసిపోతారు. తాము ఎస్-1 విభాగానికి చెందిన వారమన్న విషయాన్నిఅత్యంత రహస్యంగా ఉంచుతారు. శిక్షణ తీసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు కూడా తమ ట్రైనర్లు ఎవరనేది తెలియకుండా జాగ్రత్త పడతారు. గడిచిన రెండు దశాబ్దాల్లో ఎస్1వేలాదిమంది ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చిందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## వారం - వర్జ్యం

10-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
షష్ఠి రా.10.13
పునర్వసు సా.6.54, విశాఖ కార్తె
వర్జ్యం : రా.2.44-తె.4.18
దు.ప.12.16-1.02
2) మ.2.33-3.19
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. మిత్రులతో ఏర్పడినమాట పట్టింపులు తీరుతాయి.

**వృషభం:** ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. కొత్త కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు.

**మిథునం:** ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు వస్తులాభం. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది.

**కర్కాటకం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి.

**సింహం:** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. మీ మాటకు పలుకుబడి పెరుగుతుంది.

**కన్య:** దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. పనులు సకాలంలో పూర్తిచేస్తారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**తుల :** పొదుపు పథకాలు విజయ వంతంగా పూర్తిచేస్తారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. గృహం కొనుగోలు యత్నాలు చేస్తారు. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**ధనుస్సు:** నూతన వ్యాపారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం శ్రేయోదాయకం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**మకరం:** రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుతాయి. కొత్త కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**కుంభం:** ముఖ్య వ్యవహారాలన్నీ గౌరవ మర్యాదాలకు, ప్రతిష్ఠకు ఎక్కువ విలువను ఇస్తారు. సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు.

**మీనం:** మీ శత్రు వర్గం యొక్క పురోగతి తాత్కాలికమేనని గుర్తించండి. నమ్మిన వ్యక్తులే సమస్యలు సృష్టించవచ్చు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బీహార్‌లో సద్దుమణిగిన ప్రచారం

## 122 నియోజకవర్గాల్లో రేపే పోలింగ్
## వివిధ రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు
## గెలుపుపై అన్ని పార్టీలు ధీమా.. 14న ఫలితాలు



**న్యూఢిల్లీ,** నవంబరు 9: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 8 అసెంబ్లీ నియోజక వర్గాలకు ఉప ఎన్నికకు సంబంధించి ఆదివారం సాయంత్రం 5గం.లతో ప్రచారం ముగిసింది. జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోట, అంటా (రాజస్థాన్),ఘాట్‌షిలా (జార్ఖండ్),జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ టరన్(పంజాబ్), దంపా(మిజోరం), నుపాడ (ఒడిశా) అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉపఎన్నికతోపాటు, బీహార్‌లో రెండో విడతలో 122 అసెంబ్లీ నియోజకవర్గాలలో మంగళవారం పోలింగ్ జరుగనుంది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ నెల 11న 20 జిల్లాల పరిధిలోని మిగతా 122 సీట్లకు ఓటింగ్ జరగనుంది. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈసారి అధికార ఎన్‌డిఏ, మహా కూటమి మధ్య గట్టిపోటీ నెలకొంది. అధికార, ప్రతిపక్ష కూటములు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఎన్‌డిఏ తరపున ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగసభల్లో పాల్గొన్నారు. మహా కూటమి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆర్‌జెడి అగ్రనేత, మహాకూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో బీహార్‌తోపాటు ఆయా ప్రాంతాల్లో మంగళవారం పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించిన యంత్ర సామాగ్రిని ఎన్నికల నిర్వహణ అధికారులు, పోలింగ్ సిబ్బందికి అందజేశారు. సోమవారం సాయంత్రానికల్లా తమతమ పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. బీహార్‌తో ఏడు రాష్ట్రాలో జరుగనున్న 8 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు ఈనెల 14న వెలువడనున్నాయి.



అంగోలా లువాండాలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో ఆదివారం సైనిక అధికారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# 2034 దాకా అధికారం మాదే

>> వెళ్లి ప్రచారం చేయాలని ఉంటుందని, సెక్యూరిటీ సమస్య ఉంటుంది కాబట్టి వెళ్లలేనన్నారు. ఫార్ములా వన్ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కోరామని,3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వలేదన్నారు.కాళేశ్వరం విచారణను సీబీఐకి తాము అప్పగించామని, ఇంతవరకూ సీబీఐ కాళేశ్వరంపై ఎందుకు విచారణ ప్రారంభించలేదని ప్రశ్నించారు. బిజెపి,బిఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం అందుకనే సిబిఐ విచారణ ప్రారంభం కావడం లేదని, గవర్నర్ అనుమతి ఇవ్వడం లేదన్నారు. జూబ్లీహిల్స్‌లో బిజెపి డిపాజిట్ కోల్పోయే పరిస్థితిలో ఉందని, డిపాజిట్ తెచ్చుకుంటే బిజెపి దేశం మొత్తం గెలిచినట్లేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నాలెడ్జ్ హబ్ గా మారిందంటే,అందుకు కారణం చంద్రబాబు,వైఎస్సార్, 2004 నుంచి 2014 వరకు యూపీఏ1,యుపిఏ2 పాలన సాగిందని, వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని కాంగ్రెస్ సర్కార్ నిరూపించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రారంభమై రెండు సంవత్సరాలైందని, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణపై అసెంబ్లీలో చర్చించుకుందామన్నారు. దివంగత ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్ధన్ రెడ్డి పునాది వేసిన ఐటి రంగం హైదరాబాద్‌లో అభివృద్ధికి ఎంతో కీలకంగా మారిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఐటి, ఫార్మా రంగాలను గత పాలకులు ఎంతో ప్రోత్సహించారని కొనియాడారు. కాంగ్రెస్ సిఎంల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు పడ్డాయని ప్రశంసించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు హైదరాబాద్ ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి.. ఇచ్చిన మాట సోనియా గాంధీ నెరవేర్చేందుకు రాజకీయంగా నష్టపోయినా లెక్కచేయలేదన్నారు.2004 లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్, రూ.1300 కోట్ల విద్యుత్ బకాయిల మీద మొట్ట మొదటి సంతకం చేశారు. 73 వేల కోట్ల రుణమాఫీని మన్మోహన్ సింగ్ అమలు చేశారు. కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులకు మేలు చేసింది కాంగ్రెస్. జలయజ్ఞం ద్వారా సాగునీటిని అందించేందుకు కృషి చేసింది కాంగ్రెస్ అని వివరించారు. కల్వకుర్తి , బీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్, ఇందిరాసాగర్, ఎస్ఎల్బీసీ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులు చేపట్టింది కాంగ్రెస్, ఎస్సారెస్పీ, మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి ఇలా చాలా ప్రాజెక్టులు చేపట్టిందన్నారు. పేదల గుండె చప్పుడు పీజేఆర్‌ను మనం గుర్తు చేసుకోవాలి. దేశంలో బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం మన నగరం నుంచి ఉత్పత్తి అవుతున్నాయి నగరంలో ఇటీవల ఎలీ లిల్లీ 1 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు పెడుతోంది అమెరికన్ ఎయిర్ లైన్స్, మెక్ డొనాల్డ్ ఇలా ప్రపంచంలోని 70 శాతం ఫార్చ్యూన్ 500 కంపెనీలు హైదరాబాద్ లో జీసీసీలు ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ గా తయారు కావడం వెనక కాంగ్రెస్ కృషి ఉంది, తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోంది దేశంలోనే పర్ క్యాపిటాలో రంగారెడ్డి జిల్లా ఉంది. ఇందుకు ఆనాడు కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. 25 లక్షల అసైన్డ్, 10 లక్షల ఎకరాల పోడు భూములను పంచిన ఘనత ఇందిరమ్మది, దున్నే వాడికే భూమి అనే నినాదాన్ని పకడ్బందీగా అమలు చేసిన ఘనత పీవీ, ఇందిరా గాంధీలదేనని చెప్పారు. జైపాల్ రెడ్డి కృషి వల్లే హైదరాబాద్‌కు మెట్రో వచ్చింది ఇది చరిత్ర.. ఇది కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదన్నారు. ఆనాటి కాంగ్రెస్ పదేళ్ల పాలన, కేసీఆర్ పదేళ్ల పాలనను పోల్చి చూడండి, రూ.60 వేల కోట్ల మిగులుతో రాష్ట్రాన్ని అప్పగిస్తే పదేళ్లలో 8 లక్షల 11 వేలకోట్ల అప్పులతో వాళ్లు మాకు అప్పగించారు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో.. పాతాళంలోకి పడిపోయే స్థితిలో రాష్ట్రాన్ని మాకు అప్పగించారు అని చెప్పారు. బిఆర్ఎస్ వారు కట్టిన కమాండ్ కంట్రోల్, సచివాలయం, ప్రగతి భవన్ వల్ల ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా..కాళేశ్వరం లేకపోయినా మా ప్రభుత్వంలో 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. బీఆరెస్ హయాంలో ఒక్క కొత్త యూనివర్సిటీనైనా తీసుకొచ్చారా.. కనీసం వీసీలను నియమించలేదు 5 వేల పాఠశాలలు మూసేశారు పేదలకు విద్య, రైతులకు వ్యవసాయాన్ని, మహిళలకు రాజ్యాధికారాన్ని దూరం చేశారు అని పేర్కొన్నారు.సొంత చెల్లిని, మాగంటి తల్లిని అవమానించిన వాడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు అని ప్రశ్నించారు.ధృతరాష్టుడు కళ్ళకు గంతలు కట్టుకున్నట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. మా ప్రభుత్వంలో రూ.7100 కోట్లు ఉచిత బస్సు కోసం ఖర్చు చేశాం ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల వైపు నడిపించాంఅని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచాం రూ.3 వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మిస్తున్నాం చెప్పారు. రేషన్ కార్డులు, రూ.500 లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం రూ.21 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశాం, తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించాం అని చెప్పారు. కేసీఆర్ ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా కొనసాగిస్తున్నాం బీసీకులగణన చేసి కేంద్రం జనగణనతోపాటు కులగణన చేసేలా చేశాం ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్ ఏర్పాటు చేశాం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం చెప్పారు.ఢిల్లీలో కేంద్రంతో సంబంధాలు బాగానే ఉన్నాయని, కానీ కిషన్ రెడ్డి గుజరాత్‌కు గులాంగా మారారు రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకుంటు న్నారు. కేటీఆర్‌తో కలిసి ఉండలేక కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉంటున్నాడు.. సొంత చెల్లి వదిలేసి వెళ్లిపోయింది.. అలాంటి కేటీఆర్ తో కిషన్ రెడ్డికి సావాసమేంది అని ప్రశ్నించారు. ఎవరిది అగ్రికల్చర్.. ఎవరిది డ్రగ్స్ కల్చర్ మీరే ఆలోచించండి ఎవరిది పబ్ కల్చర్.. ఎవరిది సామాన్యులతో కలిసే కల్చర్.. ఎవరు సినీ తారలతో తిరిగే కల్చర్.. ఎవరిది సినీ కార్మికుల కోసం కృషి చేసే కల్చర్ మీరు ఆలోచించండి అని ఓటర్లకు పిలుపునిచ్చారు.

# ఐసిస్ దాడులు?

>> రహస్య కార్యకలాపాలు సాగిస్తున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు గుర్తించి దీనిపై గుజరాత్ పోలీసులకు సమాచారం అందించాయి. దీనిపై ఏడాదిగా నిఘా వుంచిన గుజరాత్ యాంటి టెర్రరిస్టు స్క్వా డ్ (ఎటిఎస్) పోలీసులు ఆదివారం నాడు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ (35), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆజాద్ సులేమాన్ షేక్ (20), మహమ్మద్ సుహెల్ (23)లు అరెస్టయ్యారు. వీరి వద్ద నుంచి రెండు గ్లాక్ పిస్టళ్లతో పా టు ఒక బెరెటా పిస్టల్, 30 తూటాలు, బాంబుల తయారీ కోసం సేకరించిన నాలుగు లీటర్ల ఆముదం నూనె, పది లీటర్ల ఖాళీ ప్లాస్టిక్ క్యాన్‌ను జ ప్తు చేశారు. కాగా ఈ ముఠాకు హైదరాబాద్ వైద్యుడు నాయకుడుగా తేలింది. రసాయన బాంబులను తయారు చేయడంలో ఇతను సిద్ధహస్తుడుగా తేలింది. ఇతను చైనా నుంచి ఎంబిబిఎస్ పట్టా తీసుకున్నట్లు గుజరాత్ ఎటిఎస్ పోలీసులు తేల్చారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అబూ ఖాజా తన దేశ ంతో ఆసియా దేశాలలో కార్యకలాపాల కోసం ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ కొరసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కెపి) పేరిట ఓ సంస్థను స్థాపించి ఉగ్రవాద కార్యకలాపా లు సాగిస్తున్నాడు. ఈ సంస్థలో ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు పాక్‌కు చెందిన యువకులు వున్నారని గుజరాత్ ఎటిఎస్ పోలీసుల విచారణలో తేలింది. మొదట పక్కా సమాచారంతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను అరెస్టు చేయగా అతని సెల్‌ఫోన్‌లోని సమాచారం ఆధారంగా యుపికి చెందిన మిగతా ఇద్దరిని పట్టుకు న్నారు. కాగా పట్టుబడ్డ ముగ్గురు నిందితులు పాకిస్తాన్ సరిహద్దులో గల రాజస్తాన్‌లో పోలీసుల నిఘా తక్కువగా వుండే ప్రాంతాలలో డ్రోన్ల ద్వారా పాక్ నుంచి ఆయుధాలు తెప్పిస్తున్నట్లు తేలింది. అక్కడి నుంచి అహ్మదాబాద్, ఢిల్లీ, లక్నోలకు వీరు ఆయుధాలను సర ఫరా చేసినట్లు తేలింది. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. కాగా గుజరాత్‌లో ఈ ఏడాది ఐసిఎస్ ఉగ్రవాదు లు అరెస్టవడం ఇది రెండవసారి గత జూలై నెలలో ఒక మహిళ సహా నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టయ్యారు. గుజరాత్‌లో అరెస్టయిన ఉగ్రవా దుల్లో ఒకడు హైదరాబాద్ వాస్తవ్యుడు అవడంతో హైదరాబాద్‌లో కలకలం రేగింది. దీనిపై సిటీ పోలీసులు ఆరా తీస్తున్నారు. గుజరాత్ పోలీసులతో మాట్లాడి అతని వివరాలు సేకరించి అతని కుటుంబం గురించి ఆరా తీస్తున్నారు. ఈ వైద్యుడితో పాటు ఇతని అనుచరులు ఇద్దరిపై హైదరాబాద్‌లో ఏమైనా కేసులున్నాయేమోనని ఆరా తీస్తున్నారు. కాగా డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ నగర శివార్లలోని రాజేంద్రనగర్‌లో గల ఫోర్ట్ వ్యూ కాలనీలో వుంటున్నట్లు తేలడంతో అతనుండే ఇంట్లో ఆదివారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు.

# కాలేజీల బంద్‌పై మరోసారి సిఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్9:** ప్రైవేట్ కాజీల బంద్ పై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తనను బెదిరించడానికే కాలేజీలను బంద్ చేశారని అన్నారు. ఆరు నెలల పాటు బంద్ చేస్తే పిల్లల భవిష్యత్ ఏం కావాలని ప్రశ్నించారు. విద్య వ్యాపారం కాదని.. సేవ అని అన్నారు. ఫీజులు ఇస్తారా లేదా అని బంద్ చేయించి బెదిరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంతాలు, పట్టింపులకు పోతే సమస్య పరిష్కారం కాదన్నారు. రూల్స్ ప్రకారం వెళదామంటే చెప్పండి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 100 శాతం రూల్స్ పాటించే కాలేజీలకు తక్షణమే బకాయిలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం కూడా సీఎం నిరసన చేస్తున్న కాలేజీలకు వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే రోజే ఉపముఖ్యమంత్రితో కాలేజీ యాజమాన్యాలు చర్చలు జరపగా సఫలం అయ్యాయి. దాంతో తిరిగి కాలేజీలను ప్రారంభించారు.

# వెలుగులోకి వచ్చిన 60 కొత్త జాతుల సీతాకోక చిలుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్9:** ములుగు అభయారణ్యంలో 60 రకాల కొత్త జాతుల సీతాకోక చిలుకలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోనే మొదటిసారి 8 రాష్ట్రాల వైల్డ్ లైఫ్,వరల్డ్ ఫర్ నేచర్ సంస్థలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. 60 మంది పరిశోధకులు లక్నవరం,తాడ్వాయి,పస్రా అడవుల్లో 3 రోజులు పర్యటించి 60 రకాల సీతాకోక జాతులను గుర్తించారు. సీతాకోక చిలుకల గుర్తింపుతో జిల్లాకు దేశ వ్యాప్తంగా పేరు వస్తుందని స్థానిక రేంజర్ నరేందర్ తెలిపారు.

# టిజిపిఎస్‌సి నోటిఫికేషన్లు

>> ఈ ఏడాది లేనట్టే. 2026 జనవరిలోనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం టిజిపిఎస్‌సి నోటిఫికేషన్లను జారీ చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టుల నియామకాల ప్రక్రియ ముగిసింది. గ్రూప్-2 నియామకాలను గత నెలలో పూర్తి చేశారు. గ్రూప్-4 నియామకాలు పూర్తి చేసి చాలాకాలం అయింది. ఇక గ్రూప్-3 నియామకాలకు సంబంధించి నేటి(సోమవారం) నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ నెల 26 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నారు. తెలంగాణలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే గ్రూప్-1, 2, 3 పరీక్షలను నిర్వహించి ఫలితాలను విడుదల చేసి.. వాటిలో గ్రూప్-1, 2 నియామకాలను పూర్తి చేశారు. త్వరలోనే గ్రూప్-3 నియామకాలు పూర్తి చేయనున్నారు. గత బిఆర్ఎస్ హయాంలో గ్రూప్-4 పరీక్షలను నిర్వహించినప్పటికీ .. ఫలితాలను కాంగ్రెస్ అదికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించి నియామకాలను చేపట్టారు. గ్రూప్-4 ఉద్యోగాల కోసం 2022 డిసెంబర్ 1న నోటిఫికేషన్ నంబర్ 19-2022ను జారీ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 8039 పోస్టులకు గ్రూప్-4 నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఆ తరువాత డిసెంబర్ 29, 2022న 783 గ్రూప్-2 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ నంబర్ 28ని జారీ చేశారు. వాటికి సంబంధించిన నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెల 18న ఎంపికైన వారికి అందజేశారు. గ్రూప్-3లో 1363 పోస్టులకి డిసెంబర్ 30, 2022న నోటిఫికేషన్ నంబరన 29ను జారీ చేశారు. వాటికి సంబంధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నేటి నుంచి ప్రారంభం కానుంది. 2022లో గ్రూప్-1, 2, 3, 4 పోస్టులకు సంబంధించిన ఖాళీల వివరాలతో నోటిఫికేషన్లను జారీ చేశారు. 2023 వరకు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకి ఆ తరువాత కాలంలో పదవీ విరమణ పొందడంతో ఏర్పడిన ఖాళీ పోస్టులకి కలిపి కొత్తగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లను జారీ చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1,2,3,4 పోస్టుల ఖాళీల వివరాలను టిజిపిఎస్‌సి సేకరిస్తున్నట్టు తెలిసింది. ఎన్ని పోస్టులు ఖాళీగాఉన్నాయో తెలపాలనిటిజిపిఎస్‌సి కోరగా.. అందుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఆర్థిక శాఖ.. వివిధ ప్రభుత్వ శాఖలను కోరినట్టు తెలుస్తోంది. అన్ని శాఖల నుంచి వివరాలు వచ్చిన తరువాత నోటిఫికేషన్లను జారీ చేసే అవకాశం ఉంది. అయితే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉన్నందున.. ఆ ఎన్నికలకు సంబంధించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం భావించగా.. కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం కేసు కోర్టులో కొనసాగుతోంది. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని.. డిసెంబర్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలనే యోచనలో రాష్ట్ర సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిస్తే.. వచ్చే ఏడాది 2026 జనవరిలో టిజిపిఎస్‌సి నుంచి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు జారీ అయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## జపాన్‌లో తీవ్రస్థాయి భూకంపం

### రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతగా నమోదు

### భారత్‌లోని అండమాన్ నికోబార్ దీవుల్లో కూడా..

**టోక్యో, నవంబరు 9:** జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమాన ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు.

భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తోహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది' అని ఆమె ప్రజలను హెచ్చరించారు. మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎలాంటి ప్రమాదం లేదని తోహోకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

మరోవైపు భారత్‌లోని అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 5.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 90 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు తెలిపింది. అయితే, జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం దీని తీవ్రత 6.07గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూ కంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూకంపం ధాటికి ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు.

## మరో రూ.వెయ్యి కోట్ల రుణం

### రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్ల రుణానికి రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ఇందుకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను బహిరంగ మార్కెట్లో వేలం వేయనున్నట్లు ఈ ప్రతిపాదనల్లో తెలిపింది. ఈ మొత్తాన్ని ఈ నెల 11వ తేదీ మంగళవారం నాడు నిర్వహించే ఈ వేలంలో పాల్గొని సేకరించనున్నట్లు వెల్లడించింది. ఓపెన్ మార్కెట్ రుణ సమీకరణలో భాగంగా ప్రభుత్వ సెక్యూరిటీ బండ్లను తనఖా పెట్టి 31 ఏండ్ల కాలానికి ఈ రూ.వెయ్యి కోట్లు తీసుకుంటామని ఆర్థికశాఖ ఇండెంట్ పెట్టినట్టు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు తీసుకుంటామని వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ నుంచి దాదాపు రూ.51,900 కోట్ల రుణ సమీకరణ చేసింది. వీటికి అదనంగా రుణం కావాలని మూడో త్రైమాసికం కింద రూ.9,600 కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్టు రిజర్వ్ బ్యాంక్ క్యాలెండర్‌లో ప్రకటించింది. ఈ ప్రతిపాదనల్లో భాగంగా అక్టోబర్ 14 రూ.1,000 కోట్లు తీసుకోగా, ఈ నెల 4న మరో రూ.1,000కోట్ల రుణం పొందింది. తాజాగా ఈ నెల 11న మరో రూ.1,000 కోట్లు కావాలని ఇండెంట్‌లో పేర్కొంది.

# ఆధ్యాత్మిక రాజధానిగా ఉత్తరాఖండ్

### 25 యేళ్లలో అద్భుత ప్రగతి.. రజతోత్సవాల్లో ప్రధాని

### రూ.8,260 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన మోడీ

**డెహ్రాడూన్, నవంబరు 9:** ఉత్తరాఖండ్‌కు అసలైన గుర్తింపు దాని ఆధ్యాత్మిక శక్తి. ఉత్తరాఖండ్ అనుకుంటే కొన్నేళ్ల లోనే ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారగల దని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఉత్తరా ఖండ్‌లోని ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన, యోగ కేంద్రాలను ప్రపంచ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయొచ్చు అని అభిప్రాయపడ్డారు. దేశ విదేశాల నుంచి ప్రజలు ఆరోగ్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఔషధ మూలికలు, ఆయుర్వేద ఔషధాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందన్నారు. గత 25ఏళ్లలో అరోమెటిక్ మొక్కలు, ఆయుర్వేద మూలికలు, యోగం, ఆరోగ్య పర్యాటకంలో ఉత్తరాఖండ్ అద్భుతమైన ప్రగతి సాధించిందని మోదీ వివరించారు. ఆదివారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఉత్తరాఖండ్ రజతోత్సవాలలో ప్రధాని మోదీ పాల్గొని రూ.8,260 కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులకు శంకు స్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ, ఉత్తరాఖండ్ భారతదేశ ఆధ్యాత్మిక జీవితానికి గుండె చప్పుడు. గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్, జగేశ్వర్, ఆది కైలాష్ ఇటువంటి తీర్థయాత్ర స్థలాలు మన భక్తికి చిహ్నాలు. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు ఈ పవిత్ర స్థలాలను దర్శించుకుంటారు. ఈ ఒక్క ఏడాదే 17 లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌ను సందర్శిం చారు. ఉత్తరాఖండ్‌పర్యాటక రంగానికి కేంద్ర బిందువుగా మారుతోంది అని ప్రధాని మోదీ అన్నారు. ఉత్తరాఖండ్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని వివరించారు. 25ఏళ్ల క్రితం రూ.4 వేల కోట్లు ఉన్న ఉత్తరాఖండ్ బడ్జెట్ ఇప్పుడు లక్ష కోట్లు దాటిందని, ఇదే ప్రగతికి నిదర్శనం న్నారు. అలాగే ఉత్తరాఖండ్‌లో ప్రవేశ పెట్టిన యూనిఫాం సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తోంద న్నారు. మత మార్పిడి, అల్లర్లకు వ్యతిరేకంగా చట్టాలు ఇప్పుడు జాతీయ ప్రయోజనాల కోసం రాష్ట్రం సాహసోపేతమైన విధానాలను అవలంబి స్తోందని ప్రశంసించారు. అదేవిధంగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం చేపట్టిన వోకల్ ఫర్ లోకల్ కార్యక్ర మాన్ని మోదీ ప్రశంసించారు. దీనివల్ల స్థానిక ఉత్ప త్తులకు జీఐ ట్యాగులు వచ్చాయన్నారు. బద్రి ఆవు నెయ్యి బాగా ప్రాచుర్యం పొందిన దన్నారు. రాష్ట్రంలో తయారు చేసిన అనేక ఉత్పత్తులు ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయ న్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన వారిని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రజల పోరాటాలు తనకు స్ఫూర్తినిచ్చాయన్నారు.



# దేశవ్యాప్తంగా టిజిసిఎస్‌బి దాడులు

### 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

### 754 కేసుల్లో నిందితులు, రూ.95 కోట్లు కాజేసిన వైనం

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) సైబర్ నేరగాళ్ల ఏరివేతకు మరోసారి దేశ వ్యా ప్తంగా దాడులు నిర్వహించింది. 25 రోజుల పాటు పలు రాష్ట్రాలలో అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని నిర్వహించిన దాడుల్లో దేశ వ్యాప్త ంగా 754 కేసుల్లో నిందితులుగా వున్న 81 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. ఈ నేరగాళ్లు అమాయకు ల నుంచి 95 కోట్ల రూపాయలను కాజే సినట్లు తేలింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసి ఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ ఆదివాకం మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో సైబర్ నే రాలపై ఉక్కుపాదం మోపే క్రమంలో రాష్ట్రంలో నేరాలకు పాల్పడిన నేరగాళ్ల భరతం పట్టేందుకు టిజిసిఎస్ బి ఈ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 74 మంది పురుషులు, ఏడుగురు మహిళలు సైబర్ నేరాలకు పాల్పడిన నేపథ్యంలో అరెస్టయ్యారు. అరెస్టయిన వారిలో కేరళ నుంచి 21 మంది పురుషులు, ఏడుగురు మహిళలు, మహారాష్ట్ర నుంచి 23 మంది పురుషులు, ఎపి నుంచి 10 మంది పురుషులు, తమిళనాడు నుంచి ఏడు గురు పురుషులు, కర్ణాటక నుంచి 13 మంది పురుషులు వున్నారు. కాగా అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు వున్నారు.

వీరిలో 34 కోట్ల 70 లక్షల 900 రూపాయలను ఆయా బ్యాంకుల నుంచి తప్పుడు ఖాతాలతో నగదు తీసుకున్న వారు కావడం గమనార్హం. 53 మంది మ్యూల్ ఖాతాలు కలిగిన వారున్నారు. వీరి వద్ద నుంచి 84 సెల్ ఫోన్లు, 101 సిం కార్డులు, 89 బ్యాంకు పాస్ పుస్తకాలు జప్తు చేశారు. కాగా నిందితుల్లో ఐడిఎఫ్‌సి సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌తో పాటు ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి, బంధన్ బ్యాంకు మేనేజర్ కూడా వున్నారు. నిందితుల్లో పలువురు ఉన్నత విద్య ను చదివిన వారు వున్నారు. తెలంగాణలో నమోదైన 41 కేసుల్లో వీరంతా నిందితులుగా తేలింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అదనపు ఎస్‌పి బిక్షం రెడ్డి, డిఎస్‌పి సూర్య ప్రకాష్, హరికృష్ణ, ప్రసాద్ తదితరులను టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ అభినందిం చారు. కాగా అరెస్టయిన నిందితులకు రాష్ట్రంలో వున్న లోకల్ నేరగాళ్లతో గల లింకులను ఛేధించే పనిలో సైబర్‌క్రైం పోలీసులు ఉన్నారు.

## ఆర్గానిక్ ఎరువుల తయారీ

### రూ.5 కోట్లతో హైదరాబాద్‌లో యూనిట్

### వియత్నాం సంస్థతో వ్యవసాయ 'వర్సిటీ ఒప్పందం

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంటల సాగులో విచక్షణారహితంగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో భూమితోపాటు, వాతావరణం, నీరు కలుషితం అవుతోంది. ఈ నేపథ్యంలో రసాయనిక ఎరువులు ముఖ్యంగా యూరియాకు ప్రత్యామ్నా యంగా ఆర్గానిక్ ఎరువులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే అత్యధిక నాణ్యత గల ఆర్గానిక్ ఎరువులను ప్రయోగాత్మకంగా రైతులకు చెంతకు తీసుకొచ్చేందుకు వియత్నాంకు చెందిన బయోవే ఇంటర్నేషనల్ ఆర్గానిక్ ప్రైవేటు సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించి త్వరలో రూ.5 కోట్ల వ్యయంతో ఆర్గానిక్ ఎరువులు తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనికి సంబంధించిన వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరిస్తూ వ్యవసాయ మార్కెట్ యార్డులు, కూరగాయలు, గృహ తదితర వ్యర్థాలతో అధిక పోషక విలువలు గల ఆర్గానిక్ ఎరువులను తయారు చేస్తామన్నారు. రెండేళ్ల తర్వాత ఈ జీవ ఎరువులు ఉత్పత్తులు అన్నీ కోణాల నుంచి శాస్త్రవేత్తలు మదింపు చేసి రైతులకు పెద్ద ఎత్తున అందించనున్నట్లు వెల్లడించారు. జీవ వ్యర్థాలను జీవ ఎరువులుగా వినియోగించడం వల్ల పర్యావరణంలో కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడంతోపాటు ప్రభుత్వాలపై రాయితీల భారం తగ్గడం, భూసార క్షీణత సైతం తగ్గుతుందని పేర్కొన్నారు.

# గోపీనాథ్ మరణం ఇంకా మిస్టరీయే..

### తల్లి మహానందకుమారి ఆరోపణ

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ కీలక పరిణా మం చోటుచేసుకుంది. తన కుమారుడైన మాగంటి గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందని ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎప్పుడు మృతిచెందారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. జూన్ 6వ తేదీన చనిపోయారా 8న చనిపోయారా? అన్నదీ సందేహంగానే ఉందని వివరించారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చిన తర్వాతే గోపీనాథ్ మరణ వార్తను బయటకు చెప్పటం వెనక పరమార్థం ఏమిటో ఇప్పటికీ తెలియటం లేదన్నారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గోపీనాథ్ మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మృతిపై ఆమె అనుమా నాలు వ్యక్తం చేశారు. గోపీనాథ్ 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారని, అలాంటి వ్యక్తి హాస్పిటల్‌లో ఉంటే ఒక్క రోజు కూడా తనను చూడటానికి టైమ్ ఇవ్వలేదని వాపోయారు. ఒక్క అటెండర్‌ను కూడా పెట్టలేదని గోపీనాథ్ జూన్ 8న చనిపోయారని కేటీఆర్ వచ్చిన అనంతరం గోపీనాథ్ మరణవార్తను బయటకు చెప్పారని ఆరోపించారు. లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, తన పేరు కూడా లేదని మొదటి భార్య తో విడాకులు కూడా కాలేదని చెప్పారు. తాను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయ లేదన్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో తమ పేరు లేదని వివరిం చారు. కేటీఆర్‌తో తనకు జరిగిన అన్యాయం గురిం చి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేద న్నారు. ఇది డబ్బు సమ స్య కాదని మాకు గుర్తిం పు లేకనే ఇలా మీడియా ముందుకొచ్చామన్నారు. తల్లిగా ఎంతో బాధపడు తున్నానని అన్నారు. సునీతకు టికెట్ ఇచ్చేట ప్పుడు కేటీఆర్ తనకు కనీసం సమాచారం ఇవ్వలేదన్నారు.

**మాకు గుర్తింపు లేదు : తారక్**

తమకు లీగల్‌గా ఎలాంటి గుర్తింపు లేదని గోపీనాథ్ మొదటి భార్యకుమారుడైన తారక్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అమ్మతో చట్టపరంగా విడాకులు కాలేదు. తారక్ అంటే ఎవరో తెలియ దన్న మాగంటి సునీత జూన్ 6వ తేదీన నాకు మొదటి సారి కాల్ చేశారు. ఎవరో తెలియకపోతే ఎందుకు ఫోన్ చేసినట్లు? గ్రాడ్యుయేషన్ డేకి రావాలని మానాన్న అనుకున్నారు. కానీ, ఇంతలోనే హఠాత్తుగా మృతిచెందారు. సునీత నాకు ఫోన్ చేసి నువ్వు ఇండియా రావాల్సి న అవసరం లేదు. రెజ్యూమ్ పంపితే కేటీఆర్ అంకుల్ కంపెనీస్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పారని తెలిపారు. జూన్ 25వ తేదీన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అప్లై చేశారు. అప్పుడు అఫిడవిట్‌లో ఎవరి పేర్లు పెట్టారనేది నాకు తెలియదు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలి' అని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహానందకుమారి, మాలిని, తారక్ తదితరులు

### మాగంటిపై వచ్చిన ఆరోపణలు..

## నిఘా వర్గాల ఆరా

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ మాజీ ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి, మొదటి భార్య సహా కుటుంబీకు లు చేసిన ఫిర్యాదుపై ఓవైపు పోలీసులు విచారణ ప్రారంభించగా దీనిపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. దీంతో పాటు మాగంటి గోపీనాథ్‌పై జూ బ్లీహిల్స్‌లో కొందరు ఆదివారం చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ చేబట్టగా నిఘావర్గాలు అంతర్గతంగా సమాచారం సేకరిస్తున్నాయి. జూబ్లీహిల్స్ మాజీ ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంపై ఆయన కుటుంబీకులు చేస్తున్న ఆరోపణలు ఓవైపు సంచలనం రేపుతుండగా ఇందులోని నిజానిజాలను వెలికితీసే పనిలో పోలీసులు నిమగ్న మయ్యా రు. జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు ఎంఎల్‌ఎగా ఎంపికైన గోపీనాథ్ నాలు గు నెలల క్రితం అనారోగ్యంతో మరణించడం తెలిసిందే. ఆయన ఎంఎల్‌ఎగా వున్నంత వరకు అనారోగ్యంతో మరణించే వరకు కుటుంబ విషయా ల గురించి ఎవరికీ పెద్దగా తెలియదనే చెప్పాలి. అయితే ఆయన చనిపోయాక జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక రావడం విదితమే. ఈ స్థానం నుంచి ఆయన రెండో భార్య సునీత బిఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తుం డడం తెలిసిందే. అయితే హఠాత్తుగా గోపీనాథ్ మొదటి భార్య మాలినీ దేవి వా రి కుమారుడు తారక్‌తో పాటు ఆయన తల్లి మీడియా ముందుకు వచ్చి గోపీనాథ్ మరణంపై అనుమానాలు వున్నాయని ఏకంగా పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఇదే విషయమై కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా విచారణకు డిమాండ్ చేశారు. దీనిపై గోపీనాథ్ తల్లి, మొదటి భార్య వారి కుమా రుడు ఆదివారం నాడు మరోసారి మీడియా ముందుకు వచ్చి బిఆర్‌ఎస్ నాయకులపై ఆరోపణలు చేశారు. గోపీనాథ్ మృతిపై విచారణ చేయాలని వా రు డిమాండ్ చేశారు. ఓవైపు వీరు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతుండగానే ఫిలింనగర్‌లో గోపీనాథ్ బాధితులుగా చెపుకున్న కొం దరు మీడియాతో మాట్లాడుతూ ఎంఎల్‌ఎగా వున్న సమయంలో మాగంటి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిం చారు. వీటిపైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, నిస్పక్షపాతంగా విచారణ చేయాలని వారు కోరారు. వీటన్నింటి నేపథ్యంలో నిఘా వర్గాలు గోపీనాథ్ మరణంతోపాటు ఆయన అనారోగ్య సమస్యలు, ఆసుపత్రిలో చికిత్స పొందిన సమయంలో వాడిన మందుల వివరాలను ఆరా తీస్తున్నా యి. దీంతోపాటు గోపీనాథ్‌పై కొందరు చేసిన ఫిర్యాదులపైనా పోలీసుల నుంచి నిఘా వర్గాలు వివరాలు సేకరిస్తున్నాయి.

### సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్‌కు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సవాల్

# తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం పాత్రపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బిజెపిపై, కేంద్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణను నిర్లక్ష్యం చేస్తుందంటూ రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత పదేళ్లుగా తెలంగాణకు అనేక అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 2023 జూన్ 7న తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం పాత్ర పేరుతో బాగ్ లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో ప్రజలకు నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వం చేసిన కార్యక్రమాలపై ప్రజెంటేషన్ ఇచ్చానని, మరోసారి తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం చేసిన కార్యక్రమాలపై బహిరంగ చర్చ జరిగేవిధంగా సహకరించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్‌కి కేంద్ర మంత్రి లేఖ రాశారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియాల్సి అవసరం ఉందని, అందుకే తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో సిద్ధంగా ఉన్నామని, అందుకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా ఈ ఓపెన్ డిస్కషన్ ఏర్పాటు చేయాలని ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్‌కి రాసిన లేఖలో కోరారు. తేదీ, సమయం నిర్ణయించి వారిద్దరిని ఆహ్వానించాలని, వాస్తవాలు ఏమిటో తెలంగాణ ప్రజలకు, దేశ ప్రజలకు తెలిసే విధంగా మీడియా ముందు నిర్మాణాత్మకమైన చర్చకు చొరవ తీసుకోవాలని కోరారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి మాట్లాడే భాష ప్రెస్ క్లబ్ నియమ నిబంధనలకు అనుగుణంగా, పద్ధతిగా, పార్లమెంటరీ పద్ధతిలో ఉండాలనే విషయం అర్థం చేసుకుని వ్యక్తిగత, అసహ్యపు మాటలు లేకుండా సానుకూల చర్చ జరిగేలా చూడాలని కోరుతున్నానని ఆ లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### కొరత లేకుండా యాసంగి ఎరువులు

### వ్యవసాయ శాఖ అప్రమత్తం

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజనులో ఎరువుల కొరత లేకుండా రాకుండా చూసేందుకు వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ఇందుకు అనుగుణంగా ఎరువులను ప్రధానంగా యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఈ యాసంగి సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 10.40 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా వేసింది. యూరియాతో పాటు, 1.45 లక్షల టన్నుల డీఏపీ, 7 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.65 లక్షల టన్నుల ఎంఒపి, 0.60 లక్షల టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా 60 నుండి 70 శాతం యూరియాను ముందుగానే నిల్వ ఉంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 1.43 లక్షల టన్నుల యూరియా, 58 వేల టన్నుల డీఏపీ, 2.09 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ తెలిపింది. రానున్న రోజుల్లో నిల్వలు మరింత పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విధంగా సరఫరాలు జరిగితే రైతులకు ఇబ్బందులు రాకుండా ఎరువులు పంపిణీ చేయవచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించి కేంద్రంతో సంప్రదింపులు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో గత నెలలో కేటాయించిన వాటితో పాటు, నవంబర్, డిసెంబర్ నెలల్లో నెలకు 2 లక్షల టన్నుల చొప్పున 6 లక్షల టన్నులు సరఫరా చేయాలని కేంద్రాన్ని ఇప్పటికే కోరింది.


# అభివృద్ధి, సంక్షేమం చూపి ఓట్లడిగే స్థితి కాంగ్రెస్‌కు లేదు

### హామీలు అమలుచేయలేక బిజెపిపై బురద జల్లుతున్నారు

### తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రూ.12 లక్షల కోట్లు కేటాయించింది

### ఉపఎన్నికల్లో న్యాయబద్ధ తీర్పు ఇస్తారన్న నమ్మకముంది

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూపించి ఓట్లు అడగాల్సిన పరిస్థితిలో లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిజెపి విజయం కోసం నిరంతరంగా శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, ఈ ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకుని, మతపరమైన ప్రాతిపదికపై ఓట్లు అడుగుతుందని, ఒకవైపు బిజెపిని మతోన్మాద పార్టీ అంటూ ముద్ర వేస్తూ, మరోవైపు తామే మతం పేరుతో ఓట్లు అడుగుతున్నది కాంగ్రెస్ పార్టీ అన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ చేసిన ప్రచారం పూర్తిగా మత ఆధారితమే. అభివృద్ధి గుర్తించి మాట్లాడాల్సింది పోయి, మత ప్రేరేపణతో ప్రచారం చేసిందన్నారు. డిప్యూటీ సిఎం క్రిస్టియన్ సమాజాన్ని ఉద్దేశించి క్రిస్టియన్లు అందరూ కాంగ్రెస్‌కే ఓటేయాలి, బిజెపికి కాదు అని పిలుపునిచ్చారు. అది మత ప్రేరేపణ కాదా?స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అంటేనే ముస్లిం, ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని ప్రచారం చేశారు. అంటే కాంగ్రెస్‌లో ఉన్నవాళ్లు అందరూ ముస్లింలుగా మారిపోయారా? మిగతా వర్గాల ఓట్లు మీకు అవసరం లేదా? రేవంత్ రెడ్డి ఇప్పుడు రేవంతుద్దీన్‌గా మారిపోయినట్టుందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక బిజెపిపై బురద చల్లడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు... కేంద్రం తెలంగాణకు ఏం ఇచ్చిందని పదేపదే విమర్శిస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు కేంద్రం నుంచి ఏం తెచ్చారంటూ మాట్లాడుతున్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు కిషన్ రెడ్డి-బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధి కోసం రూ.12 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014-2025 మధ్యకాలంలో రవాణా, విద్య, ఆరోగ్యం, పరిశోధన, మహిళా సాధికారత, క్రీడలు, పర్యాటకం వంటి రంగాల్లో వందలాది ప్రాజెక్టులకు వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇవి హైదరాబాద్‌ను జాతీయ-అంత ర్జాతీయ స్థాయిలో అత్యున్నత మౌలిక సదుపాయాల నగరంగా మార్చాయి.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకీకరణకు రూ.719 కోట్లు., చర్లపల్లి స్టేషన్‌లో కొత్త టెర్మినల్ నిర్మాణం, హైదరాబాద్, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, మలక్‌పేట్ రైల్వే స్టేషన్లను వందల కోట్ల రూపాయాలతో ఆధునీకరిస్తుం దన్నారు. ఇంత పెద్ద మొత్తంలో రైల్వే ఆధునీకరణ జరగడం భారతీయ జనతా పార్టీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కృషి వల్లే అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపిపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అన్నారు. మూసి ప్రాజెక్ట్ విషయంలో బిజెపి అడ్డుపడుతోందని చెప్పే రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. పేదల ఇళ్లకు రక్షణగా నిలిచింది బిజెపినే అన్నారు. పేదల కన్నీళ్లపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే మీ కుట్రలను ఎండగట్టామన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో బీదల సొమ్ము దోచుకుంటూ వారి జీవితాలను ఆగం చేస్తుందన్నారు. మరి ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మించిన సలకం చెరువులోని ఓవైసీ ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చడం లేదు? మూసి పునరుద్ధరణకు ఎలాంటి రోడ్‌మ్యాప్ ఉంది? డిపిఆర్ లేకుండా ప్రాజెక్టు ఖర్చులు ఎలా అంచనా వేశారు?రేవంత్ రెడ్డి పాలనలో హైడ్రా పేరుతో ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చుతారోననే భయం ప్రజల్లో నెలకొందన్నారు. కాంగ్రెస్ - ఎంఐఎం బంధం.. ఇప్పుడు కాంగ్రెస్ అంటే ఎంఐఎం, ఎంఐఎం అంటే కాంగ్రెస్‌గా మారింది. గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసిన అభ్యర్థిని ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేయిస్తున్నారు. బిజెపి నాయకుల మధ్య ఎటువంటి విభేదాలు లేవు. కానీ కాంగ్రెస్ సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేస్తూ, బిజెపి నాయకులు ప్రచారంలో పాల్గొనడం లేదంటూ తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తుందన్నారు.


భారత్ డైనమిక్స్ లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వ సంస్థలు) రక్షణ మంత్రిత్వశాఖ
గచ్చిబౌలి, హైదరాబాద్: - 500 032

రిఫరెన్స్ : BDL/CC/OT/GT/010/2025-26 తేది: 10.11.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన

స్వదేశీ పోటీ బిడ్డింగ్ ఆహ్వానిస్తూ

| క్ర.సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
|---|---|---|---|
| 1 | 66605 | భానూర్, BDL వద్ద ప్లాంట్ & టౌన్‌షిప్‌లో ఉద్యానవన నిర్వహణ. | 129.15 లక్షలు |

తదుపరి వివరాలకు వెబ్‌సైట్ https://bdltenders.abcprocure.com, select online tenders on dashboard దయచేసి వీక్షించండి. బిడ్స్ ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "ఏదైనా సవరణ మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడును. మరియు వార్తా పత్రికలలో కాదు".
• బిడ్డర్లు BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors నిబంధనావళిలో ఆన్‌లైన్ విక్రేత రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేయవలసినదిగా కోరడమైనది.
అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comm)

వార్త

జీవితాన్ని చక్కగా ఉపయోగించుకోవాలనుకునే వారు వృద్ధుల అనుభవం యువకులుగా ఉన్నప్పుడే అలవర్చుకోవాలి.

-విప్లార్స్

# పత్తి రైతులకు దిక్కెవరు?


ఉలవ చేను పెట్టినాయన ఊరకే ఉండక పత్తి సాగు చేసి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడన్న సామెత తెలుగునాట విరివిగా వాడుతుంటారు. పత్తి వ్యవసాయానికి ఈ సామెత అక్షరాలా కుదురుతుంది. పత్తి కష్టాలు ఈ నాటివి కావు. నిన్నమొన్నటి భారీ వర్షాలైనా, అతి భారీ వర్షాలైనా, మొంథా తుఫానైనా పత్తి సాగుకు కష్టాలు తెచ్చిపెట్టాయి. పంట నీట తడిసి తేమతో నిండిపోయింది. వరుణుడి స్పర్శను ఎవరూ తప్పించుకోలేరు. ఏదోచేయాలని చూస్తే ఏదో అయ్యిందన్న చందాన కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్ మొబైల్‌యాప్'ను రాష్ట్ర సిఎం యాప్‌తో అనుసంధానం చేయడంతో కొత్త చిక్కొచ్చి పడింది. నిన్న మొన్నటి మొంథా తుఫానుతో పత్తి రైతు దిగాలు పడినా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశగా చూస్తున్న సమయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి షరతులు మరింత బాధిస్తున్నాయి. వర్షప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో పత్తి రైతులు భారీగా నష్టపోయారు. చేతికందిన పంట నీటి పాలై పెట్టుబడులు కూడా రాని పరిస్థితులున్నాయి. అయినా ఏదో దేవులాట. ఆంధ్రప్రదేశ్‌లో 2020–2025 ఖరీఫ్ సీజన్‌లో 4.5 లక్షల హెక్టార్లలో పత్తిసాగు జరిగింది. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా. పత్తి పంట దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధరకన్నా తక్కువ ధరకే పత్తి అమ్ముకుంటున్నారు. ఈ సందర్భంగానే కపాస్ కిసాన్ యాప్‌ను కేంద్రం ముందుకు తెచ్చింది. కానీ ఇందులో బాగా తిరకాసు ఉండటం వలన 'తేమ' శాతం విషయంలో రైతులు బంబేలెత్తుతున్నారు. సిఎం యాప్, ఆధార్ ఆధారిత ఈ పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్లు పూర్తి డిజిటలైజ్డ్ చేయబడిన విధానంలో నిర్వహిస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. 2025–26లో పత్తి మార్కెటింగ్ సీజన్‌లో సమీపంలోని కొనుగోలు కేంద్రంలో స్లాట్ తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చునని ప్రత్యేకించి వార్తా పత్రికల్లోను ప్రకటనవచ్చింది. తెలంగాణలో రైతుల బీమా రికార్డులను డిజిటలైజ్ చేసినందున స్లాట్ బుకింగ్‌కు ముందే వారి రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేసుకోవాలని కోరింది. ఇంతవరకు బాగానే ఉంది. ఇందులో ఉదహరించిన తేమ శాతంలోనే రైతులకు అభ్యంతరాలున్నాయి. తేమ శాతం 8 శాతం మించకపోతే నాణ్యతా ప్రమాణాల ప్రకారం రైతుకు కనీస మద్దతు ధర చెల్లించగలమని సిసిఐ ప్రకటించింది. కొన్ని సడలింపులు కూడా భారీ స్థాయిలోనే ఉంటాయని భావించి రైతు కొనుగోలు కేంద్రాలకు చేరక ఒక్కొక్కటిగా తెలిసి తమ పత్తి ఉత్పత్తులను ఇక్కడ అమ్ముకోవడం నష్టమనే భావనతో ఉన్నారు.తీరా కేంద్రంలో ఆరా తీస్తే తేమ శాతం 8శాతం మించి 12 శాతానికి చేరుకుంటే, 8 శాతం కంటే ఎక్కువ తేమ శాతం నిష్పత్తిలో మొత్తాన్ని కనీస మద్దతుధరలో తగ్గించి మాత్రమే చెల్లిస్తారని స్పష్టంగా పేర్కొంది. అంతేగాక అధిక తేమ కారణంగా తగ్గింపులు, కోతలు లేకుండా ఉండాలంటే పత్తిని ఆరుదల తర్వాతనే కేంద్రానికి తీసుకురావాలని పత్తి రైతులకు సిసిఐ విజ్ఞప్తి చేసింది. ఈ విధంగా పత్తి ఉత్పత్తులకు తేమ శాతం లింకులన్నీ బయటపెట్టారు. సిసిఐ వైఖరికి నిరసనగా గత రెండు రోజుల పాటు సిసిఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపివేయాలని రాష్ట్ర కాటన్ మిల్లర్లు వ్యాపారుల సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. నిజానికి సిసిఐ దేశవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే తెచ్చినట్లు చెబుతున్న నిబంధనలు జిన్నింగ్ మిల్లుల యాజమానులకు ఏమాత్రం నచ్చినట్లు లేదు. వారే సమ్మెకు పిలుపునిచ్చారు. తెలంగాణలో గత యేడాది వానాకాలం సీజన్‌లో 25 లక్షల మంది రైతులు 43లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తే 21 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సిసిఐ మద్దతు ధరకు కొనుగోలు చేయగలిగింది. అదే సమయంలో జిన్నింగ్ మిల్లులు యాజమానులు,దళార్లు రైతుల ఆధార్ కార్డులు,పాస్ పుస్తకాల జిరాక్స్‌లను తీసి తమవద్దే ఉంచుకొని వారి నుంచి అతి తక్కువ ధరకు ఆ పత్తిని కొనుగోలు చేశారు. తిరిగి ఆ సరుకును నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులకు తోలి మద్దతు ధరకు అమ్మేశారు.దళారులు ఇలా తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుని లాభాల నార్జించారు. ఈ విషయాన్ని గుర్తించినందునే సిసిఐ కొత్త విధానాన్ని ఆశ్రయించింది. ఇదిలా ఉంటే మరోసమస్య కూడా పత్తి రైతును నడిరొడ్డు మీద నిలబెట్టింది. డైరక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ సంస్థ అంచనాలమేరకు తెలంగాణలో సగటున ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వస్తుంది. కాగా దళారులు, జిన్నింగ్ మిల్లుల యాజమానులు అతి తక్కువధరకు రైతుల నుంచి కొన్న సరుకును లాభసాటిగా అమ్ముకోడానికి ఉన్న ఈ అవకాశాన్ని లబ్ధి చేసుకునేవారు. సిసిఐ తాజా నిబంధనల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల కోటాను 7 క్వింటాళ్లుగా మార్చడం కూడా దళారులకు లాభాలు తగ్గిపోతున్నాయి. ఈ కారణంచేతనేతమ ఆటలు సాగడం లేదని జిన్నింగ్ మిల్లులు వారు సిసిఐ కొత్త విధానాలను వ్యతిరేకిస్తున్నా రు. ఏ జిల్లా జిన్నింగ్ మిల్లులు ఆ జిల్లాలోని పత్తిని మాత్రమే కొనసాగించాలని ఉన్న నిబంధన పట్ల కూడా వారికి ఆటంకంగా ఉంది. దాంతో ఇలాంటి షరతులతో తాము జిన్నింగ్ మిల్లులను నడపలేమని ఖరాఖండిగా చెప్పారు.ఏమయితేనే అన్ని విధాల పత్తి రైతు మెడమీద నే కత్తి వేటు పడినట్లుంది. పత్తిరైతు, దళారులు, జిన్నింగ్ మిల్లుల మధ్య జరుగుతున్న తేడాపాడాలను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జోక్యంతో పూర్తి అవగాహన కల్పించే విధానాన్ని ప్రభుత్వాలు చేపడితే రైతుల్లో ఆందోళన తగ్గుతుంది.

దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఆత్మగౌరవంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.



అంబేద్కర్

కృతజ్ఞత అన్నది గొప్పగా అలవర్చుకున్న గుణాల ఫలం. దీనిని మనం మోటు మనుషులలో చూడలేం. అంత నాజూకైంది.



శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### కలవరపరుస్తున్న రైలు ప్రమాదాలు

ఇటీవలి రైలుప్రమాదాలు దేశాన్నికలవరపరిచాయి. అనేక కుటుంబాలు దుర్ఘటనలతోదుఃఖంలో మునిగిపోయాయి. ప్రయాణం సురక్షితమై ఉండాలి కాని ప్రాణాలను ముప్పులో పెట్టే ప్రయాణ మార్గంగా మారడం అత్యంత ఆందోళనకరం. ఈనేపథ్యంలో రైల్వేశాఖ వెంటనే శూన్య ప్రమాద లక్ష్యం (జీరో యాక్సిడెంట్ మిషన్)ను అమలు చేయాలి. ఇదికేవలంఒక ప్రణాళికలేదా నినాదంమాత్రమే కాకుండా, రైల్వే వ్యవస్థ మొత్తం దృక్కోణాన్ని మారుస్తూ, భద్రతను మొదటి ప్రాధాన్యంగా మలచే విధానంగా ఉండాలి. రైల్వే వ్యవస్థలోపాతబడ్డ పట్టాలు, సంకేతాల వ్యవస్థ లోపాలు, యంత్రపరికరాల నిర్వాహణలో నిర్లక్ష్యం, సిబ్బందికి సరైన శిక్షణలో లోటు ఇలాంటి అనేక అంశాలు ప్రమాదా లకు దారితీస్తుంటాయి. వీటిని ఒక్కొక్కటిగా విశ్లేషించి కఠిన చర్యలు తీసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వాతావరణ మార్పుల ప్రభావం

మన దేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు ఈరంగంపై తీవ్రప్రభావాన్ని చూపుతున్నాయి. వర్షపాతం విధానం అస్థిరంగా మారడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు ఏర్పడటం, వరదలు రావడం వంటి అంశాలు రైతులకు పెద్దసవాలుగా మారాయి. వర్షాలు సమయానికి పడకపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు అధిక వర్షాలు పడి నీట మునిగే పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితులు పంట దిగుబడిని తగ్గించడమే కాకుండా రైతుల ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### పెరుగుతున్న వాయు కాలుష్యం

దేశంలో మహా నగరాలు వాయుకాలుష్య కోరల్లో చిక్కుకునిఉన్నాయి. దేశ రాజధానిఅందులో ప్రధానంగా ఉంది. పౌరులు తమ సొంత జీవన ప్రదేశాలను విడిచి వెళ్లలేరు. నివారణ చర్యలు కాగితాలమీదే ఉన్నంత కాలం వ్యక్తుల బాధ్యత, ఇంగితం ఉండదు. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికర వాయువులు ప్రవేశించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్థితి వస్తుంది.

-బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### పెండింగ్ బకాయిలు చెల్లించాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల బంద్ కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు రోజులు పూర్తవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీవంటి అన్ని ప్రొఫెషనల్ కళాశాలలు మూతపడ్డాయి. ఫీరీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నడిమాండ్‌తో 'ఫతి'(ఫెడరేషన్ ఆఫ్‌టీచర్స్ అండ్ ఇన్స్టిట్యూట్స్) పిలుపునిచ్చిన ఈ బంద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు ఏకమై బంద్‌ను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల ఫీరీయింబర్స్మెంట్ బకాయిలను క్లియర్ చేయకపోవడం వల్ల పరిస్థితి విషమంగా మారిందని తెలుస్తుందిఇందులో కనీసం రూ.5వేలకోట్లు వెంటనే విడుదల చేయాలని, మిగతా రూ.5వేల కోట్లను వచ్చే పది నెలల్లో, నెలకు రూ.500కోట్ల చొప్పున చెల్లించాలి.

- కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

### పాత్రికేయులతో జాగ్రత్త

జర్నలిస్టులు, పాత్రికేయుల సహాయంతో వారి అండదండలతో వారి రాతలద్వారా లభించినప్రచారంతో గతంలోకొందరు అనాయాసంగ అధికార పగ్గాలను చేపట్టి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగలిగారు. అయితే కొద్ది కాలానికే వారికి అధికార మదం తలకెక్కింది. అహంకారంతో తమను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగారు. నియంతలా మారి ఇష్టానుసారం పాలన చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను పాత్రికేయులను చిన్నచూపు చేశారు. వారిని తిట్టి అవమానించారు. ఆ తర్వాత ఏం జరిగింది. ఎవరివల్లనైతే అధికారంలోకి వచ్చారో వారి వల్లనే దాన్ని పోగొట్టుకుని పదవీచ్యుతులయ్యారు.

- శాస్త్రి, హైదరాబాద్

### మందాన్ని విజయం

మందాని విజయం ప్రత్యేకం. ట్రంప్ భావజాలంలో ఉన్న లోతు అయిన చేదు ఆలోచనపై మంచి సాధించిన విజయం కాబట్టి. ఇస్లామిక్ భావజాలన్ని తుడిపేయాలి అనియురప్‌తో సహా మిగితా దేశాలలో జరుగుతున్న భావజాలానికి వ్యతిరేకంగా సాధించిన విజయం కాబట్టి. అయితే ఒకటి మందానిని ఎందుకు మెచ్చుకోవాలి. పాలస్తీనాలో జరుగుతున్న నరమేధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందుకు. రాజ్యం ఎవరి సొత్తు కాదు అని నిరూపించినందుకు.

-భారత అవినాష్,జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రోడ్డు ప్రమాదాలను అరికట్టేదెలా?

**ప్రమాకరదరమైన రోడ్డు మలుపులు, గుంతలు, అస్తవ్యస్త డ్రైనేజీలు, బ్రిడ్జ్ పారాపెట్ కట్టడాలు లాంటివి క్రమపద్ధతిలో సరిచేయకపోతే ప్రమాదాలను నివారించటం పోను పోను మరింత కష్టతరమవుతుంది. ఢీకొట్టే వాహనాల ప్రమాదాలు, ముందు జాగ్రత్త చర్యలు రోడ్లపరంగా 'ఇండికేటర్స్' ద్వారా హెచ్చరికలు చేసే సాధనాల ద్వారా, రోడ్ పెట్రోలింగ్ ద్వారా తలపెట్టే బాగా తగ్గిపోవచ్చు. వాణిజ్య వాహనాల మీద నియంత్రణలు చేపట్టాలి. రహదారులను టౌన్లలో రోడ్లను ఉపయోగించే పాదచారుల కోసం ప్రత్యేక రక్షణా విధానాలను, అధ్యయనం చేసి ప్రవేశపెట్టగలుగుతే చాలావరకు ప్రమాదాలు తగ్గిపోతాయి. హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ, చెన్నయి, కోల్‌కత్తా లాంటి పెద్ద పెద్ద పట్టణాలలో 'రోడ్ ట్రాఫిక్' ఈ మధ్యకాలంలో అపరిమితంగా పెరిగిపోవటం వల్ల నివారణ, నియంత్రణ చర్యలు సరైన విధంగా లేకపోవడం వల్ల రోజురోజుకూ అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికీ మించి పోయింది లేదనుకొని తక్షణం తగు చర్యలు తీసుకొంటేనే రోడ్డు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది.**



రావులపాటి సీతారాం రావు

పదే పదే రోడ్డు ప్రమాదాలు సృష్టించే కుటుంబాల నష్టాలు, పసితనంలో ఉన్నవారూ, పెళ్లాడి సంతోషంగా భవిష్యత్తును ఊహించుకొంటున్న నవ వధూవరులూ రహదారులపై సమిధలుగా రాలిపోవటం వల్లించడం వల్ల లాభం ఏమిటి? పాలకులూ ప్రభుత్వాలూ, రహదార్ల నిర్మాణం చేసేవారూ, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్‌లోని ఉద్యోగస్థులూ, చివరకు రోడ్లను వినియోగించుకున్న పాదచారులూ పోలీసులూ ఎవరూ పట్టించుకోనప్పుడు ప్రమాదాల దారి ప్రమాదాలదే, బాధితుల దారి బాధితులదే అస్తవ్యస్త పరిస్థితులు, నిర్లక్ష్య ధోరణులను సమీక్షించుకోవటం వల్ల ప్రయోజనం ఏమిటి అని మనసులను కలుక్కుమనిపించే ప్రశ్నలు తలెత్తక మానవు. నవంబరు 3నాడు మరో ఘోర రోడ్డు ప్రమాదం చేవెళ్ల వద్ద జరిగింది. ఇలాంటి ప్రమాదాలు దేశమంతటా క్రమం తప్పకుండా జరుగుతూనే ఉన్నాయి. దాదాపు 400 మంది రోడ్లను వినియోగించుకుంటున్న పాదచారులూ, వాహనాలు నడిపేవారూ, బస్సుప్రయాణీకులూ ప్రతి రోజూ మన దేశంలో ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. లెక్కలు చూసుకోవటం కాదు ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులు నిర్వర్తించాల్సిన కార్యక్రమం తలపెట్టాల్సిన చర్యలూ చాలా ఉన్నాయి. వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రభుత్వాలకూ అధికారులకూ బాధ్యత గుర్తు చేసే ప్రయత్నమే ఎవరైనా చేపట్టాలి. చర్యలు సత్వరం తీసుకునే బృహత్తర ప్రణాళికలతోపాటు ఈ ప్రమాదాలు తగ్గే భాగంలోని చర్యలు ప్రతిరోజూ సమీక్షించుకొని ఎంత నిష్పత్తిలో ప్రమాదాలు తగ్గాయి అన్న అంచనాలు కూడా వేసుకుంటూ నివారణ చర్యలు తీసుకున్నప్పుడే కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. అప్పుడే ఈ రహదారులను మృత్యుదారుల పరిధుల్లోంచి మనదేశంలో కొంత వరకైనా తప్పించగలం. మన రాష్ట్రాల్లోనే కాదు మొత్తం దేశంలో చాలా వరకు రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వీధిలైట్లు ఉండవు. రోడ్డు డివైడర్లు ఉండవు. రోడ్లలోని మలుపులూ ప్రమాదస్థలాలూ తెలిపే సైన్‌బోర్డులు ఉండవు. ఇలా లెక్కేసుకుంటూపోతే చాలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలపై ఎన్క్వాయిరీల్లో ఎప్పుడూ తేలేది మానవ తప్పిదాల గురించే. కానీ ప్రమాదాలు చేస్తున్న వాహనాల, వ్యవస్థీకృత తప్పిదాలను గురించి ఎప్పుడో కాని ఆ రిపోర్టులు వెలెత్తిచూపవు. లోతుగా విచారణ చేస్తేనే అసలు కారణాలు బహిర్గతమవుతాయి. అప్పుడే నివారణ చర్యలూ, లోపాలను సరిదిద్దే చర్యలు తీసుకొనే అవకాశం ప్రభుత్వాలకూ, అధికారులకూ ఏర్పడుతుంది. మనదేశంలో అసలు ప్రహసనం డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చే కార్యక్రమంతోనే మొదలవుతుంది. నిర్లక్ష్యాల మొదటిసాక్ష్యం అక్కడే దొరుకుతుంది. మొదటగా ఈ లైసెన్సులు గ్రాంట్ చేసే అధికారులు చూడాల్సింది డ్రైవింగ్ విధానాలను గురించి అప్లయి చేసిన వారికున్న అవగాహనకు సంబంధించిన థియరిటికల్ నాలెడ్జ్ కాదు, (అది అన్ని టెస్టుల తర్వాత తేలిగ్గా అధికారులకు తెలుస్తుంది) లైట్ వెహికల్, హెవీ వెహికల్ నడుపుతున్నప్పుడు నైపుణ్యాన్ని సాధించారా లేదా? జాగ్రత్తలు వాహనాలు నడిపేటప్పుడు ఏ విధంగా




తీసుకోగలరు? అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను వారి నైపుణ్యంతో కొంతలో కొంతైనా నివారించగలరా అన్నదే ప్రమాదాల నుంచి డ్రైవింగ్ చేసేవారు ఏ విధంగా వాహనాన్ని తమతో ప్రయాణం చేసేవారిని, తమను రక్షించుకోవటానికి అవరమైన రక్షణ చర్యలు తలపెట్టగలరు అన్న విషయంలోని నాలెడ్జిని పరీక్షించే టెస్టులు, నవీన పద్ధతుల్లో రూపకల్పన చేసి, వినియోగించినప్పుడే ఈ పరీక్షలకు నిజమైన అర్థంతోపాటు ప్రయోజనం ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో జరిగే సంఘటనల్లో ముఖ్యమైనవి. వెనుక నుంచి వచ్చి గుద్దే వాహనాలే ప్రమాదాలకు బహుళసంఖ్యలో దారి తీస్తున్నాయి. గొందుల్లోంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలూ, టిప్పర్లు, ట్రాక్టర్లూ వెనుకాముందు చూడకుండా వేగంగా వచ్చి యాక్సిడెంట్స్ చేస్తాయి. వాహనాలు ఏ తీరున నడపాలో అన్న అంశాన్ని ప్రత్యేకంగా ఇతర దేశాల్లో మాదిరి అధ్యయనం చేసి, ఆ విధమైన శిక్షణను తప్పని సరిగా డ్రయివింగ్ లైసెన్సులు పొందాలనుకున్న వారికి ఇచ్చే ఏర్పాటు వ్యవస్థ వీలైతే ప్రభుత్వపరంగా ఉండక తప్పదు. ప్రైవేట్ సంస్థలకు ఒప్పచెబుతే అవినీతికి ఆస్కారం ఉంటుంది. డబ్బులు సంపాదించటమే ధ్యేయంగా పెట్టుకొనే కొన్ని ప్రైవేట్ సంస్థలు ఈ శిక్షణ ప్రక్రియను సొంతం చేసుకొని నిజమైన శిక్షాణా విధానాలకు తిలోదకాలు ఇచ్చే అవకాశం ఉంది. అందుకే ఎక్కువ శ్రద్ధ ప్రభుత్వాలు లైసెన్సు ముందు శిక్షణ విధానాన్ని పెట్టే ప్రణాళిక ఉంటే పరిస్థితులు మెరుగుకావచ్చు. డ్రైవింగ్ టెస్టు తూతూ మంత్రంగా ఆర్.టి.వోలు చేయించే అలవాటు మానుకోవాలి. అడ్డగోలుగా లేన్ మార్పులు నిర్లక్ష్య డ్రైవింగ్, సెలఫోన్లు వాడుతూ డ్రైవ్ చేయడం లాంటివి నిత్యకృత్యంగా చేసే వాహనదారులమీద కఠినమైన చర్యలు పోలీసులూ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలూ తీసుకోకతప్పదు. అలాంటి సందర్భాల్లో వెనుకా ముందూ చూడకుండా లైసెన్సులు రద్దుచేస్తేనే ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణులకు నిలుపుదల ఉంటుంది. లైసెన్స్‌పొందే వారి నిపుణతను క్షుణ్ణంగా టెస్ట్ చేసే విధానాలు సంబంధిత సంస్థలు ప్రవేశపెట్టాలి. డ్రైవింగ్ లైసెన్స్ పొందటం అంత సులభం కాదు. ఒళ్లు దగ్గర పెట్టుకొని అలవాట్లు లేని చోదకులకే ప్రభుత్వం లైసెన్సులు గ్రాంట్ చేస్తుంది అన్న బలమైన సంకేతం ప్రజల్లోకి వెళ్లినప్పుడే నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు కొంతలో కొంత బ్రేక్ పడే అవకాశాలు మెరుగవుతాయి. 'సేవ్ లైఫ్ ఫౌండేషన్' అనే సంస్థ లైసెన్స్ సేవ్ కేంద్రాలు, 'పాస్‌పోర్ట్ సేవ్ కేంద్రాల మాదిరి ఉండాలి అని ఈ మధ్యబహుళ ప్రచారం చేస్తున్నది. అయిదు ప్రమాదాల్లో ఒక ప్రమాదం తప్పనిసరిగా ఒక వాహనానికి మరొక వాహనం ఎదురుగా బలంగా గుద్దుకొని భయంకరంగా జరిగేవే అని అధ్యయనం చేసిన వారు రిపోర్టులు ఇస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఫోర్ లేన్ హైవేస్ మీద, రాంగ్ సైడ్ డ్రయివింగ్‌వల్ల రోడ్లు డివైడర్స్ బాగాలేకపోవడం వల్ల జరిగేవే అని తేల్చి చెబుతున్నారు. నేషనల్ హైవేస్ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మార్గదర్శక సూత్రాలననుసరించి ఉండాలి అన్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లు లేదు. మోటార్ వెహికల్ చట్టాల్లో ఇలాంటి సూత్రాలననుసరించి మార్పులు, చేర్పులూ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రమాకరదరమైన రోడ్డు మలుపులు, గుంతలు, అస్తవ్యస్త డ్రైనేజీలు, బ్రిడ్జ్ పారాపెట్ కట్టడాలు లాంటివి క్రమపద్ధతిలో సరిచేయకపోతే ప్రమాదాలను నివారించటం పోను పోను మరింత కష్టతరమవుతుంది. ఢీకొట్టే వాహనాల ప్రమాదాలు, ముందు జాగ్రత్త చర్యలు రోడ్లపరంగా 'ఇండికేటర్స్' ద్వారా హెచ్చరికలు చేసే సాధనాల ద్వారా, రోడ్ పెట్రోలింగ్ ద్వారా తలపెట్టే బాగా తగ్గిపోవచ్చు. వాణిజ్య వాహనాల మీద నియంత్రణలు చేపట్టాలి. రహదారులను టౌన్లలో రోడ్లను ఉపయోగించే పాదచారుల కోసం ప్రత్యేక రక్షణా విధానాలను, అధ్యయనం చేసి ప్రవేశపెట్టగలుగుతే చాలావరకు ప్రమాదాలు తగ్గిపోతాయి. హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ, చెన్నయి, కోల్‌కత్తా లాంటి పెద్ద పెద్ద పట్టణాలలో 'రోడ్ ట్రాఫిక్' ఈ మధ్యకాలంలో అపరిమితంగా పెరిగిపోవటం వల్ల నివారణ, నియంత్రణ చర్యలు సరైన విధంగా లేకపోవడం వల్ల రోజు రోజుకూ అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికీ మించి పోయింది లేదనుకొని తక్షణం తగు చర్యలు తీసుకొంటేనే రోడ్డు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. •

# వైద్యరంగంలో ఎఐ పాత్ర ప్రధానం

బి. మధుపాళి

ఇప్పుడు ప్రపంచ యావత్తు ఎఐ మాయాజాలం వైపు కన్నెత్తి చూస్తున్నది అనే మాట సత్యదూరం కాదు. ఇక ఎఐ గురించి సూక్ష్మంగా చెప్పాలంటే ఇది ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంటే కృత్తిమ మేధ, ఇది ఏకంగా మనుషుల సహజమైన మేధకు పోటీగా మారబోతుంది అనే ప్రమాద ఘంటికలు ప్రస్తుతం మ్రోగుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక విధంగా చెప్పాలంటే ఇప్పుడు అన్ని రంగాలలో అంటే ఆర్థికరంగం, ఆరోగ్యరంగం, ఈ కామర్స్ రంగం, మార్కెటింగ్, టెలికం రంగం, వ్యవసాయ రంగం, పరిశ్రమల రంగం, భీమా రంగం, పర్యాటక అతిథ్య రంగాలు, మీడియా, వినోద రంగాలు ఇలా ఒకటేమిటి దాదాపు అన్ని రంగాలలోని వారు కూడా (ఏఐ) కృతిమ మేధ టెక్నాలజీని ఇప్పుడు ఉపయోగించుకునే పనిలో భాగంగా ఇప్పటికే చాలా బిజీగా పక్కా ప్రణాళికతో వున్నాయి అనే మాట అక్షరసత్యం. ప్రస్తుతం భారత వైద్య రంగంలో కృతిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ) సృష్టిస్తున్న ప్రభంజనం, విప్లవం అంతా ఇంతా కాదు. ఎందుకంటే భవిష్యత్‌లో వైద్యరంగం అంతా ఏఐ, మెషిన్ లెర్నింగ్, రోబో టెక్స్ పైనే ఆధారపడే పరిస్థితులు స్పష్టంగా మన కళ్ల ముందు కనపడుతున్నాయి. రోగ నిర్ధారణ, సర్జరీ, ఇతర చికిత్సల కోసం ఏఐ టూల్స్‌ను ఈపాటికే మన వైద్యులు వినియోగిస్తున్నారు అనే మాట సత్యం. అంతేకాదు ఇక రోగుల రికార్డులు, ఎక్స్ రే, సీటీ స్కాన్, రక్త పరీక్షలు, జన్యు క్రమ విశ్లేషణ వంటి అంశాల్లో వైద్యులు సిబ్బందికి సహాయకారిగా పనిచేసే ఏఐ ఉపకరణాలెన్నో ఇప్పుడు మనకు అందుబాటులో వుంటున్నాయి. అదేమాదిరి ఇప్పుడు జెట్ స్పీడ్ వేగంతో కూడిన వీర ప్రతాపంతో ఎనలేని సమర్థతను చూపుతున్న ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వైద్యులు, సిబ్బందికి పని ఒత్తిడిని తగ్గించడంలో అత్యంత హితోధికమైన పాత్రను పోషిస్తున్నది అనే మాట ఎవ్వరూ కాదనలేని వాస్తవం. అంతేకాకుండా క్యాన్సర్, రెటినోపతి, ఊపిరితిత్తుల జబ్బులు, రక్తంలో ఇన్ఫెక్షన్, అరుదైన వ్యాధుల నిర్ధారణలో తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులు అన్ని కూడా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని విసృతంగా వినియోగిస్తూ తమ శ్రమను





తగ్గించుకోవడంతో పాటు, సర్జరీల్లో సైతం ఈ రోబోలను వినియోగించడం ఒక సాధారణ విషయంగా మారిపోవడం అనేది నిజంగా రోజురోజుకు సైన్స్ రంగం కొత్త పుంతలు త్రోక్కుతున్నది అనే వాస్తవాన్ని మనకు బహిర్గతం చేస్తున్నది. ఇంకా చెప్పుకుంటూపోతే జాయింట్ రీప్లేస్‌మెంట్, ఎముకలకు సంబంధించిన ఇతర సర్జరీల్లో రోబోటిక్ సర్జరీల వినియోగం వల్ల సర్జరీ అనంతరం కూడా రోగికి సహజ సిద్ధమైన శరీర ఆకృతి, సర్జరీ సక్సెస్ రేట్ ఎక్కువగా ఉండటాన్ని బట్టి ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం యావత్ మానవాళి ఆరోగ్యంగా జీవించడానికి, అమాంతం వారి ఆయుష్షను పెంచడానికి ఎలాంటి వెలకట్టలేని, అజారామమైన సేవలు అందిస్తుందో మనకు చాలా స్పష్టంగా విశదమవుతున్నది. పైగా ఇది మన కళ్లముందు సాక్షాత్కరిస్తున్న జగమెరిగిన సత్యం కూడా. అదే విధంగా ఈఏఐ సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని మానవాళికి జరుగుతున్న సర్జరీల్లో కచ్చితత్తం, తక్కువ కోతలు, రక్తస్రావం లేకపోవడంతో పాటు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం కూడా తక్కువగా ఉండటం, రోగులకు చేసే సాధారణ చికిత్సలలో పోలిస్తే చాలా త్వరగా వారు కోలుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా వినియోగంలో ఉండటంలో చికిత్సలో కొంత ఎక్కువ ఖర్చు అవుతున్న పరిస్థితి మనకు అయా ఆసుపత్రులలో కనపడుతున్నది. ఏదిఏమైన రానున్నది అంతా ఏఐ సాంకేతిక పరిజ్ఞానమే అనే పచ్చి యదార్థాన్ని రోగుల విషయంలో అవి నిరూపిస్తున్న ఊహాకుకూడా అందని పలు అద్భుతమైన ఫలితాలను బట్టి మనకు ఏఐ ప్రాధాన్యత దాని సమర్థత ఏపాటిదో ఉదాహరణలతో సహా మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనడంలో ఎలాంటి సందేహనికి తావు లేదు. ఏమైనా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఇప్పటికే విజయవాడ, గుంటూరు, విశాఖ నగరాలలోని అనేక ఆసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మిగతా చిన్న చితక నగరాలకు కూడా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేసే సర్జరీలు అందుబాటులోకి తేగలిగితే అయా ప్రాణాంతకర వ్యాధులతో సతమతమయ్యే రోగులకు ఎంతో కొంత ఉపశమనంలభించడం తథ్యం. అన్నింటికి మించి ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం ముమ్ముందు వైద్యరంగంలో మరిన్ని ఊహకు కూడా అందని సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలువడం తథ్యం అనే వాస్తవం మనకు బాగా హితబోధ అవుతున్నది. •

# విద్యుత్ శాఖలో నూతన సంస్కరణలు!

బైరబోయిన వెంకటేశ్వర్లు

కేంద్రం వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన విద్యుత్ చట్ట సవరణ బిల్లు 2025తో దేశంలో విద్యుత్ విధానాలు అన్ని మారిపోనున్నాయి. ఇది దేశ చరిత్రలో అతి పెద్ద విద్యుత్ సంస్కరణలుగా చెప్పవచ్చు. కేంద్రం ప్రభుత్వ ప్రకారం ఇప్పటికే దేశంలో అన్ని డిస్కమ్‌ల అప్పులు 6.9 లక్షల కోట్లు దాటాయి. డిస్కమ్‌లను అప్పుల భారీ నుండి తప్పించడానికి, విద్యుత్ పంపిణీ రంగంలో పోటీతత్వం పెంచడానికి , పునరుత్పాదక ఇంధన వనరులను వాడకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి బిల్లు ముసాయిదాను అభిప్రాయాలు తెలపడానికి నెలరోజుల గడవుతో రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. ఈ చట్ట సవరణ బిల్లు అమల్లోకి వస్తే ప్రతి వినియోగదారుడు మొబైల్ నెట్వర్క్ (ఎయిర్‌టెల్, ఐడియా, బిఎస్ఎన్ఎల్)ల తమకు నచ్చిన విద్యుత్ సప్లయర్‌ను ఎంచుకోవచ్చు. కానీ ఈ బిల్లు ద్వారా కేంద్రం కొన్ని సందేహాలను నివృత్తి చేస్తేనే రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించే అవకాశం ఉంది. అందులో ముఖ్యమైనవి రాష్ట్రంలో అన్ని వర్గాల వినియోగదారులకు సార్వత్రిక సేవా బాధ్యతగా విద్యుత్ పంపిణీ చేసే ప్రభుత్వడి స్కమ్‌లుఎటిసి నష్టాల వల్ల ప్రతి సంవత్సరం రాబడి, వ్యయాల మధ్య వ్యత్యాసం ఉండి అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కానీ ఈ నూతన విద్యుత్ సవరణ బిల్లు ద్వారా ప్రైవేట్ డిస్కమ్‌లు ఏర్పడడం వల్ల ప్రభుత్వ డిస్కముల ఆదాయం తగ్గుతుంది. ఈ తగ్గిన రాబడితో ఇప్పటివరకు ఉన్న అప్పులు తీర్చడం సాధ్యం కాదు. ఈ అప్పుల గురించి బిల్లులో ఏ ప్రస్తావన కూడా లేదు. ఈ అప్పులు ఎలా తీర్చాలో సందేహం నివృత్తి చేస్తేనే బిల్లు ముందుకు సాగే అవకాశంఉంది. కొత్త విద్యుత్ చట్ట సవరణ ప్రకారం ప్రైవేట్ డిస్కమ్‌లు ప్రభుత్వ డిస్కమ్ నెట్వర్క్‌ను వాడుకొని వీలింగ్ చార్జెస్ చెల్లించి విద్యుత్ పంపిణీ చేసే వెసులుబాటు కల్పించనుంది. దీనివల్ల చాలామంది హై టెన్షన్ విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వ డిస్కముల నుండి ప్రైవేట్ డిస్కమ్ మారే అవకాశం ఉంది. దానివల్ల ప్రభుత్వ డిస్కంల రాబడి తగ్గుతుంది. రాష్ట్రం అంతా గుత్తాధిపత్యంల ప్రతి వినియోగదారుడికి విద్యుత్ పంపిణీ చేస్తే వచ్చిన ఆదాయం సరిపోక అప్పులో మునిగిన డిస్కమ్‌లు, కేవలం వీలింగ్ చార్జెస్ ద్వారారాష్ట్రం అంతా విస్తరించి ఉన్న ఈ నెట్వర్క్‌ను మైంటైన్ చేయడం



చాలా కష్టతరమైనది. ఉద్యోగుల జీతాలే పంపిణీ సంస్థలకు గుదిబండలుగా మారుతాయి. ఉద్యోగుల సర్దుబాటు జీతభత్యాలు చెల్లించడం ప్రభుత్వ డిస్కమ్‌లకు పెద్ద సవాల్‌గా మారుతుంది. ఉద్యోగుల నుండి కూడా తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది. కొత్త విద్యుత్ సవరణ బిల్లు ప్రకారం ఒకే ప్రాంతంలో ఒకటి కంటే ఎక్కువ డిస్కమ్లు విద్యుత్ సరఫరా చేసుకోవచ్చు కానీ ఏ డిస్కమ్ నుండి ఎంత విద్యుత్ వాడారు అని లెక్కించడం చాలా కష్టతరమైనది. లక్షల మంది వినియోదారులలో ఎవరెంత వినియోగించారని లెక్కించడం మనకున్న మీటర్ సాంకేతికత ప్రకారం చాలా కష్టతరమైనది. ప్రస్తుతం డిస్కంలో ఒక వర్గం వారికి తక్కువ ధరకు (గృహాలకు రైతులకు) మరొక వర్గం(పారిశ్రామిక, వాణిజ్య) వారికి ఎక్కువ ధరకు విద్యుత్ను అందిస్తుంది. దీనినే క్రాస్ సబ్సిడీ అంటారు. కానీ కొత్త సవరణ బిల్లు ప్రకారం వీటిని క్రమంగా తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని నేరుగా వినియోగదారులకు ఇచ్చే అవకాశం కల్పిస్తుంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తాయో లేదో చూడాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు భారం. ప్రభుత్వ డిస్కంలు ఇప్పటి వరకు సార్వత్రిక సేవా బాధ్యతగా ప్రతి వినియోగదారుడి విద్యుత్ లోడ్‌ను రాష్ట్ర కాంట్రాక్టెడ్ కెపాసిటీగా లెక్కిస్తూ దానికి అనుగుణంగా దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎస్) చేసుకుంటాయి. ఈ ఒప్పందం ప్రకారం విద్యుత్ను వినియోగించుకున్న వినియోగించుకోకున్న జనరేటింగ్ స్టేషనులకు ఫిక్స్డ్ చార్జీలను చెల్లించాలి. కొత్త విద్యుత్ సవరణ చట్టప్రకారం ప్రైవేట్ డిస్కమ్‌లు నూతన ఒప్పందాలు( పిపిఎ)లు చేసుకుంటే ఈ ప్రభుత్వ డిస్కంలో దీర్ఘకాలిక ఒప్పందాలు మరో ఆర్థిక భారంగా మారుతాయి. పైన పేర్కొన్న అంశాలతో పాటు ప్రైవేట్ డిస్కమ్ కేవలం అధిక రాబడి ఉన్న ప్రాంతాలకే పరిమితమై ప్రభుత్వ డిస్కమ్లో ఆదాయరాబడి తక్కువగా ఉండి, సబ్సిడీదారులకు మాత్రమే పంపిణీ చేయవలసి వస్తే ప్రభుత్వ డిస్కమ్‌లపరిస్థితి ఇంకా దయనీయంగా మారవచ్చు. దీనితో పాటు ప్రకృతి విపత్తులు తుఫాను సంభవించినప్పుడు ప్రభుత్వ డిస్కములుయుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ని పునరుద్ధరిస్తాయి. ఇటువంటి సందర్భంలో ప్రైవేట్ డిస్కోంట్‌లో స్పందనఎలా ఉంటుందో చూడాలి అన్న సందేహాలను నివృత్తి అయితేనే ఈ చట్ట సవరణ బిల్లు ఏ ఆటంకం లేకుండా ముందుకు సాగుతుంది. దీనిపై రాష్ట్రాలు ఏం అభిప్రాయాలు తెలుపుతాయో వేచి చూడాలి. •



# వ్యక్తులు, పార్టీలకు అతీతంగా ఆర్ఎస్ఎస్

## కేవలం విధానాలకే మద్దతు

### సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్

**బెంగళూరు, నవంబరు 9:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేవలం విధానాలకు మాత్రమే మద్దతు ఇస్తుందని, ఏ ఒక్క వ్యక్తికో లేదా రాజకీయ పార్టీకో కాదని ఆ సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్ స్పష్టం చేశారు. అయోధ్యలోని రామమందిర నిర్మాణం డిమాండ్‌కు కాంగ్రెస్ మద్దతిస్తే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి మద్దతు ఇచ్చేవాళ్లని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వార్షికోత్సవం సందర్భంగా బెంగళూరులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ తాము ఏ ఒక్క రాజకీయ పార్టీకి విధేయులం కాదని తేల్చిచెప్పారు. మేం ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వమని, ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనమని, సమాజం ఐక్యత కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని అన్నారు. రాజకీయాలు విభజిస్తాయి మేము కేవలం విధానాలకే మద్దతు ఇస్తాం ఉదాహరణకు మేము అయోధ్యలో రామమందిరం కోరుకున్నాం కాబట్టి ఆలయం ఎవరు నిర్మిస్తే వారికే మా స్వయంసేవకులు మద్దతుగా ఉన్నార అని తెలిపారు. కాంగ్రెస్ దానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా స్వయంసేవకులు ఆ పార్టీకి ఓటు వేసేవారని ఆయన వ్యాఖ్యానించారు.

మాకు ఒక పార్టీతోనే ప్రత్యేకమైన అనుబంధం లేదు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పార్టీ కాదు అన్ని పార్టీలు మావే ఎందుకంటే అవి భారతీయ పార్టీలు, మేము కేవలం విధానాలకు మాత్రమే మద్దతు తెలుపుతాం రాజకీయాలకు కాదు, మాకు మా అభిప్రాయాలు ఉన్నాయి. ఈ దేశం ఒక నిర్దిష్ట దిశలో వెళ్లాలని మేము కోరుకుం టున్నాం. దేశాన్ని ఆ దిశలో నడిపించే వారికి మేము మద్దతు ఇస్తామని మోహన్ భగవత్ ఉద్ఘాటించారు. ఎవరూ బ్రాహ్మణులుగా ఉండ టానికి అనుమతించం ఎవరూ ఏ జాతికి చెందిన వారిగా ఉండటానికి కూడా అనుమతించం ముస్లింలకు అనుమతి లేదు, క్రైస్తవులకు అను మతి లేదు అయితే, భిన్న మతాలకు చెందినవారు వాళ్లు ముస్లింలైనా, క్రైస్తవులైనా తమ మతపరమైన భిన్నత్వాన్ని వదిలిపెట్టి ఆర్ఎస్ఎస్‌లోకి రావచ్చు మీరు అందులోకి వచ్చినప్పుడు భారతమాత బిడ్డగా వస్తారు. ముస్లింలు, క్రైస్తవులు వస్తారు, కానీ మేము వారి సంఖ్యను లెక్కించం, వారు ఎవరో అడగబోమని ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యానించారు.

అలాగే, పలువురు కాంగ్రెస్ నాయకులు తరుచూ లేవనెత్తుతోన్న 'ఆర్ఎస్ఎస్ నమోదు' అంశంపై కూడా మోహన్ భగవత్ స్పందించారు. 'దీనికి సమాధానం చాలాసార్లు చెప్పాం కానీ, ఈ ప్రశ్నను తిరిగి తిరిగి అడుగుతారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925లో ప్రారంభమైంది. అప్పట్లో మేము బ్రిటిష్ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ చేసుంటామని భావిస్తున్నారా? స్వాతంత్ర్యం అనంతరం చట్టాలు కూడా నమోదు తప్పనిసరి చేయలేదు. 'బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్' (వ్యక్తుల సమూహం)అనేరూపంలో కూడాచట్టబద్ధ హోదా ఉంది. సంఘ్‌ను కూడా అటువంటి సమూహంగా వర్గీకరించాం, మేము గుర్తింపు పొందిన సంస్థే' అని పేర్కొన్నారు.

'మూడుసార్లు ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారంటే ప్రభుత్వం మమ్మల్ని గుర్తించినట్టే మేము లేకపోతే, ఎవరిని నిషేధించారు? ప్రతిసారీ కోర్టులు ఆ నిషేధాన్ని రద్దు చేశాయి. అసెంబ్లీ, పార్లమెంటులోనూ ఆర్ ఎస్ఎస్‌కు అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ ఎన్నోసార్లు ప్రశ్నలు అడిగారు. చట్టపరంగా, వాస్తవపరంగా చూస్తే సంఘ్ సంస్థే. మేము రాజ్యాంగ విరుద్ధం కాదు కాబట్టి, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఎన్నో సంస్థలు ఉన్నాయి, అవి కూడా నమోదు కాలేదు. హిందూ ధర్మం కూడా నమోదు కాలేదు'అని ఆయన అన్నారు. ఆర్ ఎస్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నాయకులు విమర్శలు గుప్పిస్తోన్న వేళ భగవత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.




# షట్‌డౌన్ సంక్షోభం

## అమెరికాలో 1700పైగా విమానాలు రద్దు

**వాషింగ్టన్, నవంబరు 9:** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్‌ను తగ్గించాలన్న ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఏ) ఆదేశాలతో విమానయాన సంస్థలు వరుసగా 1700కి పైగా విమానాలను రద్దు చేశాయి. దీంతో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ ప్రకారం నిన్న మధ్యాహ్ననికే 1700కి పైగా విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో అత్యధికంగా 130 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. అట్లాంటా, చికాగో, డెన్వర్, నెవార్క్ వంటి ఇతర ప్రధాన ఎయిర్‌పోర్టులలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. న్యూయార్క్ నగర పరిసరాల్లోని విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత కారణంగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. షట్‌డౌన్ కొనసాగితే రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 40 విమానాశ్రయాల్లో 4 శాతం విమానాలను తగ్గించామని, మంగళవారం నుంచి ఈ సంఖ్యను మరింత పెంచి, శుక్రవారం నాటికి 10 శాతానికి చేర్చుతామని ఎఫ్ఎఏ తెలిపింది. షట్‌డౌన్ కొనసాగి, మరింత మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విధులకు దూరమైతే మరిన్ని కోతలు విధించాల్సి వస్తుందని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ హెచ్చరించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దాదాపు నెల రోజులుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు అందడం లేదు. దీంతో చాలామంది అనారోగ్య కారణాలు చూపి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరతకు ఇది తోడవడంతో విమానాల నిర్వహణ కష్టంగా మారింది. జీతాలు లేకుండానే వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా ఓవర్ టైమ్ చేయాల్సి వస్తోందని, కొందరు తమ కుటుంబ ఖర్చుల కోసం రెండో ఉద్యోగం కూడా చేసుకుంటున్నారని నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ ఆకస్మిక పరిణామాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మనమందరం ప్రయాణాలు చేస్తాం. అందరికీ ఎక్కడికో ఒకచోటికి వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాను' అని మియామి నుంచి డొమినికన్ రిపబ్లిక్‌కు వెళుతున్న ఎమ్మా హోల్గిన్ అనే ప్రయాణికురాలు తన ఆవేదన వ్యక్తం చేశారు.

# వంతెన నిర్మిస్తేనే మేం ఓట్లేస్తాం..

## బీహార్‌లో మూడు గ్రామాల ప్రజల భీష్మప్రతిజ్ఞ



**పాట్నా, నవంబరు 9:** బీహార్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి, మహిళా సంక్షేమం, యువత ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. కానీ, గయకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని కొన్ని గ్రామాలకు మాత్రం అభివృద్ధి అనేది 77 ఏళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. తమ దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చని పాలకులపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మోర్హర్ నదిపై వంతెన నిర్మించే వరకు ఓటు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. పత్రా, హెర్హంజ్, కేవల్‌డిహ్ అనే మూడు గ్రామాలకు చెందిన సుమారు 8,000 మంది ప్రజలు తరతరాలుగా ఒకే ఒక్క కోరిక కోరుతున్నారు. తమ గ్రామాలను బాహ్య ప్రపంచంతో కలిపే మోర్హర్ నదిపై ఒక వంతెన నిర్మించాలన్నదే వారి డిమాండ్. ఆ నదిని వారు "నిస్సహాయ నది"గా పిలుచుకుంటున్నారు. "బ్రిడ్జి కట్టేంత వరకు ఓటు వేయం. 'పుల్ నహీ తో వోట్ నహీ' (వంతెన లేకుంటే ఓటు లేదు)" అని ఓ మహిళా ఓటరు స్పష్టం చేశారు. "77 ఏళ్లుగా అందరూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నాయకులు వస్తుంటారు, పోతుంటారు కానీ హామీలు మాత్రం నెరవేర్చరు. వర్షాకాలంలో నదిలో నీటి మట్టం భుజాల వరకు వస్తుంది. మాకు అభివృద్ధి అంటే ఈ వంతెన నిర్మాణమే" అని ఆమె తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు ఈ గ్రామాలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు కోల్పోతాయి. నిత్యావసరాల కోసం మార్కెట్‌కు వెళ్లాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా, రైతులు తమ పంటను అమ్ముకోవాలన్నా ప్రాణాల మీద ఆశ వదులుకుని నదిని దాటాల్సిందే. అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లడం వీలుకాక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పత్రా గ్రామానికి చెందిన సునీల్ విశ్వకర్మ అనే వ్యక్తికి అనారోగ్యం పాలవగా, నది దాటలేక సరైన సమయంలో వైద్యం అందక నది ఒడ్డునే ప్రాణాలు విడిచాడు. 'నది వల్లే వాడిని ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయాం. అంబులెన్స్ రాలేదు. ప్రైవేట్ వాహనం మాట్లాడితే అది నదికి అవతలి వైపు ఉండిపోయింది' అని విశ్వకర్మ తల్లి కన్నీరు పెట్టుకున్నారు. గర్భిణులు 39 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లేలోపే మార్గమధ్యంలో మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 'వర్షాకాలంలో ఏటా ఇక్కడ కనీసం ఇద్దరు ప్రాణాలు కోల్పోతారు. మా బతుకులు ఇంత దుర్భరంగా ఉన్నాయి' అని మరో గ్రామస్థుడు వాపోయారు.

# బిజెపి ఎమ్మెల్యేపై పోక్సోకేసు నమోదు

## ఆయన సహాయక సిబ్బందిపైనా కిడ్నాప్ బెదరింపుల కేసు



**సిమ్లా, నవంబరు 9:** హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. చురా నియోజక వర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ హన్స్‌రాజ్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మైనర్‌గా ఉన్నప్పుడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని, పెళ్లి పేరుతో మోసం చేశారని ఓ యువతి ఆరోపించడంతో ఈ పరి ణామం చోటుచేసుకుంది. ఈ కేసు నమోదు కావ డానికి ఒక రోజు ముందే, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడితో పాటు మరో సన్నిహితుడిపై కిడ్నాపింగ్ కేసునమోదవడం గమనార్హం. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే హన్స్‌రాజ్‌పై కేసునమోదు చేశారు. చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక (పోక్సో) చట్టంలోని సెక్షన్ 6 (తీవ్రమైన లైంగిక దాడి), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 69 (పెళ్లి పేరుతో మోసగించి లైంగిక దాడి) కింద ఈ కేసు ఫైల్ చేసినట్లు చంబా అదనపు ఎస్పీ హితేష్ లఖన్‌పాల్ ధ్రువీకరించారు.

# ట్రంప్ జోక్యంవల్లే భారత్ పాక్ ఉద్రిక్తతల సర్దుబాటు

## బాకు విక్టరీ పెరేడ్‌లో పాక్‌ప్రధాని షరీఫ్



**బాకు, నవంబరు 9:** భారత్, పాకిస్థాన్ మధ్య గత మే నెలలో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చి, యుద్ధాన్ని నివారించింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపేనని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ప్రశంసించారు. ఆయన 'ధైర్యవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వం' వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని కొనియాడారు. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన విక్టరీ డే పరేడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో షెహబాజ్ మాట్లాడుతూ "ట్రంప్ జోక్యంతో దక్షిణాసియాలో శాంతి పునరుద్ధరించబడింది. ఒక పెద్ద యుద్ధం నివారించబడింది, తద్వారా లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి" అని పేర్కొన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల అనంతరం మే 10న ఇరు దేశాలు 'పూర్తి, తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించినట్లు ట్రంప్ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పాకిస్థాన్ ఈ ఘనతను ట్రంప్‌కు ఆపాదిస్తుండగా, భారత్ మాత్రం ఈ వాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో ఏ మూడో వ్యక్తి ప్రమేయం లేదని, నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగిన అనంతరం ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఒక అవగాహనకు వచ్చాయని న్యూఢిల్లీ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఇదే కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించారు. కరబాఖ్‌లో అజర్‌బైజాన్ సాధించిన విజయం కశ్మీర్ అణచివేతకు గురైన అన్ని దేశాలకు ఆశాకిరణం అని ఆయన అభివర్ణించారు. ఈ విక్టరీ డే పరేడ్‌లో అజర్‌బైజాన్ సైనిక దళాలతో పాటు పాకిస్థాన్, తుర్కియే సైనికులు కూడా కవాతు నిర్వహించారు. పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్17 థండర్ జెట్ల వైమానిక ప్రదర్శనతో ఈ కార్యక్రమం ముగిసింది.

# ఓటు చోరీని దాచేందుకే 'సర్'




## ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైనే దాడి

### నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగితే విజయం మాదే

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

### బీహార్‌లో మార్పు ఖాయం: తేజస్వి

**న్యూఢిల్లీ, నవంబరు 9:** దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా మాదిరే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోనూ ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. ఓటు చోరీని కప్పిపుచ్చుకునేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహించారని రాహుల్ వ్యాఖ్యానించారు. బిజెపి, ఇసి ఉమ్మడి భాగస్వామ్యంతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరంలోనూ, ఆ తర్వాత బీహార్ ఎన్నికల సభల్లోనూ రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే బీహార్‌లో ఖచ్చితంగా ఇండియా కూటమి బంపర్ మెజారిటీతో గెలుస్తుందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. దీంతో ఓట్ల చోరీని సంస్థాగతం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి జరుగుతోంది. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కలిసి ఈ చర్యను సమన్వయం చేస్తున్నారు. ఫలితంగా దేశం తీవ్రంగా నష్టపోతోంది. భారత మాతకు నష్టం జరుగుతోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**మార్పు కోసమే ఓటేయండి: తేజస్వి:** బీహార్ ఎన్నికల్లో ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు, ఖచ్చితంగా ఇండియా కూటమి విజయం సాధించనుందని కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తొలి దశ పోలింగ్‌లో బీహార్ ప్రజలు మార్పు కోసం ఓటేశారని, రేపు జరిగే మలివిడత ఎన్నికల్లో కూడా ఓటర్లు అదే చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరి రోజు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో తేజస్వి యావద్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బీహార్‌లో ఎన్‌డిఏ పాలనలో ఏంచేశారో చెప్పడం లేదని ప్రధాని మోడీ, సిఎం నితీశ్‌కుమార్‌లను లక్ష్యం గా చేసుకుని విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం ఉన్న 17 నెలల సమయంలో ఇచ్చిన రిజర్వేషన్‌గురించి ప్రధాని, మరె వరైనా మంత్రులుగానీ మాట్లాడటం లేదని,ప్రజలకు లభించాల్సిన 65 రిజర్వేషన్‌ను ప్రధాని ఇవ్వలేదని విమర్శించారు. ఆయన బీహార్‌కు, గుజరాత్‌కు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.



# మరణించిన తర్వాత శరీరంలో రక్తప్రసరణ..

## వైద్య చరిత్రలోనే తొలిసారి

### ఆసియాలోనే మణిపాల్ ఆస్పత్రి వైద్యుల ఘనత

**న్యూఢిల్లీ, నవంబరు 9:** ఢిల్లీ వైద్యులు వైద్య చరిత్రలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. ద్వారకలోని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు మరణించిన మహిళ శరీరంలో ఆగిపోయిన రక్తప్రసరణను తిరిగి ప్రారంభించారు. మరణించిన ఆమె అవయవాలను దానం చేసేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆసియాలోనే ఈ ఘనత సాధించిన మొదటి ఆస్పత్రి తమదేనని ఛైర్మన్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. మోటార్ న్యూరాన్ వ్యాధి కారణంగా పక్షవాతం బారిన పడిన గీతాచావ్లా (55) అనే మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా కుటుంబసభ్యుల ఈ నెల 5న ఆమెను మణిపాల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి మరింత దిగజారడంతో మరుసటి రోజు ఆమె మరణించింది. అయితే గీతా చావ్లా అవయవాలు దానం చేయాలనుకుంటున్నట్లు మృతురాలి కుటుంబం తెలియజేయడంతో అక్కడి వైద్యబృందం నార్మోథెర్మిక్ రీజినల్ పెర్ఫ్యూజన్ (ఎన్ఆర్‌పి) అనే అరుదైన ప్రక్రియను నిర్వహించింది. ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్ (ఇసిఎంఒ)ను ఉపయోగించి వైద్యులు మృతురాలి ఉదర అవయవాల్లో రక్త ప్రసరణను విజయవంతంగా పునఃప్రారంభించారు. తర్వాత అవయవాలు సేకరించారు. ఎన్ఆర్‌పిని ఉపయోగించి కాలేయం, మూత్రపిండాలను సురక్షితంగా తీసి ఇతరులకు విజయవంతంగా అమర్చినట్లు వైద్యులు పేర్కొన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచే కాకుండా ఇకపై సహజ మరణాల తర్వాత కూడా మృతుల నుంచి అవయవాలు సేకరించడం సాధ్యమేనని నిరూపించామన్నారు.

# జపాన్‌లో మంత్రుల జీతాలు 'కట్'



ప్రధాని సనాయే తకాయిచి సంచలన నిర్ణయం

**టోక్యో, నవంబరు 9:** జపాన్‌లో నూతన అధ్యాయానికి తెరలేపారు ఆ దేశ ప్రధాని సనాయె తకాయిచి. తనతో పాటు పార్లమెంట్‌లోని క్యాబినెట్ సభ్యులందరికీ చెల్లించే అదనపు భత్యాలపై ఇకపై కోత విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. దీనిపై మంగళవారం ఆ దేశంలో జరగబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రుల జీతాలను తగ్గించాలని ఎంతో కాలంగా వాదిస్తున్న తకాయిచి అక్టోబర్‌లో జరిగిన తన ప్రారంభ సమావేశంలోనే ఈ విషయం పట్ల ఆమె వైఖరిని స్పష్టం చేశారు. క్యాబినెట్ సభ్యులకు జీతాలకు మించి అదనపు భత్యాలు చెల్లించకుండా ఉండేందుకు చట్టసవరణ తీసుకొచ్చేందుకు తాను పనిచేస్తానని నాడు ఆమె పేర్కొన్నారు. జపాన్‌లో పరిపాలనా సౌలభ్యత, ఆర్థిక సంస్కరణల పట్ల నిబద్ధతను ప్రదర్శిం చడంలో భాగంగానే తకాయిచి చేస్తున్న విస్తృత ప్రయత్నాల్లో ఇదొక చర్య. ప్రస్తుతం, అక్కడ ఒక్కో చట్టసభ సభ్యునికీ నెల జీతం 1.294 మిలియన్ యెన్‌లు ఉండగా ప్రధాని అదనంగా 1.152 మిలియన్ యెన్‌లు పొందుతున్నారు. క్యాబినెట్ మంత్రులకు 4,89,000 యెన్‌లు భత్యంగా చెల్లిస్తున్నారు. ఖర్చు తగ్గింపు చర్యలలో భాగంగా ప్రధాని అదనపు వేతనం నుంచి 30 శాతం, మంత్రులు 20శాతం చొప్పున తిరిగి ఇస్తున్నారని ఆ దేశ క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి మినోరు కిహారా ధృవీకరించారు. ఫలితంగా ప్రధాని 3,90,000 యెన్‌లు, మంత్రులు ఒక్కొక్కరు 1,10,000యెన్‌ల చొప్పున పుచ్చుకుంటున్నారు. నూతన ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయాన్ని లిబరల్ డెమోక్రటిక్ పార్టీ కొత్త సంకీర్ణ భాగస్వామి అయిన జపాన్ ఇన్నోవేషన్ పార్టీ స్వాగతించింది.

# నిజ్జర్ హత్య కేసు.. కెనడాకు ఉప్పందించిన బ్రిటన్ గూఢచారులు!



**ఒట్టావా, నవంబరు 9:** ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో భారత్‌ను ఉద్దేశిస్తూ కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల దౌత్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. కెనడాలో కొత్తగా ఏర్పడిన మార్క్ కార్నీ ప్రభుత్వం న్యూఢిల్లీతో బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో నిజ్జర్ హత్యపై తాజాగా విడుదలైన ఓ డాక్యుమెంటరీ ప్రకారం బ్రిటిష్ నిఘా సంస్థ కొందరి కాల్స్‌లోకి చొరబడి సేకరించిన సమాచారాన్ని కెనడాకు అప్పగించింది. దీంతో హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యతో భారత్‌కు సంబంధాలున్నాయంటూ ఆ దేశాధికారులు ఆరోపణలు చేశారు. భారత ప్రభుత్వం కోసం పనిచేస్తున్న కొందరు వ్యక్తులు ఖలిస్థానీ ఉగ్రవాది, 'సిఖ్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జె) ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ, నిజ్జర్ గురించి చర్చించుకుంటుండగా యుకె ప్రభుత్వ కమ్యూనికేషన్స్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వారి కాల్స్ ట్రాక్ చేసినట్లు బ్లూమ్‌బెర్గ్ ఒరిజినల్స్ విడుదల చేసిన 'ఇన్‌సైడ్ ది డెత్స్ దట్ రాక్డ్ ఇండియాస్ రిలేషన్స్ విత్ ది వెస్ట్' అనే డాక్యుమెంటరీ వెల్లడించింది. ఆ కాల్స్‌లో పన్నూ, నిజ్జర్ గురించి భారత ప్రభుత్వం తరఫున పనిచేస్తున్న వ్యక్తులు చర్చించుకున్నట్లు పేర్కొంది. అనంతరం నిజ్జర్‌ను ఎలా హత్య చేయాలనే ప్లాన్ గురించి మాట్లాడుకున్నట్లు బ్రిటిష్ నిఘా సంస్థ గుర్తించినట్లు తెలిపింది. యుకె, యుఎస్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య ఉన్న 'ఫైవ్ ఐస్' ఇంటెలిజెన్స్ షేరింగ్ ఒప్పందంలో భాగంగా బ్రిటన్ జూలై 2023 చివరలో ఈ సమాచారాన్ని కెనడాకు చేరవేయడంతో నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో పురోగతి కనిపించినట్లు విడియో డాక్యుమెంటరీ తెలిపింది. కఠినమైన షరతుల కింద మాత్రమే ఈ దేశాలు నిఘా సమాచారాన్ని పంచుకుంటాయని.. ఎలాక్ట్రానిక్ వ్యవస్థలకు దూరంగా ఉంచుతూ ఎటువంటి సమాచారాన్ని అయినా అధికారులు వ్యక్తిగతంగా వెళ్లి అందజేస్తారని తెలిపింది. అదేవిధంగా నిజ్జర్ హత్య కేసుకు సంబంధించిన వివరాలను కూడా బ్రిటన్ అధికారులు కెనడా ప్రభుత్వానికి ఇచ్చినట్లు వెల్లడించింది. కాగా, ఈ డాక్యుమెంటరీ విడుదలైన తర్వాత సిక్కు సమాఖ్య యుకె భద్రతా మంత్రి డాన్ జార్విస్‌కు లేఖ రాసింది. అందులో నిజ్జర్ హత్యపై ఎంపిలు ప్రశ్నించినప్పుడు బ్రిటన్ ప్రభుత్వం ఈ విషయాలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించింది.

# సంక్షిప్తంగా..

## కుప్పకూలిన సైనిక హెలికాప్టర్: ఏడుగురు మృతి



**మాస్కో, నవంబరు 9:** రష్యాలో ఆర్మీకి చెందిన హెలికాప్టర్ ఒకటి కూలిపోయింది. యుద్ధ విమానాల విడి భాగాలు తయారు చేసే కంపెనీకి చెందిన సిబ్బందితో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ ఓ ఇంటిపై కూలింది. దీంతో మంటలు ఎగిసిపడగా హెలికాప్టర్‌లోని ఏడుగురు ప్రయాణికుల్లో నలుగురు సజీవ దహనమయ్యారు. మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం దక్షిణ రష్యాలోని డాగేస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని రష్యా మంత్రి యారోస్లావ్ గ్లాజోవ్ తెలిపారు. ఈ హెలికాప్టర్‌లో రష్యాలోని కిజ్ల్యార్ ఎలక్ట్రోమెకానికల్ ప్లాంట్‌కు చెందిన సీనియర్ సిబ్బంది ఉన్నారని ఆయన వెల్లడించారు.

## ఆసిమ్ మునీర్‌కు విశేషాధికారాలపై వెల్లువెత్తిన నిరసనలు



**ఇస్లామాబాద్, నవంబరు 9:** పాక్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌కు అపరిమిత అధికారాలు కట్టబెట్టేలా రాజ్యాంగ సవరణకు సిద్ధమైన షహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆదివారం నిరసన కార్యక్రమాలకు దిగాయి. ప్రభుత్వ చర్యలతో రాజ్యాంగ పునాదులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. పాక్‌లోని రాజ్యాంగబద్ధ వ్యవస్థల అధికారాలు, రక్షణలను సమూలంగా మార్చేలా పాక్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చింది. దీని ప్రకారం, సైన్యం, నావికాదళం, ఎయిర్‌ఫోర్స్‌కు అధిపతిగా ఆర్మీ చీఫ్‌ను నియమించేలా ప్రత్యేక చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్స్ (సీడీఎఫ్) పదవిని ఏర్పాటు చేయనున్నారు. ఫీల్డ్ మార్షల్ స్థాయి అధికారికి ఈ పదవిని కేటాయిస్తారు.

## ఎలుగుబంట్ల కట్టడికోసం రంగంలోకి సైన్యం



**టోక్యో, నవంబరు 9:** జపాన్‌లో పెరిగిపోతున్న ఎలుగుబంట్ల అరాచకాన్ని కట్టడిచేసేందుకు ఏకంగా ప్రభుత్వం సైన్యాన్నే రంగంలోకి దించింది. వాతావరణ మార్పులతో ఆహార వనరుల కొరత, శీతాకాలంలోనూ వెచ్చని ఉష్ణోగ్రతలతో హైబర్‌నేషన్ (సుషుప్తావస్థ) ఆలస్యం కావడంతో భల్లూకాలు జనావాసాల్లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వెళ్లడంతో అక్కడ పండ్ల చెట్లు, ఇతర చెట్లు విపరీతంగా పెరగడం కూడా వీటి సంచారం పెరుగుదలకు కారణంగా నిపు ణులు చెబుతున్నారు. కజనో పట్టణంలో ఎలుగుబంట్ల సంచారం ఇటీవల విపరీతంగా పెరిగింది. రైల్వే స్టేషన్లు, రిసార్టులు, సూపర్ మార్కెట్లతోపాటు పాఠశాలల్లోనూ నిత్యం తిరుగుతూ ప్రజలను భయభ్రాం తులకు గురిచేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఎలుగుబంట్ల దాడుల్లో 13 మంది చనిపోయారని, దాదాపు వంద మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

## విదేశాల్లో ఉన్న మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ల అరెస్ట్



**చండీగఢ్, నవంబరు 9:** విదేశాల్లో ఉంటూ భారత్‌లో నేర కార్యకలాపాలు సాగిస్తున్న ఇద్దరు మోస్ట్‌వాంటెడ్ గ్యాంగ్‌స్టర్స్‌ను భారత సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులు అరెస్ట్ చేశారు. వెంకటేష్ గార్గ్‌ను జార్జియాలో అరెస్ట్‌చేయగా మరో గ్యాంగ్‌స్టర్ భాను రానాను అమెరికాలో అదుపులోకి తీసుకున్నారు. అంతర్జాతీయ ఆపరేషన్‌లో హర్యానా పోలీసులు కూడా భాగమయ్యారు. త్వరలో వీరిని భారత్‌కు తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అరెస్టైన వారిలో భాను రానాకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉండటం గమనార్హం. బిష్ణోయ్ గ్యాంగ్‌లో అతడు కీలక సభ్యుడు. కర్నల్ ప్రాంతానికి చెందిన రానాపై చాలా కేసులు ఉన్నాయి. హర్యానా, పంజాబ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఇతడు నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇక వెంకటేష్ గార్గ్‌పై దేశంలో 10కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి.

## పోకిరీలు వాడేది బుల్లెట్లు,ఎస్‌యువి థార్‌లే: డిజిపి

**గురుగ్రామ్, నవంబరు 9:** అల్లరి మూకలు పోకిరీలే ఎక్కువగా బుల్లెట్లు, థార్ ఎస్‌యువిలు వాడుతున్నారని వారిని వదిలేయబోమని హర్యానా డిజిపి ఓ పిసింగ్ వెల్లడించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. గురుగ్రామ్‌లో విలేకరులతో మాట్లాడిన ఓపీ సింగ్, వాహనాల తనిఖీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మేము రోడ్డుపై వెళ్లే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేయం. కానీ, ఒక థార్ కారు కనిపిస్తే దాన్ని ఎలా వదిలేస్తాం? బుల్లెట్ బైక్ కనిపించినా అంతే. ఎందుకంటే సమాజంలో అల్లరిచిల్లరగా తిరిగే వాళ్లంతా ఇలాంటి వాహనాలనే వాడుతున్నారు.

# స్వీయ అవగాహనతోనే సైబర్ నేరాల అదుపు

## వాటి నివారణకు రాష్ట్రవ్యాప్త ప్రచారం : డిజిపి బి.శివధర్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 9, ప్రభాతవార్త:** సైబర్‌క్రైమ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, స్వీయ అవగాహనతోనే సైబర్ నేరాలు అదుపు చేయగలుగుతామని డిజిపి బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కవాడిగూడలోని జలవాయు విహార్ కమ్యూనిటీహాల్ నందు జాగ్రత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్ నినాదంతో సైబర్ నేరాల నివారణకై చేపట్టిన సైబర్ క్రైమ్స్ అవగాహనా కార్యక్రమాను హైదరాబాద్ సీపీ వి.సి.సజ్జనార్‌తో కలసి డిజిపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సైబర్ సింబాల్‌తో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి, బ్యాడ్జీలను వాలంటీర్లకు అందచేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ సాధారణ సమస్య కాదని, ఇది ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్‌కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే నేరాలు చేస్తున్నారని, ఎవరు ధనవంతులు, ఏ ప్రాంతంలో ఉంటారు, వారి వయస్సు వంటి అన్ని వివరాలు తెలుసుకుని, సులువుగా టార్గెట్ చేస్తున్నారని అన్నారు. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని, వారిని ఫోన్లు చేసి భయపెట్టి, మోసం చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నేరాల నిరోధానికి సైబర్ పెట్రోలింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అదుపు చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో కనీసం ఒకరు సైబర్ మోసాల గురించి పూర్తిగా అవగాహన కలిగి, సైబర్ సింబాగా ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుందని అన్నారు. సీపీ వి.సి.సజ్జనార్ మాట్లాడుతూ సైబర్‌నేరాల బారిన పడి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజూ కనీసం కోటి రూపాయల వరకు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల బలహీనతలను అంటే ఆశ భయం వంటి వాటిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్స్‌ను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అజ్ఞాత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచు కోవద్దని, సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930కి కాల్ చేసి, సమాచారం ఇవ్వాలని, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ (డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ డాట్‌సైబర్‌క్రైమ్‌డాట్ గావ్‌డాట్‌ఇన్) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.


సైబర్ క్రైమ్స్ అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డిజిపి బి.శివధర్‌రెడ్డి

ఈ అవగాహనా కార్య క్రమంలో పాల్గొన్నవారితో సైబర్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అద నపు సీపీ(క్రైమ్స్) ఎం.శ్రీనివాస్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి.జోయల్ డేవిస్, డిసిపి (సైబర్‌క్రైమ్) ధార కవిత, అన్ని జోనల్ డిసిపిలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


వట్టినాగులపల్లిలో హెచ్‌సిఎల్ గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైక్లోథాన్ పోటీలను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.

## నిత్య సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

### వట్టినాగులపల్లిలో హెచ్‌సిఎల్ సైక్లోథాన్‌ను జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (నార్సింగి), నవంబరు 9, ప్రభాతవార్త:** నిత్యం సైక్లింగ్ చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, పర్యావరణ పరిరక్షణ సైతం చేసిన వార మవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. ఆదివారం వట్టి నాగులపల్లి ఉస్మాన్‌సాగర్ వద్ద ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన హెచ్ సిఎల్ సైక్లోథాన్‌ను గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రకృతి, ప్రజలకు మేలు చేసే ఇలాంటి మంచి కార్య క్రమాలను నిర్వహించేందుకు మరింతమంది ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సైక్లింగ్ వలన మనిషిలోని అన్ని అవయవాలకు సరైన వ్యాయా మం లభించి ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. సైక్లింగ్ వలన కాలుష్యం వెలువడదని, దీంతో ప్రకృతి సైతం సురక్షితంగా ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన ప్రతినిధులను అభినందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మునింద్ సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో సైక్లింగ్‌పై పెరుగుతున్న ఆసక్తికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. పోటీలలో 50 కిలోమీటర్ల విభాగంలో పంజాబ్‌కు చెందిన హర్షవీర్‌సింగ్, మహారాష్ట్రకు చెందిన పూజా బబన్ డనోల్ మొదటి స్థానంలో నిలిచారు. ప్రొఫెషనల్ రోడ్‌రేస్ 48 కిలోమీటర్ల పురుషుల విభాగంలో హర్ష వీర్‌సింగ్(పంజాబ్), నవీన్ జాన్ (కర్ణాటక), సూర్యతాతు (మహారాష్ట్ర), మహిళల విభాగంలో పూజాబబన్ డనోల్(మహారాష్ట్ర), స్వాతి సింగ్(ఒడిశా), హర్శితాజాఖా (రాజస్థాన్) విజేతలుగా నిలిచారు. ఈ కార్య క్రమంలో హెచ్‌సిఎల్ ప్రతినిధులు, సైక్లిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో సిఐపై వేటు

### ధాన్యం కొనుగోలు కేసులో నిందితులతో కుమ్మక్కు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో వెలుగు చూసిన ధాన్యం కుంభకోణం కేసులో నిందితులను అరెస్టు చేయకుండా వారితో కుమ్మక్కయినందుకు ఓ ఇన్‌స్పెక్టర్‌పై వేటు పడింది. జిల్లాలోని శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుచందర్‌పై వేటు వేస్తూ మల్టీ జోన్ 1 ఐజి చ ంద్రశేఖర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని నర్సింగాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన గోల్‌మాల్‌లో పౌరసరఫరాల అధికారులతో పాటు డిసిఎంఎస్, వ్యవసాయ, పోలీసు అధికారుల పాత్రపై విమర్శలు వచ్చాయి. దీనిపై రైతులు ఆందోళన చేయగా నిందితులను అరెస్టు చేయా ల్సిన పోలీసులు వారికి వత్తాసు పలికారు. దీనిపై శ్రీరాంపూర్ పరిధిలోని జైపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ కేసులో కీలక నింది తుడైన సాయికుమార్‌ను అరెస్టు చేశాక అతన్ని కోర్టులో హాజరు పరచకుండా ఇన్‌స్పెక్టర్ వేణుచందర్ స్టేషన్ బెయిల్ ఇవ్వడంపై రైతులు ఆగ్రహం చె ందారు. ఇదే సమయంలో మరో 12 మంది కూడా ముందస్తు బెయిల్ తీసుకున్నారు. దీని వెనుక సిఐ సహకారం వుందని అభియోగాలు వచ్చాయి. దీంతో సిఐ వేణుచందర్‌పై వేటు పడింది.



## టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం

### సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభి వృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆదివారం బేగం పేట్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో 'తెలంగాణ టెలివిజన్ డెవలప్ మెంట్ ఫోరం' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కీలక చోదక శక్తిగా మారిందని, ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించేందుకు టెలివిజన్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయం, సందర్భం లేకుండా ఎంతో కష్టపడతారని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, వారి పట్ల సీఎం రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవు తాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సంఘం ప్రతినిధులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కస్టమ్ మిల్లింగ్‌కు పదిశాతం గ్యారెంటీకి మిల్లర్లు ససేమిరా

### బకాయిదారులు, మిల్లుల లీజు యాజమాన్యానికి గ్యారెంటీ రేటు 25 శాతం

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ చేయడానికి పదిశాతం గ్యారెంటీ ఇస్తేనే కేటాయిస్తామని ఖరాఖండిగా అంటున్నా రైసు మిల్లర్లలో ఉలుకు పలుకు లేదు. తెలంగాణలో ఈ సీజన్లో 66.8 లక్షల ఎకరాలలో వరి సాగు చేశారు. 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో వ్యవసాయ చరిత్రలోనే రికార్డు నమోదు చేసుకోవడమే కాకుండా 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళ లక్ష్యంతో సరికొత్త రికార్డు సృష్టిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పదే పదే పలు వేదికలపై చెబుతున్నారు. అందులో 40లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు, 40లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలు కొనుగోలు చేస్తామని లక్ష్యం నిర్ధేశించుకున్నారు. ఈ ధాన్యాన్ని సిఎంఆర్ కింద రాష్ట్రంలోని వెయ్యికిపైగా రా రైస్ మిల్లులు, 14వందల బాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయించాల్సి ఉంది.

80 లక్షల మె.ట. ధాన్యానికి మద్దతుధర కింద 22వేల నుంచి 23వేల కోట్లు చెల్లిస్తామని పౌర సరఫరాల శాఖ ఇప్పటి నిధులు స్దిం చేసుకొంది. ఇందులో 10 శాతం అంటే మిల్లర్లు రూ.2300 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాల్సి ఉంది. బకాయిదారులు, లీజు మిల్లులు కలిపితే ప్రభుత్వం గ్యారెంటీ కింద సుమారు మూడున్నవేల కోట్లు రైసుమిల్లర్ల చెల్లించాల్సి ఉంటుంది. ఇంత మొత్తంలో మిల్లర్లు గ్యారంటీలు ఇవ్వడానికి మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ధాన్యం విలువలో 10 శాతం బ్యాంకు గ్యారంటీలు ఇస్తేనే మిల్లర్లకు సిఎంఆర్ ధాన్యం కేటాయింపులు ఉంటాయని, బకాయి పడిన, లీజు తీసుకున్న మిల్లర్లు 25 శాతం గ్యారంటీలు ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

గత వానాకాలం సీజన్లోనూ ఈ నిబంధనలు అమల్లోకి తెచ్చినా రాష్ట్రంలోని మిల్లరు అంతగా పట్టించుకోలేదు. ఈ సీజన్ నుంచి తప్పని సరిగా గ్యారంటీలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అటు మిల్లర్లకు, ఇటు అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వానాకాలంసీజన్లో సీఎంఆర్ తీసుకున్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల రైస్ మిల్లర్లలో చాలా మంది ఈ సీజన్లో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదని తెలుస్తోంది. గత సీజన్లలో కూడా ఇదే విధంగా ఒత్తిడి చేశారని పొరుగు రాష్ట్రాలకు ధాన్యం కేటాయిస్తామని బెదిరించారని ఇలాంటి తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదని రైసు మిల్లర్లు ధీమాతోనే ఉన్నారు. పదిశాతం నిబంధన అమలుకు ఒత్తిడి చేస్తే ధాన్యం సేకరణ విషయంతోపాటు సీఎంఆర్ కేటాయింపులపై ప్రభావం చూపే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన ఈ దశలో అధికారులు మిల్లర్లతో గ్యారంటీలపై సంప్రదింపులు చేస్తుండటం చర్చనీయాంశమవుతోంది. సిఎంఆర్ కింద ధాన్యం తీసుకున్న మిల్లర్లు నిబంధనల ప్రకారం మూడు నెలల్లో మర ఆడించి బియ్యం పౌరసరఫరాల శాఖకు, ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంటుంది.

గడువు ముగిసిన మిల్లర్లు బియ్యం తిరిగి ఇవ్వకపోవడం, బహిరంగ మార్కెట్లో విక్రయించడం తదితర విషయాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అడ్డుకట్ట వేసేందుకు బ్యాంకు గ్యారంటీలను తెరపైకి తీసుకు వచ్చింది

## వరి కోతల యంత్రాలకు భారీ డిమాండ్

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖరీఫ్ వరి కోతలు జోరందుకోవడంతో కూలీలకు కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆధారపడటంతో వాటికి పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. దీంతో వ్యాపారులు వాటి చార్జీలను పెంచేశారు. ఖరీఫ్ వరికోతల సీజన్ రావడంతో యంత్రాలకు డిమాండ్ పెరగడంతో పాటు వాటికి కొరత ఏర్పడుతోంది. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా వరి కోతలకు బురద అడ్డు రావడంతో టైర్ల మిషన్లు నడవకపోవడం, బెల్ట్ మిషన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అడ్వాన్స్‌లు ఇస్తామన్నా దొరకడం లేదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి వరి పంట చేతికి రావడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇదే అదునుగా భావించిన యంత్రాల నిర్వాహకులు గంటకు రూ.3 వేలకు పైనే డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో అరకొర బెల్టుమిషన్లతో రైతులు రాత్రింబవళ్లు పంటలను కోస్తున్నారు. రాత్రి సమయాల్లో మంచు కారణంగా పంట కోతలు సక్రమంగా జరగక వరి ధాన్యం నేలపాలు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంట మొత్తం నేలకొరిగింది. నేలకొరిగిన పంటను కొస్తామంటే వరికోత మిషన్లు దొరకటం లేదని రైతులు చెబుతున్నారు. హార్వెస్టర్ల నిర్వాహకులకు డబ్బులు అడ్వాన్స్ ఇస్తామన్నా అందుబాటులో లేవని వాపోతున్నారు

## హెచ్‌సిఎల్‌లో అవినీతి ఆరోపణలపై సిబిఐ విచారణ చేయాలి

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కి టిడిసిఎ చీఫ్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సీనియర్, జూనియర్ జట్ల ఎంపికలో సెలక్షన్ కమిటీ, ఆఫీస్ బేరర్ల అవినీతి తారా స్థాయికి చేరుకున్న తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆలస్యంగా స్పందించటం శోచనీయమని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షులు, క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడదలు చేశారు. 'తొమ్మిది దశాబ్దాలుగా హెచ్‌సీఏ అవినీతి కూపంలో కూరుకుంది. ఫలితంగా గ్రామీణ క్రికెటర్లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రతిభావంతులైన జిల్లా క్రికెటర్లు బీసీసీఐ టోర్నమెంట్లలో ఆడే అవకాశానికి దూరమవగా.. అవినీతి, దొడ్డిదారిన పసలేని క్రికెటర్లు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

హెచ్‌సీఏ ప్రక్షాళన ఇక అసాధ్యం, ప్రత్యేక తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌తోనే గ్రామీణ క్రికెటర్లకు న్యాయం చేకూరుతుంది. గ్రామీణ క్రికెట్ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రి హోదాలో బండి సంజయ్ హెచ్‌సీఏ అవినీతిపై పూర్తి స్థాయి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి. హెచ్‌సీఏలో హైదరాబాద్ నుంచే 200కు పైగా క్రికెట్ కబ్లలు ఉండగా.. గ్రామీణ తెలంగాణ నుంచి పట్టుమని పది జట్లకు కూడా ప్రాతినిధ్యం లేదు. 33 జిల్లాలకు ప్రాతినిధ్యం లేని హెచ్‌సీఏతో గ్రామీణ క్రికెట్‌కు ఎప్పటికీ న్యాయం చేకూరదు. అందుకే, తెలంగాణ గ్రామీణ క్రికెట్ అసోసియేషన్‌కు బీసీసీఐ గుర్తింపు కోసం బండి సంజయ్ కేంద్ర స్థాయిలో కృషి చేయాలి' అని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.

## సిపిజెట్-2025లో చివరి విడతలో 6,943 మందికి సీట్ల కేటాయింపు

### 11లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు (సిపిజెట్)-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా చివరి విడత సీట్ల కేటాయింపును ఆదివారం చేశారు. చివరి విడతలో 6,943 మందికి సీట్లను కేటాయించారు. 2025-2026 విద్యా సంవత్సరానికి పిజి మొదటి సంవత్సరంలో చేరడా నికి చివరి విడతలో 13,562 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 6943 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు సిపిజెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్‌స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవేశాల కోసం చివరి విడత సీట్ల కేటాయింపును ప్రకటించారు. సీటు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో ఈ నెల 11లోగా చెల్లించి ఒరిజినల్ టిసితో ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని కన్వీనర్ ప్రకటనలో తెలిపారు. .అభ్యర్థి కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ టిసి (బదిలీ సర్టిఫికేట్) మాత్రమే సమర్పించాలి. ఎస్.ఎస్.సి మెమో, డిగ్రీ మెమో, కులం, ఇ.డబ్ల్యు.ఎస్, ఆదాయం ఒరిజినల్ సర్టిఫికేట్లు సమర్పించాల్సి ఉంటుంది. కళాశాల ప్రిన్సిపాల్‌లు అర్హత నిబంధనల ప్రకారం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ లను ధ్రువీకరించాలని, అభ్యర్థి నుండి ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్‌ను మాత్రమే సేకరించాలని ఆదేశించారు. మిగిలిన ఒరిజినల్ సర్టిఫికెట్లను అభ్యర్థికి ఇవ్వాలని సూచించారు.

## త్రిపులార్ భూసేకరణకు వ్యతిరేకంగా గళం విప్పిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ అలైన్‌మెంట్ వివాదాస్పదం అవడంతో ప్రజా నిరసన రోజు రోజుకు పెరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ నాయకులు ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చడానికి అసలు మార్గాన్ని ఏకపక్షంగా మార్చిందని రైతుల నుంచి భూసేకరణకు ప్రతిఘటన ఎదురవుతోంది. చిన్న రైతుల సారవంతమైన వ్యవసాయ భూమి భారీగా కోల్పోతామని త్రిపుల్ ఆర్ రోడ్డును వ్యతిరేకిస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పటికే రైతులకు బాసటగా ప్రభుత్వానికి హెచ్చరిక సంకేతాలు పంపిచారు. తాజాగా వివాదాస్పద ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి కూడా త్రిపులార్‌పై పోరాటం చేస్తామని తనను కలిసిన రైతులకు ఆదివారం అభయం ఇచ్చారు. తమ భూముల మీదుగా ట్రిపుల్ ఆర్ (ఆర్‌ఆర్‌ఆర్) రోడ్డు నిర్మాణం వద్దంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని గిరిజనులు అడ్డుకున్నారు. పంచాంగులగడ్డ తండాలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ముగించుకొని బయలుదేరుతున్న సమయంలో తండావాసులు ఎమ్మెల్యేను చుట్టుముట్టి ముందుకు కదలకుండా అడ్డుకున్నారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా తమ గ్రామం మీదుగా రహదారి వెళ్తుందన్నారు. అలా జరిగితే సాగు చేసే పంట పొలాలను కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బాలానగర్ మండల పరిధిలోని పంచాంగులగడ్డ తండాలోని భూముల సర్వే నంబరులో లేవని తెలిపారు. అలా సర్వే నంబర్లు ఉంటే తాను తండా ప్రజల పక్షాన నిలబడి, భూములు కోల్పోకుండా పోరాటం చేస్తానన్నారు. దక్షిణ భాగంలో రైతులు తమ భూమి వాస్తవ మార్కెట్ విలువ కంటే అందించే పరిహారం చాలా తక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు, ఎకరానికి ఒక కోటి నుంచి రూ.10 కోట్ల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు.

## నేటి నుంచి గ్రూప్-3 సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

### తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహణ

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1363 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్-3 నోటిఫికేషన్‌లో మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు నేటి(సోమవారం) నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 10 నుంచి 26 వరకు నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ప్రకటించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అర్హులైన వారి వివరాలతోపాటు పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలనే తీసుకురావాలని కమిషన్ స్పష్టం చేసింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం కమిషన్ సెప్టెంబర్ 29న వెబ్ నోట్‌ను జారీ చేసింది. అందులో పేర్కొన్న హాల్ టికెట్ నంబర్లు కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కావల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించనున్నారు. ఈ తేదిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని వారికోసం ఈ నెల 27 నుంచి 29 వరకు కొనసాగించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పిలువబడే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో స్వీయధృవీకరించబడిన రెండు సెట్ల ఫోటోస్టాట్ కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. పిడబ్ల్యుడి కేటగిరీ కింద రిజర్వేషన్లు పొందేందుకు వైకల్య శాతాన్ని అంచనా వేయడానికి పిడబ్ల్యుడి అభ్యర్థులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్పీలేట్ మెడికల్ బోర్డుకు పంపాలని.. అప్పీలేట్ మెడికల్ బోర్డు నివేదికను తుదిగా పరిగణించనున్నారు.


ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ప్రభుత్వ స్థలాలను ప్రజావసరాలకు వినియోగించాలి

### బిసి యువజన సంఘం, బిసి సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో భారీ ధర్నా ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలను ప్రజల అవసరాలకు వినియోగించాలి తప్ప, అమ్మరాదని బీసీ సంక్షేమ సంఘం జాతీ య అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జి.అంజి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 295 హాస్టళ్లు, 320 బీసీ గురుకులాలు ఉన్నాయని, వాటిలో ఒక్క దానికి కూడా స్వంత భవనం లేకపోవటం విచారకరమని, తక్షణమే హాస్టళ్లకు, గురుకులాలకు స్వంత భవనాలు అన్ని వసతులతో నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలంటే ప్రజల ఆస్తులని, వాటిని అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదని స్ప ష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు రూ.50 లక్షల బీమా

### బ్యాంకర్లతో సిఎండి బలరామ్ చర్చలు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు బీమా అమలు చేయాలని సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక్కో కాంట్రాక్టు కార్మికునికి రూ.50 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని బ్యాంకర్లను సింగరేణి సిఎండి ఎన్. బలరాం కోరారు. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రారంభించిన ఉచిత ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల సహకారంతో దేశంలో తొలిసారిగా సింగరేణిలో అమలులోకి వచ్చిన ఈ పథకం నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ అమలు చేయడంపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. కాగా థర్మల్ పవర్, సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల వంటి కొత్త ప్రాజెక్టులకు రుణ సదుపాయం కల్పించాలని కోరగా బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారు. దీర్ఘకాల వాణిజ్య బంధానికి మెరుగైన ప్యాకేజీ అందిస్తామని హామీ ఇచ్చారు.



**సింగరేణి ప్రాంతాల్లో సిఎండి పర్యటన**

సింగరేణి పరిధిలోని రామగుండం, శ్రీరాంపూర్ ఏరియాలతో పాటు సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సిఎండి బలరాం ఆదివారం పర్యటించారు. రామగుండం 1 ఏరియాలో జీడికే 5 ఓపెన్ కాస్ట్ గని నీ సందర్శించి ఉత్పత్తిని సమీక్షి ంచారు. ఈ ఓపెన్ కాస్ట్ గని కోసం నిర్మించిన బేస్ వర్క్ షాప్‌ను ప్రారంభించారు. తదు పరి శ్రీరాంపూర్ ఏరియాలోని ఐ కె ఓపెన్ కాస్ట్ గనిని పరిశీలించారు.

ఉత్పత్తి ప్రక్రియ రవాణా తదితర అంశాలను సమీక్షి ంచి, లక్ష్యాలను సాధించాలని నిర్దేశించారు. అలాగే నీటి బిందువు జలసింధువులో భాగంగా ఏర్పాటు చేసిన బలరామ జలధి మినీ చెరువును సందర్శించారు. ఆ తర్వాత సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్మించనున్న 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి భూమిపూజ సన్నాహకలపై చర్చించారు. అదే ప్రాంగణంలోప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన మిథునాల్ ప్లాంట్ ట్రయల్ రన్ పనితీరును అడిగిన తెలుసుకున్నారు. త్వరలో ప్రయోగత్మకంగా ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు.

# రుతుపవనాల చురుకుదనంతో నిండుగా జలాశయాలు

## రాష్ట్రంలో అత్యధికంగా 94 సగటు వర్షపు రోజులు నమోదు

## మే నెల నుంచే కృష్ణవేణి పరుగులు

### ఉప్పొంగిన గోదావరి ఆరంభంలో మందగమనం

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** దక్కన్ పీఠ భూమిలో పురోగమన(నైరుతి) తిరోగమన రుతుపవనాలు చురుకుదనంతో కదులు తుండటంతో నవంబరు నెలలో కూడా జలాశయాలు నిండుకుండలా ఉన్నాయి. తెలంగాణలో ఈ యేడాది అత్యధికంగా 94 సగటు వర్షపు రోజులు నమోదు కావడంతో భూగర్భ జలాలు నీటిమట్టం కూడా పెరిగింది. తెలంగాణ సగటు సాధారణ వర్షాపాతం నవంబరు 9నాటికి 838.4ఎం.ఎం కాగా 41శాతం అధికంగా 1178.2 ఎంఎం వర్షాపాతం కురిసింది. నాగర్‌కర్నూల్, మెదక్, యాదాద్రి భువగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్,వనపర్తి జిల్లాలలో అత్యధిక వర్షాపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 591.3 ఎం.ఎం వర్షాపాతం కురువాల్సి ఉండగా 1099ఎంఎం అంటే 86శాతం పడాల్సిన వర్షం కంటే అత్యధికంగా కురిసింది. మహబూబ్‌నగర్, వనపర్తితో పాటు ఎగువన కర్ణాటక, మహారాష్ట్రాలో కూడా కృష్ణా బేసిన్‌లో మే నెలాఖరు నుంచే వర్షాలు కురిశాయి. గోదావరి బేసిన్‌లో కొంత ఆలస్యంగా వర్షాలు మొదలైనా నవంబరు వచ్చినా వానలు తగ్గడం లేదు. గోదావరి,కృష్ణా నదులకు రికార్డు స్థాయిలో వరద వచ్చింది. కృష్ణా నదికి చరిత్రలోనే అత్యధిక వరద ప్రవాహాలు నమోదవుతున్నాయి. కనీవిని ఎరుగని ప్రవాహం రావడంతో నిండు వేసవిలోనే మే 29న పదిగేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కులు దిగువకు నీటిని వదిలారు. ఆలమట్టి నుంచి ఈ సారి దిగువకు 776 టిఎంసిలు విడుదల చేశారు నారాయణపూర్ నుంచి అదేస్థాయిలో జూరాలకు విడుదల చేశారు. ఈ సారి నారాయణపూర్ జూరాల మధ్యన ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చే భీమా నది పోటెత్తింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,595 టిఎంసిలు జూరాలకు వరదగా నీరు వచ్చి చేరింది. 2005లో అత్యధికంగా 1635 టిఎంసిలు జూరాలకు ఎగువ నుంచి వచ్చింది. ఆనాటి రికార్డు కంటే 41టిఎంసిలు మాత్రమే తక్కువగా ఉంది. జూరాల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 9.398 టిఎంసిలు కాగా ఆదివారం 5.963 టిఎంసిల నీరు నిల్వ ఉంది. 36 వేలు క్యూసెక్కుల ఇన్లో ఉండగా 33,256 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచే ఎక్కువ.. ఎగువన ఉన్న కర్ణాటక నుంచే దిగువకు వరద వచ్చింది.. సింహభాగం నీరు అటునుంచే వచ్చింది. కృష్ణానదిపై వరద వస్తున్నా మనం వినియోగించుకునేది 60-65 టిఎంసిలు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో నీటిని నిల్వ చేసుకొనేందుకు అనేక రిజర్వాయర్లు ఉన్నప్పటికి మనకు లేకవపోవడంతో మనం నీటిని ఒడిసి పట్టలేకపోతున్నాం. రబీసీజన్‌లో ఎప్పుడు చివరకు నీటికోసం ఇబ్బందులు పడటం రివాజుగా మారింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి 27 టిఎంసిలు, జూరాల నుంచి 34 టిఎంసిలలోపు మాత్రమే మన రైతాంగంకు నీరందించలేని దైన్యం మన రాష్ట్రంలో నెలకొంది. శ్రీశైలానికి నవంబరు నెలలో కూడా ఎగువ నుంచి నీటి ప్రవాహం వస్తోంది. 2025 సీజన్లో 2,294 టిఎంసిలు వచ్చింది. 2022లో 2,004 టీఎంసీలు నమోదైంది. గతేడాది (1623 టిఎంసిల)తో పోలిస్తే ఈ సారి 671 టిఎంసిలు ఎక్కువ. పూర్తిస్థాయి నిల్వ సామర్థం 215.8070 టిఎంసిలలు కాగా.. ప్రస్తుతం 209.5948 టిఎంసిలు నీరు రిజర్వాయర్‌లో ఉంది. ఆదివారం ఉదయం 37,865 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌లో 312 టిఎంసి నీరు గరిష్ఠంగా నిలువుకోవచ్చని 310.25 టిఎంసిలు అందులో నిలిచి ఉంది. పులిచింతలలో 45.77 గరిష్ఠ నీటి నిల్వకు గాను 43.69టిఎంసిలు నీరు ఉంది. కృష్ణాడెల్టాలో 3.07టిఎంసిల నీరు ఉంది. నీటినిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులు నిర్మించుకోకపోవడమే. ఆ దిశగా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సెప్టెంబరు గోదావరి జలాశయాలు నీరు లేక వెలవెలపోయాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీకికి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ నుంచి 9454 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోన్నది. అంతే మొత్తం కిందికి ఎస్కేప్ గేట్స్ ద్వారా 8వేలక్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్ ద్వారా 650 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి వెయ్యి టిఎంసిలు కిందికి వదిలిపెట్టారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి 1368టిఎంసిలు కిందికి వదిలారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. సింగూరులో 29.31 టిఎంసిల నీరు గరిష్ఠంగా నిల్వ చేసుకోవచ్చు అక్కడ 16.56 టిఎంసిలు నీరు ప్రస్తుతం నిల్వ ఉంది. నిజామ్‌సాగర్‌లో 17.80 టిఎంసిల గరిష్ఠ నీటినిల్వకు గాను 17.79నీరు నిలువ ఉంది. మధ్యమానేరులో 27.55 టిఎంసిలకుగాను 27.22 టిఎంసిలు నీరు ఉంది. దిగువ మానేరులో 24.3 టిఎంసిలకు గాను 23.86టిఎంసిల నీరు వచ్చి చేరి నిల్వ ఉంది. కడెం కూడా 4.7 టిఎంసిల నీటితో నిండుగానే ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి 20.18 టిఎంసిల గరిష్ఠ నీటి నిల్వకుగాను అంచులవరకు నిండిఉంది. అక్కడ 19.30టిఎంసిల నీరు ఉంది.



# డీల్ రద్దు చేసుకోవాలన్నా రూ.42 కోట్లు వెచ్చించాల్సిందే!

### మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్‌పవార్ కుమారుడి భూవివాదం

**ముంబయి, నవంబరు 9:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన కంపెనీ పుణెలో కొనుగోలు చేసిన భూమిపై వివాదం రేగిన విషయం తెలిసిందే. సుమారు రూ.1800 కోట్ల విలువైన భూమిని రూ.300 కోట్లకే సొంతం చేసుకున్నారని, ఈ డీల్ కు సంబంధించి స్టాంప్ డ్యూటీ నుంచి మినహాయింపు కూడా పొందారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. అది ప్రభుత్వ భూమి అనే విషయం తన కుమారుడికి తెలియదని చెప్పారు. భూమి కొనుగోలుకు సంబంధించిన డీల్ ను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ డీల్ రద్దు చేయడానికీ పార్థ్ పవార్ కంపెనీ భారీగానే చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ల్యాండ్ కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేయాలంటే పార్థ్ పవార్ కంపెనీ రూ.42 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పూణేలోని ముంధ్వా ప్రాంతంలో ఉన్న సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమి (మహర్ వతన్ భూమి) ని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ కు చెందిన కంపెనీ కొనుగోలు చేసింది. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి విలువ దాదాపు రూ.1800 కోట్లు. పార్థ్ కంపెనీ మాత్రం దీనిని రూ.300 కోట్లకే సొంతం చేసుకుంది. నిజానికి 'మహర్ వతన్' భూమి ప్రభుత్వ ఆస్తి, ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ భూములను అమ్మడం లేదా కొనడం సాధ్యం కాదు. దీంతో పార్థ్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని, విలువైన ప్రభుత్వ భూమిని కాజేసిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.



# జైలు సెల్‌లోని ఐసిస్ రిక్రూటర్ చేతిలో స్మార్ట్‌ఫోన్!

### విచారణకు ఆదేశించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

**బెంగళూరు, నవంబరు 9:** బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో భద్రతా లోపం స్పష్టంగా కనబడుతోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఈ వీడియోలో ఐఎస్ఐఎస్ రిక్రూటర్ జుహాబ్ హామీద్ షకీల్ మన్నా జైలులోనే మొబైల్ ఫోన్ వినియోగించడం కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య దృష్టికి వెళ్లడంతో ఈ విషయంపై దర్యాప్తుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జైలు సూపరింటెండ్ తో పాటు ఐదుగురు జైలు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ వీడియోలో మన్నా అలియాస్ జుహాబ్ హామీద్ షకీల్ దర్జాగా ఫోన్ వాడుతున్నట్లు దృశ్యాలు కనిపించాయి. అతడు 2018 నుంచి జైలులో ఉన్నాడు. ఇక ఇదే జైలులో వివిధ నేరాల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్థులు మొబైల్ ఫోన్ లలో మాట్లాడూతూ టీవీలు చూస్తూ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో బయటపడిన ఈ దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం స్పందించింది. సీఎం సిద్ధరామయ్య ఆదేశాల మేరకు ఐదుగురు జైలు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కోటి దీపోత్సవాన్ని అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తాం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 9:** ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటీ దీపోత్సవానికి ఆదివారం సాయంత్రం డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది అద్భుతమైన కార్యక్రమం, అజ్ఞానం అనే గాఢాంధకారం నుంచి బయటకు తీసుకొచ్చే దీపాలు వెలిగించే కార్యక్రమం అనేక శతాబ్దాలుగా మన సంస్కృతిలో ఉంన్నారు. సమాజాన్ని,తమను తమ కుటుంబాన్ని చల్లగా చూడమని కోరుకునే కార్యక్రమం ఇది, కోటి దీపోత్సవాన్ని అద్భుతమైన కార్యక్రమంగా ప్రభుత్వం భావిస్తుందన్నారు. దీనిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని, జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి లేఖ రాస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా, కార్తీక మాసంలో జరిగే కోటీ దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని శనివారం సిఎం రేవంత్ చెప్పారని, కోటీ దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఇదే వేదికపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పడంతో సిఎం రేవంత్ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు.

# ఆర్థికాభివృద్ధిలో భీమ్‌బాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం స్ఫూర్తిదాయకం

## ఇప్పపువ్వు లడ్డూల ఉత్పత్తితో వార్షికంగా రూ,1.27 కోట్ల టర్నోవర్ సాధిస్తున్న ఆదివాసీ మహిళలు

### అభినందించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం చేయూతగా ఉంటున్నది. అందులో భాగంగా ఆదివాసీ గిరిజన మహిళల సంపూర్ణ ఆర్థిక చేకూర్పుకు ఉట్నూర్ ఐ.టి.డి.ఎ నైపుణ్యాభివృద్ధి విభాగం ద్వారా కృషి చేస్తున్నది. ఆరోగ్యసంరక్షణలో ప్రకృతిసిద్ధంగా లభించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యత పెరుగుతున్నది. అందులో ఆదివాసీ గిరిజనుల జీవన విధానంలో అత్యంత పోషక విలువలున్న ఇప్పపువ్వుకు చాలా విశిష్ఠత ఉంది. స్వయం సహాయక సంఘాలతో ఆదివాసీ గిరిజన మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించారు. వారికి ప్రకృతి సిద్ధంగా లభిస్తున్న ఇప్పపువ్వుతో లడ్డూల తయారీపై మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాకు 12 మందిని పంపి, శిక్షణ ఇప్పించారు. ఉట్నూర్‌లో రూ 40 లక్షల వ్యయంతో నెలకొల్పిన ఇప్పపువ్వు లడ్డు తయారీ యూనిట్‌కు ట్రైకార్ నుండి సబ్సిడీగా 60శాతం ఇచ్చారు. 30శాతం బ్యాంకు రుణం కాగా, మహిళల వాటాగా 10శాతం భరించడం జరిగింది. ఇప్పపువ్వు లడ్డుల తయారిలో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) నిపుణులు నిర్దేశించిన ప్రమాణాలు ప్రకారం ఇప్పపువ్వుకు పల్లీలు, నువ్వులు, బెల్లం, కాజు, ఎండు ద్రాక్షలను కలిపి, సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో రుచి నాణ్యత, పోషక విలువలుండే లడ్డూలు తయారు చేస్తు న్నారు. ఈ పదార్థాలను స్థానికంగా హోల్‌సేల్ షాప్స్ నుండి తీసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో లభించే ఇప్పపువ్వును ఉమ్మడి ఆదిలాబాద్ ముఖ్యంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నుండి ఆదివాసీ గిరిజనుల నుండి దాదాపు 150 క్వింటాళ్ళను సేకరించి, ఐటిడిఎ గోడౌన్‌లో నిల్వ చేస్తున్నారు. దాదాపు వంద కుటుంబాలు ఇప్పపువ్వు సేకరణ ద్వారా లబ్ధిపొందుతున్నాయి. గిరిజన పోషణ మిత్ర పథకం కింద పోషక విలువలు ఉన్న ఇప్పపువ్వు లడ్డులను ఉట్నూర్ ఐటిడిఎ పరిధిలోని 77 ఆశ్రమ పాఠశాలలకు ప్రతి నెలా 2,300 కిలోలను సరఫరా చేస్తున్నారు. ఓపెన్ మార్కెట్‌లో ప్రతి నెలా 900 కిలోల లడ్డూలు విక్రయిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలకు కిలో రూ. 320ల చొప్పున, ఓపెన్ మార్కెట్‌లో కిలో రూ.360 చొప్పున విక్రయిస్తున్నారు. హైదరాబాద్ శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి కేంద్రంలో ఒకటి, బాలాపూర్‌లో ఒక ఇప్పపువ్వు లడ్డు విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. శిల్పారామంలో వారానికి 15 కిలోలు, బాలాపూర్‌లో వారానికి 25 కిలోల ఇప్పపువ్వు లడ్డులు విక్రయం అవుతున్నాయి. ఆదివాసీ గిరిజనులే ఇక్కడ ఇప్పపువ్వు లడ్డులు అమ్ముతున్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా దర్బార్ సందర్భంగా ఐటిడిఎ ప్రాంగణంలో ఒక స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పపువ్వు లడ్డూలు తయారీ, విక్రయం ద్వారా వార్షికంగా రూ.1 కోటి 27 లక్షలు టర్నోవర్ సాధించినట్లు భీంభాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం నిర్వాహకురాలు భగుభాయి తెలిపారు. తద్వారా తమ సంఘంకు ప్రతినెలా రూ 3 లక్షలు లబ్ది చేకూరుతున్నట్లు ఆమె తెలిపారు. ఉట్నూర్‌లో పర్యటించిన సందర్భంగా ఆదివాసీ మహిళల సాధికారతను తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఆదివాసీ మహిళలను అభిందించారు. మహిళల కృషిని, ఆర్థిక స్వావలంబన గురించి మన్ కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రస్తావించారు. గిరిజన ప్రాంతంలోని సహజ వనరుల ఆధారిత జీవనోపాధి పెంపుదలకు, ఐటిడిఎ చేపట్టిన ఆదివాసి మహిళా సాధికారతకు ఇదొక ప్రతీకగా ఎదుగుతున్నదని అన్నారు.

# ఇంటర్‌నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి టీచర్లకు అవకాశం కల్పించాలి

### ప్రభుత్వానికి బహుజన టీచర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల విదేశీ పర్యటనలకు ఎంపిక చేసే వారిలో ఎస్‌సి, ఎస్టి, బిసి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్(బిటిఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బిటిఎ రాష్ట్ర అధ్యక్షులు కల్వదర్శి చైతన్య పాఠశాల విద్య డైరక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. ఇంటర్ నేషనల్ ఎక్స్పోజర్ విజిట్స్‌లో ప్రతి జిల్లా నుండి ఎస్‌సి, ఎస్టి, బిసి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. 3 సామాజిక వర్గాలతో పాటు కనీసం ఒక మహిళకు అవకాశం కల్పించాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలోని విద్యా ప్రమాణాలను తెలంగాణ రాష్ట్రంలో పెంపొందించడానికి చెప్పట్టిన ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ అండ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా నుండి ముగ్గురు ఉపాధ్యాయులను విదేశాలకు పంపడం కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో సామాజిక న్యాయం కొరవడిందన్నారు. ప్రధానంగా ఎస్‌సి, ఎస్టి, బిసి, ఓసిలతో కూడా జాబితాలో ఒకరు మహిళా ఉండేలాగా జాబితాను తయారు చేసి విదేశాలకు పంపాలని అప్పుడు మాత్రమే ప్రభుత్వ లక్ష్యం నెరవేరు తుందన్నారు. అలా చేయని పక్షంలో ఒకే సామాజిక వర్గానికి అవకాశం ఇచ్చినట్లయితే లక్ష్యం నెరవేరడం నల్లేరిమీద నడకలాగా ఉంటుంద న్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఎస్‌సి, ఎస్టి, ఓబిసి, ఓసి( వారిలో కనీసం ఒక మహిళకు)లకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో నూటికి 95 శాతం ఎస్‌సి, ఎస్టి, ఓబిసి, ఓసి పిల్లలుంటారని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బిటిఎ అధ్యక్షులు చైతన్య పాఠశాల విద్య డైరక్టర్‌ని కోరారు.

# రైతు ఛాతీ నుంచి 9 కిలోల కణితి తొలగింపు

**జైపూర్, నవంబరు 9:** రాజస్థాన్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స చేసింది. ఓ రైతు ఛాతీలో నుంచి ఆరు కిలోల కణితిని తొలగించింది. ఒకేసారి ఎటువంటి రక్తస్రావం లేకుండానే ఆ కణితిని వైద్యులు తొలగించారు. మూడు నెలలుగా జయపురకు చెందిన 44 ఏళ్ల రైతు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఛాతీలో బరువుగా ఉండటం నొప్పితో విపరీతంగా బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. చివరికి జయపుర్‌లోని ఎస్ఎంఎస్ ఆస్పత్రిని ఆశ్రయించాడు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించంగా ఛాతీలో కణితి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి ఆ కణితిని తొలగించినట్లు జనరల్ సర్జరీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీవన్ కాంకడియా తెలిపారు.




ఇలాంటి సాలిటరీ ఫైబరస్ కణితులు ఒక రకమైన క్యాన్సర్. సకాలంలో శస్త్రచికిత్స చాలా కీలకం. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. ఈ కణితి ఇతక అవయవాలకు అంటుకుంది. ఊపిరితిత్తుల దగ్గర అత్యంత సున్నితమైన ప్రాంతాలకు అంటుకుందని, దానిని ఒకే ముక్కగా సురక్షితంగా తొలగించడం చాలా సవాలుగా మారింది. అయినప్పటికీ, ఎస్ఎంఎస్ ఆస్పత్రి నిపుణుల సమన్వయం, ఆధునిక పరికరాలు, సాంకేతిక నైపుణ్యంతో ఈ శస్త్రచికిత్స విజయవంతమైంది. ఈ ట్యూమర్‌ను పూర్తిగా ఒకే ముక్కలో, రక్తస్రావం లేకుండా తొలగించడం సాధ్యమైంది. ఈ ట్యూమర్ పరిమాణం 15..16 సెంటీమీటర్లు, బరువు సుమారు 6 కిలోలు ఉందిఖి అని డాక్టర్ జీవన్ తెలిపారు. అక్టోబర్ 31న ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ప్రస్తుతం ఆ రైతు ఆరోగ్యం మంచిగానే ఉందని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యినట్లు వైద్యులు తెలిపారు. 'అయితే ఇలాంటి ట్యూమర్లు చాలా సార్లు ఎటువంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే పెరుగుతాయి. రోగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఛాతీ నొప్పి వంటి లక్షణాలు బయటపడే సమయానికి, అవి చాలా పెద్దవిగా మారి సర్జరీ క్లిష్టమవుతుంది. శరీరంలో ఏమైన సమస్యలు ఉన్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్య పరీక్ష చేయించుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల దిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్య బృందం మహిళ గర్భాశయంలో ఏర్పడిన 18.5 కిలోల బరువున్న కణితిని విజయవంతంగా తొలగించింది. ఇది సుమారు ఐదుగురు నవజాత శిశువుల బరువుకు సమానం అని వైద్యులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గత ఆరు సంవత్సరాల్లో తొలగించిన అతిపెద్ద ఫైబ్రాయిడ్ గర్భాశయ కేసుల్లో ఇది ఒకటని వైద్యులు పేర్కొన్నారు. దిల్లీలోని చాందిని చౌక్ నివాసి అయిన అల్కా మల్హోత్రా (56) మహిళ గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆస్పత్రికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు ఆమె గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు (గర్భాశయ కణితులు) ఏర్పడ్డాయని నిర్ధరించారు. అందులో ఒకదాని పరిమాణం చాలా పెద్దదిగా ఉందని గుర్తించారు. కణితి కారణంగా ఆమె రోజూవారి పనుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వెంటనే శస్త్ర చికిత్స చేసి ఆ భారీ కణితిని తొలగించారు.

# సింగరేణి అధికారుల సమస్యలపై సిఎండి సానుకూల స్పందన

### సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా

**జైపూర్, నవంబరు 9, ప్రభాతవార్త:** సింగరేణి పవర్ ప్లాంటును సందర్శించిన సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్‌కు అధికారులు సంఘం సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా పూల మొక్కను అందజేశారు. అధికారులకు చెల్లించాల్సిన పీఆర్పి బకాయిల గురించి సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఆకస్మికంగా సందర్శించారని అన్నారు. ఎన్ బలరాం, సింగరేణి సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఉద్యోగులకు, కాంట్రాక్టు వర్కర్‌లకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. వాటిలో ఉద్యోగులకు ఒక కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగులకు వారి డిపెండెంట్‌లకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో హైదరాబాదులో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నరన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం, అలాగే పవర్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల కోసం సీబీఎస్సీ పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఇటీవల సిబీఎస్సీ పాఠశాల అనుమతి లభించింది దానిని వచ్చే సంవత్సరం నుంచి ప్రారం భించనున్నట్లు తెలిపారు. అధికారుల సమస్యలపై కూడా సీఎండి ఎన్ బలరాం, ఐఆర్ఎస్ సానుకూలంగా స్పందించి అధికారులకు చెల్లించాల్సిన పిఆర్పి గురించి మంచి నిర్ణయం త్వరలో తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఎస్టిపిపి అధికారుల సంఘం అధ్యక్షులు డి పంతులా వినతి పత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా మాట్లాడుతూ సింగరేణి యాజ మాన్యం అధికారులకు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు రావాల్సిన పీఆర్పి బకాయిలను వెంటనే చెల్లిం చాలని కోరామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎన్.సీ.డబ్ల్యు.ఏ కార్మికుల పిల్లలు ఐఐటి/ఐఐఎంలో సీటు పొందితే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ఉచిత విద్యుత్ అందజేయడం జరుగుతున్నదని, కానీ అధికారుల పిల్లలకు అలా ఇవ్వడం లేదని అన్నారు. కాబట్టి ఇక నుండి అధికారుల పిల్లలు ఐఐటి/ఐఐఎంలో సీటు పొందితే వారికీ కూడా ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులందరూ తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి 100 కృషి చేస్తున్నారని, పీఆర్పి విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లయితే వారు నూతన ఉత్సాహంతో మరింతగా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం అధికారుల సమస్యలపై సానుకూలంగా స్పంది స్తుందని ఆశిస్తున్నామన్నారు.



యూసుఫ్‌గూడలోని ఎన్నికల సభలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# జూబ్లీలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం

### రోడ్‌షోలో పాల్గొన్న మాజీమంత్రి కెటిఆర్

### వెంగళ్‌రావునగర్‌లో మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాదయాత్ర

### రహ్మాత్‌నగర్‌లో మంత్రి పొంగులేటి భారీర్యాలీ

### బోరబండలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ఈటల, వెంగళ్‌రావునగర్‌లో రాంచందర్‌రావు, బండి సంజయ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 9, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచార పర్వం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన పార్టీలు ర్యాలీలు, పాదయాత్రలు, సమావేశాలు నిర్వహించి తమ తమ అభ్యర్థులకు ఓటు వేసి తమ అభ్యర్థిని గెలిపించాలంటూ కోరారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ హైదరాబాద్ బిర్యానీ హౌజ్ కూడలిలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు ఓట్లు వేయడానికి కచ్చితంగా పోలింగ్ కేంద్రాలకు రావాలని, లేదంటే కాంగ్రెస్ వాళ్లు దొంగ ఓట్లను వేస్తారన్నారు. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే జవాబునివ్వాలని అన్నారు. మరో 500ల రోజుల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, సినీ పరిశ్రమలోని కార్మికులందరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. అబద్దాలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అలాంటి మోసకారి పార్టీ మాటలను నమ్మవద్దన్నారు. మూడో నంబరుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌ను గెలిపించాలని కోరారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియో జకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ప్రచార ముగింపు సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మరో మంత్రి జూపల్లి కృష్ణారావులు ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నంతో కలిసి మల్లు భట్టి విక్రమార్క పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వాకిటి శ్రీహరితో కలిసి అక్కడ నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో..**

బీజేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఆదివారం పార్టీ ముఖ్యనాయకులంతా ప్రచారం నిర్వహించారు. వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఒకటో నంబరుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. యూసుఫ్‌గూడ ప్రాంతంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ప్రచారం నిర్వహించగా, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర నిర్వహించారు.

# మాజీ పోలీసు అధికారుల చుట్టూ పరకామణి వివాదం!

## నేడు సిఐడి విచారణకు ఇద్దరు సిఐలు, ఒక ఎస్ఐ

## కర్త,కర్మ,క్రియలెవరనేది నేడు వెలుగుచూసే అవకాశం



**తిరుపతి,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవునికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించే తిరుమలలోని పరకామణిలో 2023లో విదేశీకరెన్సీ చోరీ కేసు వివాదంలో ఇప్పుడు పూర్వ తిరుమల పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేయనుంది. ఈ చోరీ కేసులో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు,ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత నిందితుడ్ని అరెస్టుచేయకుండా 41ఎ నోటీస్ ఇచ్చి పంపడం వెనుక ఉన్న కారణాలు ఏంటనే కోణంలో విచారణ సాగనుందనేది తెలుస్తోంది. సాధారణంగా చిన్నదొంగతనం చేస్తేనే నిందితుడ్ని అరెస్ట్‌చేసి జైలుకు పంపే పోలీసుఅధికారులు ఏకంగా టిటిడి పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేసిన కేసులో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించాల్సి వచ్చిందనేది ఇప్పుడు సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది. దీంతో అప్పట్లో టిటిడిలో ఉన్న ఓ ఉన్నతాధికారి, సివిఎస్ఒ, పరకామణి ఏవిఎస్ఒలతోబాటు గతంలో తిరుమల వన్‌టౌన్ సిఐగా పనిచేసిన జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మిరెడ్డిలను హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. నేడు తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో పోలీస్ అధికారులను సిఐడి పలు ప్రశ్నలు సంధించి సమాచారం రాబట్టనుంది. నిందితుడైన సివి రవికుమార్ చోరీచేస్తూ పట్టుబడిన ఉదంతంలో గత ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ లోక్‌అదాలత్‌లో కేసు రాజీచేసుకోవడం వెనుక దాగివున్న అసలు కథను ఇప్పుడు గుట్టు విప్పడానికి చూస్తున్నారు. గత రెండురోజుల క్రిందట నిందితుడు సివి రవికుమార్ అతని కుటుంబసభ్యులను సమగ్రంగా సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీ,డిఎస్పీల బృందం వేర్వేరుగా విచారణ చేపట్టి అనేక కోణాల్లో సమాధానాలు రాబట్టింది. ఆ సమాధానాలతో ఇప్పుడు పోలీస్ అధికారులను విచారణ చేస్తున్నారు.ఇప్పటికే రవికుమార్ వినియోగించిన సెల్‌ఫోన్‌నంబర్‌పై ,అతని కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌పై, వాట్సాప్ ఛాటింగ్‌లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల వివరాలు, ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన అన్ని రికార్డులను సిఐడి స్వాధీనం చేసుకుని పరిశీలిస్తోంది. 2023లో హుండీకి సమర్పించుకునే విదేశీ కరెన్సీని రవికుమార్ చేతివాటం చూపి చోరీచేశాడనే కోణంలో గత ఏవిఎస్ఒ ఫిర్యాదుపై నమోదైన 24/2023 ఎఫ్ఐఆర్ కేసును తిరిగి పునర్విచారణ చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. అలాగే పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కు నోటీసులు పంపి విచారణ చేయడానికి సిఐడి రంగం సిద్దం చేసుకుంటోంది. 2023మేనెల 20వతేదీ ఛార్జిషీట్ ఫైల్ చేశారు.అయితే ఈ కేసును అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు మధ్యవర్తిత్వం జరిపి అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో 582 కేసుగా విచారణ సాగించి రాజీచేసుకున్నారనేది ,తదనంతరం జరిగిన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఎరవకి ఎంత ముట్టిందనేది ఇప్పుడు సిఐడి నిగ్గుతేల్చాల్సిన విషయం. ఏళ్ళతరబడి పరకామణిలో పనిచేసిన రవికుమార్ ఎంత కాలంగా ఈ తతంతంగం నడిపించాడు, భారీ మొత్తంలో దేవుని సోమ్మును చోరీచేసుకెళ్ళాడనేది రెండవదఫా విచారణలో తేల్చనున్నారు. నేడు పోలీస్ అధికారులను విచారణ చేయనున్న సిఐడి బృందం ఆ తరువాత కేసు రాజీ వెనుక ఉన్న పాత్రధారులు ఎవరనేది, ఏమేరకు చేతులుమారి, ఎందరు లబ్ధిపొందారనేది తేలిపోనుంది. తీగలాగితే డొంక కదలనుందనేది టిటిడి వర్గాల్లో సంచలన చర్చనీయాంశంగా మారింది.

# ఇళ్ల దరఖాస్తులకు గడువు 30 వరకు పొడిగింపు

**విజయవాడ,నవంబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సొంతిల్లు లేని పేదలకు శాశ్వత గృహాలను అందించే క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన వారికి ఇళ్ల మంజూరు చేయడానికి వీలుగా దరఖాస్తు గడువును మరింత పొడిగించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా వీటికి అదనపు సాయం ప్రకటించింది. మరోవైపు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆసక్తి, అర్హత కలిగిన వారికి ఇళ్లను మంజూరు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దీనికి తొలుత కేంద్రం ఈనెల 5 వరకు మాత్రమే గడువు ఇచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు నెలాఖరు వరకు పొడిగించింది. తద్వారా మరో మూడు వారాలపాటు దరఖాస్తుకు అవకాశం ఉంది. దీనివల్ల మరింత మందికి మేలు జరగనుంది.

ఈ పథకంలో అర్బన్, మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఉన్న వారికి కేంద్రం తోపాటు, రాష్ట్రం కలిపి రూ. 2.89 లక్షలవరకు ఇస్తున్నాయి. ఇందులో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ నిధులు కలిపి ఉన్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి కేవలం రూ. 1.59 లక్షలు మాత్రమే వస్తుంది. పీఎంఏవై ద్వారా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోడానికి సిద్ధంగా ఉన్నవారి వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్నారు.ప్రభుత్వం గడువు పెంచడంతో అర్హులైన వారందరికీ మేలు జరుగుతుంది. ఇది కాకుండా గ్రామీణ పరిధి కింద ఇళ్లు నిర్మించుకోడానికి 298 మంది సిద్ధంగా ఉన్నారు. యూడీఏ కింద దరఖాస్తు చేసుకున్నవారికి అనుమతులు రావాల్సి ఉంది. అర్హత కలిగి ఉన్న ఎవరన్నా పీఎంఏవైను సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితులు లేవు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

దరఖాస్తులను గృహ నిర్మాణ సంస్థ, సచివాలయాల్లో అందించవలసి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇళ్లు లేని పేదలు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలిసి అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సొంత స్థలంలో ఇంటి పట్టా తీసుకుని ఉండాలి. లేదంటే ఈనెలాఖరులోపు అందించేలా ఉండాలి. నివాస స్థలంలో లబ్ధిదారు ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ఇళ్లు లేనట్లు, ఉన్నట్లయితే పాడైపోయిన ఇంటి ఫొటో జత చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాల కింద పేరు, లింగం, ఆధార్ కార్డు నంబర్, చరవాణి నంబరును పూరించాలి. బ్యాంక్ ఖాతా నంబర్, పేరు నమోదు.

నరేగా జాబ్ కార్డు నంబరు వివరాలు అందించాలి. ఆధార్ నంబర్‌ను ఉపయోగించే అధికారం ఇవ్వడానికి సమ్మతి పత్రం అప్‌లోడ్ చేయాలి. పీఎంఏవై ఐడీ, ప్రాధాన్యత ఎంపికను ఉపయోగించాలి. ఆపై నమోదు చేసుకోవడానికి ఎంచుకోండి అనే ఐచ్ఛికం వద్ద క్లిక్ చేయడం. ఈ ప్రకియను ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా పూర్తి చేసుకునే సౌలభ్యం ఉంటుంది.

# ఆరోగ్య ఆంధ్రా సాకారానికి ప్రభుత్వం కృషి

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ: రక్త నాళాల జబ్బులపై అవగాహన అవసరం




వాస్క్యులర్ వాక్‌థాన్ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వ్యాధులు గురించి, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటే ఆనందంగా స్వర్ణాంధ్రను సాధించవచ్చని తెలిపారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాస్క్యులర్ వాక్ థాన్ ను ఆదివారం నగరంలో నిర్వహించారు. విజయవాడ గవర్నర్ పేట ఐఎంఏ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా విచ్చేసారు. వాక్ థాన్ ను ప్రారంభించారు. ఈ వాక్ బీఎస్ ఎన్ఎల్ ఆఫీస్ వరకు అక్కడి నుంచి తిరిగి ఐఎంఏ హాల్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాస్క్యులర్ వ్యాధులు, సర్జరీలు గురించి అవగాహన కల్పించేందుకు వాక్ థాన్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. వాస్క్యులర్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కలిగే ఇబ్బందులు గురించి వాక్ థాన్ ద్వారా వివరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తే వారు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరు దీని గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రముఖ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ కిరణ్ మాకినేని మాట్లాడుతూ వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా లో 800 మంది వరకు సభ్యులు ఉన్నారని చెప్పారు. నేడు దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో అంప్యూటేషన్ ఫ్రీ ఇండియా నినాదంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాక్ థాన్ ను నిర్వహించినట్లు తెలిపారు. వందలో ఎనభై అంప్యూటేషన్ లు మనం మందులు వాడటం, జాగ్రత్తలు పాటించడం, రక్తనాళాలకు చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చని అన్నారు. మధుమేహం ఉన్నవారిలో స్పర్శ తగ్గుతుందని, రక్త ప్రసరణ కూడా తగ్గవచ్చని తెలిపారు. న్యూరోపతి, వాస్క్యూలోపతి, డయాబెటిస్ ఉంటె కాలు పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. వీరు వైద్యుల సలహా మేరకు నడుచుకుంటే ఆ ప్రమాదం నుంచి బయటపడొచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస్కులర్ సర్జన్ లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హిందాల్కో ఏర్పాటుతో యాపిల్ గ్లోబల్ సప్లై చైన్ లోకి ఎపి: మంత్రి లోకేష్

## వేగవంతమైన అనుమతులతోనే ఈ ఘనత

**విజయవాడ,నవంబరు 9,పభాతవార్త ప్రతినిధి:** ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన హిందాల్కో ఇండస్ట్రీట్ రాష్ట్రానికి రావడం మన ఎలక్ట్రానిక్స్ ఎకో సిస్టంలో కీలక మలుపని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో ఏపీ భాగస్వామి కానుందని తెలిపారు. కుప్పంలో రూ.586 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటుతో 613 మందికి ప్రత్యక్షంగా, మరెందరికో పరోక్షంగా,ఉద్యోగాలు,ఉపాధి లభించనున్నాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తున్న వేగవంతమైన అనుతమతులు,ప్రోత్సాహాల కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. బెంగుళూరుకు 120 కి.మీ. చెన్నైకి 200 కి.మీ దూరంలో వ్యూహాత్మక స్థానంలో కుప్పం ఉంది. భవిష్యత్తులో స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ స్మార్ట్‌ఫోన్లు,ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో గ్లోబల్ తయారీ కేంద్రంగా మారనుంది. 2027మార్చి నాటికి ఈ యూనిట్ నుంచి పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

# ఎపిలో పేదల ఇంటివద్దకే వైద్యసేవలు




ఆదివారం శంకర ఆస్పత్రిలో ఐ కేర్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**5 కోట్ల మంది ప్రజల హెల్త్ కార్డులు ఆన్‌లైన్**

**ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికే 'సంజీవని'**

**శంకర ఐ ఫౌండేషన్ సేవలు నిరుపమానం**

**సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రం ప్రారంభించిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ, నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యమే నిజమైన పేదరికమని, అందుకే ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఐదు దశాబ్దాలుగా శంకర ఆస్పత్రి పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో నడుస్తున్న శంకర కంటి ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, నిస్వార్థంగా సేవలు చేసే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఎపి ఒక రోల్ మోడల్‌గా ఉంటుందనే అభిప్రాయాన్ని సిఎం చంద్రబాబు వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు శంకర్ కంటి ఆసుపత్రి చేస్తున్న కృషిని అభినందిస్తున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని పథకాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది హెల్త్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం.ఈ పథకం ద్వారా ప్రతి పేదవాని ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు 32,000 వైద్య శిబిరాలను నిర్వహించి 30 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు చేసిన ఘనత శంకర కంటి ఆసుపత్రికి దక్కుతుంది. భవిష్యత్తులో వైద్యసేవలను అందరికీ చేరువచేసే విధంగా కృషి చేస్తాం" అన్నారు.

**దృష్టిని ప్రసాదిస్తూ మానవాళికి అద్భుతమైన సేవ..** మానవ సేవనే మాధవ సేవ అని నమ్ముతుంది కాబట్టే...కంచి పీఠం దేశ వ్యాప్తంగా కంటి ఆస్పత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు స్థాపించిన కంచి పీఠం ఆది నుంచి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతోంది. అందులో భాగంగానే ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించారు. హిందూ ధర్మాన్ని తిరిగి బలమైన శక్తిగా మలిచారు. 1977లో ప్రారంభమైన శంకర కంటి ఆస్పత్రి సామాన్యులకు సైతం నేత్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చింది. త్వరలో జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమానికి నేను హాజరవుతాను. 50 ఏళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించడం సాధారణ విషయం కాదు. ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం గొప్ప విషయం. దేశవ్యాప్తంగా 2,268 మంది సిబ్బంది పనిచేస్తుండగా 2,576 పడకలు ఉన్నాయి. ఇంత గొప్ప సేవా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న శంకర ఆస్పత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 2003 నుంచి గుంటూరులోని శంకర కంటి ఆస్పత్రి సేవలు అందిస్తోంది. ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇప్పటికి 4 లక్షలకు పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 9లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. 300 పడకల సామర్థంతో, రోజుకు 2,500 నుంచి 3,000 వరకు రోగులకు సేవలు అందిస్తున్నారు. శంకర యొక్క గ్రామీణ సేవా ప్రాజెక్ట్ 'గిఫ్ట్ ఆఫ్ విజన్' కింద ఇప్పటివరకు 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి సేవా గుణానికి నిదర్శనమని సిఎం చంద్రబాబు అన్నారు.

**పేదలకు సేవ చేసే సంస్థలకు ఎల్లప్పుడూ సహకారం** జగద్గురుశ్రీఆదిశంకరాచార్య ఆకాంక్షించినట్టు పేదరికంలేని సమాజమేలక్ష్యంగా ముందుకెళ్తున్నాం. రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలి. వినూత్నంగా యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తెస్తున్నాం. ప్రతి ఒక్కరికీ రూ. రెండున్నర లక్షల ఆరోగ్య భీమా, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల వరకు విలువైన వైద్య సేవలు ఈ పాలసీ కింద అందిస్తాం. టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ 'సంజీవని' కేంద్రాలు త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తున్నాం. ప్రజల ఆరోగ్యం కాపాడడానికి శంకర కంటి ఆస్పత్రిసేవలను స్వాగతిస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు.

**కంచి కామకోటి పీఠం సేవలు అద్వితీయం..** ఆధ్యాత్మికంగా భక్త జనావళి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారు. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పీఠాన్ని కొనసాగిస్తున్నారు. సామాజికంగాను పేదలను, ఆపన్నులను ఆదుకునేందుకు కంచి కామకోటి పీఠం విశేషంగా పని చేస్తోందన్నారు. అంతకుముందు ఆస్పత్రిలోని శంకర ఆస్పత్రిలోని పలు విభాగాలను సిఎం చంద్రబాబు సందర్శించి వాటి వివరాలు తెలుసు కున్నారు. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీకి సిఎం చంద్రబాబు నాయుడు ముకుళిత హస్తాల నమస్కరించి ఆయన ఆశ్సీస్సులు అందుకున్నారు.




# కూటమి సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?

## మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, నవంబరు 9,ప్రభాతవార్త:** అసలు ఏపీలో పరిపాలన జరుగుతుందా? అంటూ కూటమి సర్కార్ వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఫైర్ అయ్యారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ ఉద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. మెరుగైన పీఆర్సీ ఇస్తామని, ఉద్యోగులకు ఐఆర్ ఇసామన్న హామీని గాలికి వదిలేసిందన్నారు. ఏడాదిన్నర గడిచినా ముఖ్యమంత్రి చంద్రబాబు పీఆర్సీ ఊసు ఎత్తడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 2023లో 12వ పీఆర్సీ ఏర్పాటు చేశామని ఉద్యోగులకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చిందన్నారు. అసలు కూటమి సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించారు. 2024 నుంచి గ్యాట్యుటీ, మెడికల్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని . ఇప్పుడు ఉద్యోగులకు ఓపీఎస్ లేదు, జీపీఎస్ లేదు. నో పీఎస్ అయ్యిందన్నారు. ఐదో తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని జనవరి నుంచి పోలీసులకు టీఏ పెండింగ్లో ఉంది అంటూ బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు.

# తిరుమల సమాచారం







## తిరుమలలో అధునాతన కొత్త వంటశాల

### నిర్మాణానికి ముందుకు వచ్చిన ముఖేశ్ అంబానీ

**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా అన్నప్రసాదాలు అందించే తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అధునాతన కొత్తవంటశాల నిర్మించేందుకు టిటిడి ప్రణాళికలు సిద్దంచేసింది. ఇందుకు అవసరమైన సహాయసహకారాలను రిలయన్స్‌సంస్థ అధినేత ముఖేశ్‌అంబానీ అందించేందుకు ముందుకు వచ్చారు. ఆ దేవదేవుడు శ్రీవారి దివ్యఆశీస్సులతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వంటశాల నిర్మించనున్నట్లు ప్రకటించారు.ఈ కొత్త వంటశాల అధునాతన ఆటోమేషన్‌ను కలిగి ఉంటుందని తెలిపారు. ఆదివారం వేకువజామున తిరుమలకు వచ్చిన ముఖేశ్‌అంబానీ ఆ సంస్థ ప్రతినిధులతో కలసి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయం ముందు అంబానీతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి కొత్త అధునాతన వంటశాల నిర్మాణం విషయంగా చర్చించారు. వెంటనే అంబానీ అందుకు సానుకూలంగా ప్రకటన చేశారు. ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్న అన్నప్రసాద ట్రస్ట్ తరపున అధునాతన వంటశాలను నిర్మించేందుకు సహకారంఅందిస్తానని వెల్లడించారు. టిటిడితో కలసి ఈ నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. టిటిడి భాగస్వామ్యంతోబాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ రెండు లక్షలమందికి పైగా భక్తులకు అన్నప్రసాదాలను మరింత నాణ్యతగా రుచిగా తయారుచేసే అందించే సామర్థ్యం ఉండేలా నూతన వంటశాల రానుంది. ప్రతి భక్తు డికి అత్యంత భక్తి ,పరిశుభ్రతతో తయారయ్యే అన్నప్రసాదాలను అందుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో అన్నప్రసాదాలను అందించాలనే ఆలోచనను ముఖేశ్‌అంబానీ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో వంటశాలను, వంట పాత్రలను టిటిడి బోర్డు, అధికారులు మార్పుచేసి అధునాతనవి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## పార్వేటమండపంలో మలయప్ప ఉత్సవర్లకు విశేషస్నపనం

### వైభవంగా కార్తీక వనభోజనం





**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి కార్తీకవనభోజనానికి పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం విచ్చేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో కైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయ అర్చకులు, అధికారులు శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామిని బంగారుతిరుచ్చిపై ఆలయం నుండి పార్వేటమండపంకు మంగళవాయిద్యాల నడుమ వేంచేపుచేశారు. అక్కడ ఉత్సవర్లకు విశేష పవిత్ర జలాలతో నీరు,చందనం,కొబ్బరిజలం,పాలు,పెరుగు,తేనె, సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ధూపదీపకర్పూర హారతులిచ్చారు. అనంతరం అక్కడ భక్తులకు కార్తీకవనంలో వనభోజనాలు వడ్డించారు. 16వ శతాబ్ధంలో ఈ వనభోజనం చేపట్టిన టిటిడి ఆ తరువాత 2010వ సంవత్సరం నుండి ఈ కార్యక్రమాన్ని టిటిడి పునరుద్దరించింది. భక్తులు వేలాదిమంది పాల్గొని భోజనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యం, చిన్నజీయ్యం,టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారు పత్తేదార్ హిమత్‌గిరి, నాయక్, అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారి దివ్యఆశీస్సులందరిపై ఉండాలి

### సుప్రభాతసేవలో రిలయన్స్ చీఫ్ ముఖేశ్ అంబానీ



**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రిలయన్స్‌సంస్థ చీఫ్ ముఖేశ్‌అంబానీ ఆకాంక్షించారు.దేవుని నామస్మరణ జరిగే ప్రతిచోట భక్తి వెల్లివిరుస్తుందని, భక్తులు భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తెలిపారు. ఆదివారం వేకువజామున ముఖేశ్‌అంబానీ ,ఆ సంస్థ ప్రతినిధులతో కలసి ఆలయం వద్దకు విచ్చేశారు. మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. ఆలయం లోపల ధ్వజస్తంభానికి నమస్కరించిన అంబానీ ఆనందనిలయంలో శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గోన్నారు.మొక్కులు చెల్లించుకున్నారు .రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అదనపు ఇఒ వెంకయ్య చౌదరి అర్చకులు శ్రీవారి శేషవస్త్రం కప్పి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో ఆద్యంతం భక్తిభావంతోనే గడిపారు.

## శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన



**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపిన స్వామివారిని అభిషేకం, అర్చన నిర్వ హించారు. అలంకారం తరువాత ఉదయం 7గంటల నుండి మధ్యా హ్నం 12గంటల వరకు బిల్వార్చన అర్చకులు జరిపించారు. ఇందులో లక్షబిల్వపత్రాలతో స్వామివారిని అర్చించారు. సాయంత్రం చంద్రశే ఖరస్వామి ఉత్సవమూర్తులు ఆలయ పురవీ ధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గోన్నారు.

## తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలైకి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, నవంబరు 9, ప్రభాతవార్త:** కేరళలోని శబరిమళైలో వెలసిన అయ్యప్ప స్వాముల వారి దర్శనానికి వెళ్ళే భక్తాదుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

**వయా:గూడూరు, రేణిగుంట మీదుగా తిరిగే రైళ్ళు:**

**..బందరుకొల్లాంబందరు ప్రత్యేక రైళ్ళు:** మచిలీపట్నం నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07101 ప్రత్యేక రైలు ఈనెల 14 నుంచి జనవరి 02 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 04:30 గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి శనివారం రాత్రి 10:00 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో కొల్లాం నుంచి మచిలీపట్నం వెళ్ళే నంబర్ 07102 రైలు ఈనెల 16 నుంచి జనవరి 04 వరకు ప్రతి ఆదివారం తెల్లవారు జామున 02:30 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 08:00 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. నర్సాపూర్ నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07105 రైలు ఈనెల 16 నుంచి జనవరి 18 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 03:00 గంటలకు నర్సాపూర్ నుంచి బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10:00 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి నర్సాపూర్ వెళ్ళే నంబర్ 07106 రైలు ఈనెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం తెల్లవారు జామున 02:30 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి గురువారం ఉదయం 07:00 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.

**కాకినాడ టౌన్‌కొట్టయాం ప్రత్యేక రైళ్ళు:** కాకినాడ టౌన్ నుంచి కొట్టయాం వెళ్ళే నంబర్ 07109 రైలు ఈనెల 17 నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం కాకినాడ టౌన్ నుంచి బయలుదేరుతుంది.

తిరుగుప్రయాణంలో కొట్టయాం నుంచి కాకినాడ టౌన్ కు వెళ్ళే నంబర్ 07110 రైలు ఈనెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం కొట్టయాం నుంచి బయలుదేరుతుంది.

**చర్లపల్లికొల్లాం ప్రత్యేక రైళ్ళు:** చర్లపల్లి నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07107 రైలు ఈనెల 17 నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం చర్లపల్లి నుంచి బయలుదేరుతుంది. తిరుగుప్రయాణంలో కొల్లాం నుంచి చర్లపల్లి వెళ్ళే నంబర్ 07108 రైలు కొల్లాం నుంచి ప్రతి బుధవారం బయలు దేరుతుంది.



## సహజంగా మెరవండి!

పండుగల వేళ, పెళ్లి సమయాల్లో అమ్మాయిలకు మోము కాంతులీనాలంటే.. ముఖానికి మేకప్ తప్పనిసరి. అలాగని అందరికీ ఒకే తరహా నప్పదు. ముఖ్యంగా కొట్టొచ్చినట్లు కనబడే రంగులు, జిగేల్మనిపించేలా ఐడ్స్, బోల్డ్‌గా తీర్చిదిద్దిన పెదాలను కొందరు మెచ్చుకున్నారు. ఇలాంటివారికి కనీస మేకప్ చక్కని ఎంపిక. అందంగా మందంగా ఉండే ఫౌండేషన్‌కి బదులు టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకోవాలి. ముఖ్యంగా ముక్కు, చెంపలు, నుదురు వంటి చోట్ల తక్కువగా రాసి... తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. తర్వాత కళ్లకింద కన్సీలర్ కొద్దిగా రాసి అంతటా పరవాలి. ఆపై కళ్లకు సన్నగా ఐలైనర్ గీయండి. ఐషాడోగా న్యూడ్, లైట్ బ్రౌన్డ్లను వేస్తే కళ్లెంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చివరిగా బుగ్గలపై పీచ్ బ్లష్, పెదాలకు న్యూడ్, పింక్, కోరల్ లిప్స్టిక్ లు వేస్తే చాలు. సింపుల్గా, సహజంగా మెరిసిపోతారు. □

## పప్పుల్ని ఎందుకు నానబెట్టాలంటే?

ముందు పప్పుల్ని, కాయధాన్యాల్ని ఎందుకు నానబెడతాం? బాగా నానితే త్వరగా ఉడుక.. అంటారా? ఇది కరక్టే కానీ.. దీనివల్ల ఇవి త్వరగా జీర్ణమవడంతో పాటు.. వీటిలో ఉండే పోషకాలు శరీరానికి బాగా అందుతాయి. జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడవచ్చు. మరి, ఇంతకీ ఏ పప్పును ఎంతసేపు నానబెట్టాలి? ఎలా నానబెట్టాలి? వంటి విషయాల గురించి తెలుసుకుందాం.



కంది, పెసర, శెనగపప్పులతో పాటు రాజ్మా గింజలు, కాబూలీ శెనగలు.. మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటాం. అయితే వీటిని వండుకునే ముందు కొన్ని గంటల పాటు నానబెట్టడం మనకు అలవాటే నిజానికి ఈ ప్రక్రియ వల్ల అవి త్వరగా ఉడకడంతో పాటు జీర్ణ వ్యవస్థకూ మేలు నిపుణులు చెబుతున్నారు. నానబెట్టడం వల్ల వీటిలో ఉండే ఫైట్స్ అంటే ఎంజైమ్ యాక్టివేట్ అవుతుంది. ఇది పప్పుల్లోని పోషకాల్ని శరీరం సులభంగా గ్రహించేలా చేస్తుంది. అంతేకాదు.. నానబెట్టే ప్రక్రియ వల్ల వాటిల్లోని అమాయిలేజ్ అనే సమ్మేళనం యాక్టివేట్ అయి.. పప్పులు, కాయధాన్యాల్లోని చిన్న పిండి పదార్థాలను విచ్ఛిన్నం చేస్తుంది. చేసి.. అవి త్వరగా జీర్ణమయ్యేందుకు సహకరిస్తుందట. ఫలితంగా కడుపుబ్బరం.. జీర్ణ సమస్యలకు దూరంగా ఉండొచ్చు అంటున్నారు నిపుణులు.

**ఎంతసేపు నానబెట్టాలి?** పప్పులు, కాయధాన్యాలు.. ఇలా ఒక్కో రకాన్ని బట్టి దాన్ని నానబెట్టే సమయం ఉంటుందంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. ✦. పెసలు, మినుములు.. వంటి ముడిపప్పుల్ని 8–12 గంటల పాటు నానబెట్టాలి. 3. పెసర, కంది, శెనగ, మినప్పప్పు.. వంటి వాటిని 6–8 గంటలు నాననివ్వాలి.
✦ ఇక రాజ్మా, శెనగలు, కాబూలీ శెనగలు.. వంటి కాయధాన్యాల్ని 12–18 గంటలు నానబెట్టడం మంచిది. ఇక ఇంత సమయం లేదనుకునేవారు రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వండుకున్నా సరిపోతుంది. చాలావరకు పాలిష్ చేసిన పప్పులే మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ వీటిలో కృత్రిమ రంగులు, పురుగులు పట్టకుండా కొన్ని పౌడర్లు కలుపుతారు. ఇక మెరుపు కోసం కొన్నింటి నైలాన్, మఖ్మల్, లెదర్ పాలిష్ కూడా చేస్తారు! ఇలాంటివన్నీ ఆరోగ్యానికి హానికరం. కాబట్టి వీటిని నానబెట్టే ముందు, వండుకునే ముందు బాగా శుభ్రం చేసుకోవాలంటున్నారు నిపుణులు.
ఈ కోసం.. ✦ కావాల్సిన పప్పును గిన్నెలోకి తీసుకొని 34 సార్లు చేత్తో నలుపుతూ నీటితో కడగాలి.
✦ ఆపై అడుగున బోసిన జల్లెడ లాంటి వాటిలోకి ఈ పప్పును తీసుకొని.. కుళాయి నీటి కింద మరోసారి కడగాలి.
✦ ఇప్పుడు గిన్నెలో పప్పు తీసుకుని నీళ్లు పోసి నానబెట్టాలి. .. తిరిగి వండుకునే ముందు మరో రెండుమూడు సార్లు కడగడం వల్ల వాటిపై ఉండే రసాయనాలు, పాలిష్ తొలగిపోతాయి. □

## 'ఆక్సిజన్ ఉమన్'గా సాయం చేస్తూ..

కష్టాలు, విషాదాలు కొందరిలో భయాన్ని నింపితే... మరికొందరిలో జాగ్రత్తను పెంచుతాయి. కానీ సీతాదేవి అలాకాదు. 'నాకు జరిగిన నష్టం మరెవరికీ జరగొద్దు' అని అనుకున్నారు. కాబట్టే, ఆక్సిజన్ ఉమన్ అయ్యారు. పేదలు, అనాథలకు సాయపడుతున్నారు.

చిన్నప్పుడు ఫుట్‌పాత్‌పైనే ఉండేవాళ్లం. నాన్న రైల్వే కూలీ. ఆరుగురు పిల్లలు. తన సంపాదనే మాకు ఆధారం ఒక్కోరోజు తినడానికి తిండిలేక నీళ్లు తాగి కడుపు నింపుకునేవాళ్లం. అలాంటి స్థితిలో ఉన్నా చుట్టూ ఉన్నవాళ్లకి సాయం చేసేది అమ్మ. అది చూస్తూ పెరిగిన నాకూ సాయం అలవాటుగా మారింది. మాది చెన్నై అమ్మ. నానమ్మ చదువుకున్నారు. దీంతో మమ్మల్నీ చదువుకోమని ప్రోత్సహించారు. కాబట్టే దూరవిద్య ద్వారా బీకాం పూర్తిచేశాను. తరవాత మా ఇంటి పరిస్థితులు మారినా వీధిలో ఆకలితో పడుకోవడం ఎంత నరకమో నాకు తెలుసు. కాబట్టే, 2002లో స్టేట్ విజన్ పేరుతో ట్రస్ట్ ప్రారంభించి... పేదలు, ఫుట్‌పాట్లపై నివసించేవారికి ఆహారం అందిస్తాం. వేడుకలు జరిగే చోటుకు వెళ్లి ఆహారం సేకరించడమే కాదు... కమ్యూనిటీ కిచెన్స్ ఏర్పాటు చేశాం. దీనికోసం సరకులు, విరాళాలు సేకరిస్తున్నాం.

**రోజంతా ఆస్పత్రి ముందే! ..** ఇలా సాగుతున్న మా సేవని దారి మార్చింది. అమ్మ కోవిడ్ బారిన పడింది. ప్రభుత్వాసు పత్రికి తీసుకెళ్తే ఎంత ఎదురు చూసినా బెడ్ దొరికింది. మరో ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు ఆక్సిజన్ దొరక్క ప్రాణాలు కోల్పోయింది. అమ్మ మరణాన్ని తట్టుకోలేక పోయా. ఆ పరిస్థితి మరెవరికీ రావొద్దు అనిపించింది. అందుకే ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సం ట్రేటర్లు సిద్ధం చేసుకున్నా. ఓ ఆటోలో వాటిని ఉంచుకుని అమ్మ చనిపోయిన ఆసుపత్రి ముందే ఉంచా. శ్వాస ఆడక ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు ఇద్దరు వాలంటీర్ల సాయంతో రోజూ ఆక్సిజన్ అందించే దాన్ని. దీనికి రూపాయి కూడా బాధితుల నుంచి తీసుకోలేదు. ఇలా వందలమందిని కాపాడగలిగాను. వాళ్లం దరిలో నాకు మా అమ్మే కనిపించేది ఎమర్జెన్సీకి మరో ఆటోని ఏర్పాటు చేశా. రోగులు ఎవరు సాయమడిగినా ఆ ఆటోలో కదిలేదాన్ని చచ్చుబడి చనిపోయిన వారిని శ్మశానానికీ తరలించేదాన్ని. అయినవాళ్లు భయపడితే స్వయంగా ఖననం చేసిన సందర్భాలు బోలెడు. దేశమంతా ప్రయాణిస్తూ వ్యాక్సిన్పైనా ప్రచారం కల్పించా. 'ఆటో అక్క'గా నేను చాలామందికి సుపరిచితమే.



**ఎప్పటికైనా సాధిస్తా ..** క్యాన్సర్ వంటివాటి బారిన పడ్డవారికి చికిత్సతోపాటు సరైన ఆహారమూ ముఖ్యమే. వారికి వైద్యపరమైన సాయంతోపాటు పిల్లలు, మహిళలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తాం. అనాథలు, దివ్యాంగులు, నిరాశ్రయ మహిళలు, వృద్ధుల కోసం మూడు ఇళ్లను కలిగి ఉన్నారు. మా ఇంట్లో పిల్లలు 18ఏళ్లు వచ్చే వరకు ఉండవచ్చు. విద్య, ఉద్యోగావకాశాల విషయంలో వారికి సాయం చేస్తున్నాం. చెన్నై కమిషనర్ సాయంతో 'కావల్ కరంగల్' ప్రాజెక్ట్ కింద మతిస్థిమితం లేనివ్యక్తులు, అనారోగ్యం బారిన పడినవారు, నిరాశ్రయ వృద్ధులు, తప్పిపోయిన పిల్లలను పోలీసులు సాయంతో కాపాడి కార్పొరేషన్ ఆధీనంలో ఉండే ష్లాటర్ హోమ్ చేరుస్తుంది. పోలీసులతో కలిసి... తప్పిపోయిన వారిని వారి కుటుంబాల చెంతకు చేర్చడం, రాత్రిపూట ఆపదలో ఉన్నామంటూ పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఆశ్రయించే వారిని కాపాడటం వంటివీ చేస్తున్నాను. పేద విద్యార్థుల కోసం చెన్నైలో వలంటీర్ల సాయంతో తొమ్మిది ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పేద మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇసు‌న్నారు. నాకంటూ కొంత భూమి ఉంది. అందులో ఓ ఇంటిని నిర్మించాలి. సాయ మడుగుతూ వచ్చిన ప్రతి ఒక్కరికీ నావంతుగా సాయపడాలన్నది నా లక్ష్యం. త్వరగా దాన్ని సాధించాలి. దీని కోసమే పెళ్లినీ కాదనుకున్నా. □

కార్తీక మాసము ఉత్తమ మైనదని, అధికఫల దాయకమని, హరిహరాదులకు ప్రతికరమైనదని, కార్తీకమాస వ్రతము వలన ఎంతో మేలు కలుగుతుందని కార్తీక పురాణం చెబుతుంది. "ఈ మాసములో ధాన్యము, ఫలము, బంగారము, గృహము, కన్యా దానములు చేస్తే ఎంతో పుణ్య ములభిస్తుంది. ఈ నెల రోజులు ధనవంతుడైనా బీదవాడైనా సదాహరినామస్మిస్తూ, పురాణాలు వింటూ,

## కార్తిక ఫలశ్రుతి



పుణ్యతీర్థములను సేవిస్తూ, ధర్మాలు చేసిన యెడల, వారికి పుణ్యలోకమబ్బును పుట 100 మంచి పురాణాలలో ఉన్నాను. మాసమంతా 30 రోజులు ధనం, ధాన్యం, ఫలం ఎవరైతే చేతనైతే దాన్ని పేదలకు దానం చేయాలని ఉంది. ఏ ఇంట్లోనైనా వివాహం కావలసిన యువతులుంటే ఇంటి పెద్దలకు వారి వివాహ విషయమై జాగ్రత్తపడి ఈ మాసంలో వారి వివాహం జరిపిస్తే మంచి జరుగుతుందని ప్రోత్సహిస్తుంది, సూచిస్తుంది. పేదలు, ధనికులు అందరూ ఈ మాసమంతా హరి నామస్మరణ చేశారు. దీని వల్ల మనసులోని లౌకిక వ్యవహారాల గందరగోళం సమసిపోయి మానసిక శాంతి కల్గుతుందని వేరేచెపాల్సిన పనేముంది? పుణ్య తీర్థాల దర్శనము ఎంత ప్రయోజకరమో శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పాడు కదా. వీటన్నిటివల్ల పుణ్యం వస్తుందని ఉంది. వేరే లోకాలు న్నాయో లేదో గాని అవన్నీ పాటిస్తే ఈ లోకమే స్వర్గంగా మారదా? పురాణ ఉద్దేశం మనుషులు మారాలన్నదే. □

## పాటించేద్దాం..



అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసేటప్పుడు కొద్దిగా ఉప్పు, నూనె వేసి మిక్సీ చేయాలి. అలానే రుబ్బాక కొద్దిగా నిమ్మరసం, పసుపు కలిపి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు పాడవ్వకుండా ఉంటుంది.
పప్పులు త్వరగా పురుగు పట్టకుండా ఉండాలంటే నిల్వ ఉంచిన డబ్బాలో నాలుగైదు వెల్లుల్లి రెబ్బలను సగానికి కట్ చేసి వేసుకోవాలి. □

## ఉసిరి దీపానికి స్టాండ్



కార్తికం శివుడికి ఇష్టమైన మాసం. అందుకే నెలంతా దీపాలు వెలిగించి స్వామిని కొలుస్తారు. శివమహాపురాణం ప్రకారం ఉసిరిని ఈశ్వర స్వరూపంగా భావిస్తున్నారు. అందుకే సకల శుభాలూ కలగాలని ఉసిరి దీపాన్ని వెలిగిస్తారు. ఈ కాయ లక్ష్మీదేవికీ అత్యంత ఇష్టమైనదే. అమ్మవారితోపాటు మహావిష్ణువు అనుగ్రహం కూడా పొందొచ్చనీ ఉసిరి దీపాన్ని పెడతారు. అయితే కాయ ఓ పట్టాన నేలమీద నిలవదు, దొర్లుతుంది. పైనా కింద కోసినా కొన్నిసార్లు ఇబ్బందే. దీనికి చెక్ పెడుతూ వచ్చినవే ఈ 'ఆమ్లా దియా స్టాండ్స్' కాయ నిలిచేలా భిన్న రూపాల్లో వస్తోంటే... కొన్ని పువ్వుల్లా





వీటికి ఉంటే సన్నని కాడకి కాయని గుచ్చితే సరిపోతుంది. ఏ కంగారు లేకుండా దీపం కింద పడుతుందన్న భయం పూజ చేసుకోవచ్చు. ఇంకేం మెచ్చిన డిజైని తెచ్చేసుకోండి మరి. □



ఉంటాయి.

# తెర

## 'రమణి కళ్యాణం' టైటిల్ లాంచ్



దీప్శిక, సూర్య వశిష్ట ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రమణి కళ్యాణం'. ఈరోజు చిత్రబృందం అధికారికంగా టైటిల్ లుక్‌ను లాంచ్ చేశారు. కిరణ్ అబ్బవరం, వశిష్ట, విజయ్ ఆంటోని, జి.వి. ప్రకాశ్ కుమార్, సామ్ సి.ఎస్, రంజిత్ జేయకొడి వంటి ప్రముఖులు టైటిల్ ని లాంచ్ చేశారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రానికి సూరజ్ ఎస్ కురుప్ మ్యూజిక్ అందిస్తున్నారు. అరవింద్ తిరుకోవెల డీవోపీ, రవితేజ గిరిజాల ఎడిటర్. యువరాజ్ తేజ కాండ్రకోట, రామ్ జగదీష్, విజయ్ ఆదిరెడ్డి స్క్రీన్ ప్లేని అందిస్తున్నారు.
నటీనటులు: దీప్శిక, సూర్య వశిష్ట, శ్రీనివాస్ రెడ్డి, శ్యామతదితరులు.

## హీరోయిన్ని టార్గెట్ చేసింది ఆ వ్యక్తే!




యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, కొన్ని రోజులుగా తాను ఎదుర్కొంటున్న ఒక సమస్యగురించి మాట్లాడుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ సారాంశం ఏమిటంటే.. ఎవరో కొందరు గత కొన్ని రోజులుగా తన మార్ఫింగ్ ఫోటోలను పోస్ట్ చేస్తూనే ఉన్నారని, పైగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనికితోడు తనకు తెలిసిన వ్యక్తులను కూడా ఆ పోస్ట్‌లకు ట్యాగ్ చేశారని ఆమె రాసుకొచ్చింది. ఐతే, ఈ పోస్ట్‌లు చేస్తున్న వ్యక్తి గురించి తాజాగా క్లారిటీ వచ్చింది. తమిళనాడుకు చెందిన ఓ 20 ఏళ్ల అమ్మాయి దీని వెనుక ఉందని, ఆ అమ్మాయి అనేక నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకుందని తెలుస్తోంది. ఈ విషయం పై అనుపమ కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు ఆ అమ్మాయిని చాలా త్వరగా గుర్తించారు. ఐతే, ఆమె వయస్సు కేవలం 20 ఏళ్ళు కారణంగా.. ఆమె పేరును వెల్లడించకూడదని అనుపమ పోలీసులను కోరడం విశేషం.

## సంచలనంగా మీసాల పిల్ల సాంగ్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల 50 మిలియన్ల వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్‌కి కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. హిట్‌మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం పండగ వాతావరణంలో, కుటుంబమంతా కలిసి చూసేలా ఉండే ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. మెగాస్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ముఖ్యంగా నయనతారతో ఉన్న సీన్స్‌లో ఆయన టైమింగ్ ఫ్యాన్స్‌ని అలరించింది. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ కట్టిపడేశాయి. ఆకట్టుకునే హుక్‌లైన్ తో ఈ సాంగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మార్చేశాయి. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మిస్తున్న "మన శంకరవర ప్రసాద్ గారు" 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది.

## నీల గా వస్తోన్న అనుష్క శెట్టి..



సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి నటించిన మలయాళ చిత్రం కథనార్ త్వరలో రిలీజ్ కానుంది. జైసూర్య హీరోగా వస్తున్న ఈ చిత్రంలో అనుష్క నీల పాత్రలో నటిస్తోంది. ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన క్యారెక్టర్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. భారీ బడ్జెట్‌తో 3డీ టెక్నాలజీతో తెరకెక్కుతున్న ఈ సినిమాను 18 నెలల పాటు 212 రోజులు షూట్ చేసినట్టు టీమ్ తెలిపింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిష్ సహా 15 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్న ఈ చిత్రం పౌరాణిక కథాంశంతో విశేష ఆకర్షణగా మారింది. అనుష్క శెట్టి నటించిన 'కథనార్ల'మూవీ 15 భాషల్లో విడుదల(ఫోటోలు) దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అనుష్క శెట్టి మరోసారి భారీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'ఇరువురు భామల కౌగిలిలో'ప్రారంభం



దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో దీపా ఆర్ట్స్ శ్రీనివాస గౌడ్ నిర్మాతగా ఎంతో అట్టహాసంగా అతిరథ మహారథుల సమక్షంలో హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైన చిత్రం 'ఇరువురు భామల కౌగిలిలో'. పూజా కార్యక్రమాల అనంతరం దర్శకులు కె.రాఘవేంద్రరావు స్క్రిప్ట్‌ను నటీనటులు, దర్శక, నిర్మాతలకు అందచేశారు. 'కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ త్రినా ద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా అక్షర గౌడ కీలకపాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో ఎంతోమంది ప్రముఖ నటులు నటించనున్నారు. చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా హీరో హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా ప్రముఖ దర్శకులు బి.గోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. ఫస్ట్‌షాట్‌కి ప్రముఖ దర్శకులు ఎ కోదండరామిరెడ్డితో పాటు నిర్మాత, కెమెరామెన్ ఎస్ గోపాల్‌రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్ర ఓపెనింగ్‌కి 'కమిటీ కుర్రాళ్లు దర్శకుడు యధు వంశీతో పాటు ఆ సినిమాలో నటించిన నటీనటులందరూ పాల్గొన్నారు. టిల్లు స్క్వేర్ దర్శకుడు మల్లిక్‌రామ్,‍దితరులు ఓపెనింగ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ చిత్రానికి సంగీతం: శీను భీట్స్, డిఓపిఃశశాంక్ శ్రీరామ్, మాటల రచయిత– శ్రీధర్ సీపాన, ఎడిటర్– రాఘవేంద్ర వర్మ, లైన్ ప్రొడ్యూసర్– సౌజన్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్– సాయిరామ్ దేవర్ల, ప్రొడక్షన్ డిజైనర్– షర్మిలా కొప్పిశెట్టి, కాస్ట్యూమ్స్– ప్రణతి, పి.ఆర్.ఓ–:శివమల్లాల, నిర్మాత– శ్రీనివాస గౌడ, దర్శకత్వం– అచ్యుత్ చౌదర.

## 'కలివి వనం'21న రిలీజ్

వృక్షో రక్షతి రక్షి తః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షి ంచుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. హీరోయిన్ గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను సీనియర్ జర్నలిస్ట్‌లు రవిచంద్ర, ఫణి, కేశవ చారి, సినీ జోష్ రాంబాబు, శివ మల్లాల, రాధా కృష్ణ ట్రైలర్ నవంబర్ 21 డేట్ రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరంచిత్ర నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ.. పరిసరాల మీద అంటే అడవిలో చెట్లు మనకు ఎంత ఉపయోగపడతాయన్న దాని మీద ఈ సినిమా చాలా బాగా తీశారు. మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె మాట్లాడుతూ –ఏ ఎక్స్పెక్టేషన్ లేకుండా ఈ సినిమాకు వచ్చిన ప్రేక్షకులందరికీ ఈ సినిమా 100 నచ్చుతుందని ఆశిస్తున్నాను.



ఆట





## ఎయిర్ రైఫిల్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా రవీందర్

### ఎలావెనిల్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** పురుషుల50 మీటర్ల పిస్టల్‌లో రవీందర్ సింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. అలాగే మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఎలావెనిల్ వలరివన్ కాంస్యం గెలుచుకుంది. భారత సైన్యంలో 29 ఏళ్ల నాయక్ సుబేదార్ అయిన రవీందర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించడం ద్వారా తన షూటింగ్ కెరీర్‌లో అతి పెద్ద విజయాన్ని సాధించాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు సార్లు ఒలింపియన్‌ఎలావెనిల్ వలరివన్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి ఆకట్టుకునే ప్రదర్శనతో ముందు కొచ్చింది. ఫైనల్‌లో ఆధిక్యం సాధించిన తర్వాత 26 ఏళ్ల ఎలావెనిల్ టాప్ పోడియం స్థానాన్ని కైవసం చేసుకునే ప్రయత్నంలో ఆమె 19వ షాట్‌లో 10.0 స్కోరు చేసి 3వ స్థానానికి పడిపోయింది. 22వ షాట్‌లో పేలవమైన 9.9 స్కోరుతో 232.0 పాయింట్లు సంపాదించి మూడవ స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన 2024 పారిస్ గేమ్స్ ఛాంపియన్ బాన్ హ్యోజిన్ 255 స్కోరుతో స్వర్ణం గెలుచుకుంది. అయితే 19వ షాట్ వరకు ఎలావెనిల్ కంటే వెనుకబడిన చైనా జూనియర్ ప్రపంచ ఛాంపియన్ వాంగ్ జీఫీ 254 స్కోరుతో రజతం సాధించింది. కాగా ఎలావెనిల్, మేఘన సజ్జనార్ మరియు శ్రేయ అగర్వాల్‌లతో కూడిన భారత మహిళల జట్టు 1893.3 పాయింట్లతో కాంస్యం గెలుచుకోగా, చైనా (1901.7) మరియు దక్షిణ కొరియా (1899.9) వరుసగా స్వర్ణం మరియు రజతం గెలుచుకున్నాయి.

## హాంగ్‌కాంగ్ సిక్సస్: ఛాంపియన్‌గా పాకిస్థాన్

### 43 పరుగుల తేడాతో కువైట్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు హాంగ్ కాంగ్ సిక్సస్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన 2025 ఎడిషన్ ఫైనల్లో కువైట్‌పై 43 పరుగుల తేడాతో గెలుపొంది, ఆరోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత 6 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 135 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ అబ్బాస్ అఫ్రిది (11) కువైట్ బౌలర్లను చీల్చి చెండాడాడు. ఓపెనర్లు అబ్దుల్ సమద్ (42), ఖ్వాజా నఫే (22) సైతం చెలరేగిపోయారు. మిగిలిన బ్యాటర్లలో షాహిద్ అజీజ్ డకౌట్ కాగా, మాజ్ సదాకత్ 10, షెహజాద్ 4 పరుగులతో అజేయంగా నిలచారు. కువైట్ బౌలర్లలో మీట్ భావ్సర్ 3 వికెట్లు తీశాడు. ఇక భారీ లక్ష్య ఛేదనలో కువైట్‌కు మెరుపు ఆరంభం లభించినప్పటికీ ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోవడంతో 5.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 92 పరుగులకే పరిమితమైంది. మాజ్ సదాకత్ 3 వికెట్లు తీసి కువైట్ వెన్ను విరిచాడు. ముహమ్మద్ షెహజాద్, అబ్బాస్ అఫ్రిది, అబ్దుల్ సమద్ తలో వికెట్ తీశారు. కువైట్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు అద్నాన్ ఇద్రీస్ (30), మీట్ భావ్సర్ (33) చెలరేగినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఆ తర్వాత వచ్చిన బిల్లాల్ తహిర్ (6), రవీజా సందరువన్ (1), కెప్టెన్ యాసిన్ పటేల్ (14) తక్కువ స్కోర్లకే ఔట్ అయ్యారు. మొహమ్మద్ షఫిక్ డకౌటయ్యాడు. కాగా ఈ టోర్నీలో ఇప్పటికే భారత్ నేపాల్, యూఏఈ, కువైట్, శ్రీలంక వంటి పసికూన చేతుల్లో ఓడి క్వార్టర్ ఫైనల్స్‌కు కూడా చేరకుండానే నిష్క్రమించింది.




## శ్రీలంక చేతిలో టీమిండియా చిత్తు

**న్యూఢిల్లీ:** హాంగ్ కాంగ్ సిక్సెస్-2025 టోర్నమెంట్‌ను భారత్ జట్టు ఓటమితో ముగించింది. ఆదివారం శ్రీలంకతో జరిగిన బౌల్ గ్రూప్ మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 138 పరుగుల భారీ స్కోర్ సాధించింది. లాహిరు సమరకూన్ (14 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 52), కెప్టెన్ మధుశంక (15 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెరేగారు. భారత్ బౌలర్లలో ప్రతీ ఒక్కరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం 139 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులకే పరిమితమైంది. భారత్ బ్యాటర్లలో భరత్ చిప్లి (13 బంతుల్లో 41) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ స్టువర్ట్ బిన్నీ (9బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో25) మెరుపులు మెరిపించాడు. ఈటోర్నీలో భారత్‌కు ఇది నాలుగో ఓటమి. అంతకు ముందు కువైట్, యూఏఈ, నేపాల్‌వంటిపసికూన చేతుల్లో మెన్ ఇన్ బ్లూ పరాజయం పాలైంది. దినేష్ కార్తీక్, రాబిన్ ఊతప్ప, బిన్నీ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ కూడా భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరడంలో విఫమైంది.





# టీమిండియా వైఫల్యాలు

### 100 రన్స్ కూడా చేయలేని స్టార్లు.. పాఠం నేర్పని పరాభవాలు

**న్యూఢిల్లీ:** టీమిండియా తరచూ వైఫల్యాలను మూటగట్టుకుంటోంది. గత వైఫల్యాల నుండి పాఠం నేర్వకపోవడంతో ఓనమాలు రాని, పసికూన జట్ల చేతిలో కూడా దారణంగా పరాభం పాలవుతోంది. తాజాగా క్రికెట్‌లో పసికూన కువైట్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో 5.4 ఓవర్లలో 79 పరుగులకే టీమిండియా ఆలౌటైంది. భారత జట్టు టీ20 చరిత్రలో కొన్ని మ్యాచ్‌లలో 100 పరుగుల మార్కును కూడా చేరుకోలేకపోయింది. మెల్‌బోర్న్‌లో (2008, ఫిబ్రవరి) ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 74 పరుగులు చేసిన టీమిండియా టీ20 చరిత్రలో అత్యల్ప స్కోరుగా నమోదైంది. ఆ మ్యాచ్‌లో ఇర్ఫాన్ పఠాన్ (26) మాత్రమే కొంతసేపు క్రీజులో నిలబడగలిగాడు. జట్టు 17.3 ఓవర్లలోనే కుప్పకూలి, మ్యాచ్‌ను దారుణంగా కోల్పోయింది. అలాగే న్యూజిలాండ్‌తో టీ20 ప్రపంచ కప్ 2016 ప్రారంభ మ్యాచ్‌లో భారత్ దారుణంగా ఓడిపోయింది. న్యూజిలాండ్ స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్‌లను ఉక్కిరిబిక్కిరి చేశారు. మిచెల్ శాంట్నర్, ఇష్ సోధి బౌలింగ్ ముందు మొత్తం జట్టు 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక కొలంబోలో శ్రీలంక (2021)తో జరిగిన మ్యాచ్‌లో 81 పరుగులే టీమిండియా కష్టం మీద చేయగలిగింది. కోవిడ్ కాలంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టులో చాలా మంది ఆటగాళ్లు ఐసోలేషన్‌లో ఉన్నారు. యువకులతో కూడిన జట్టు శ్రీలంక బౌలర్ల ముందు కష్టపడి, 20 ఓవర్లలో కేవలం 81 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇది భారత టీ20 చరిత్రలో అత్యంత బలహీనమైన బ్యాటింగ్ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. దక్షిణాఫ్రికా (2015)తో కటక్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లు మొదటి నుంచీ ఒత్తిడి తెచ్చారు. మొత్తం జట్టు 17.2 ఓవర్లలో కేవలం 92 పరుగులకే ఆలౌట్ అయింది. మరోసారి శ్రీలంక (2016) చేతిలో పరాభం చెందింది. పుణెలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటింగ్ లైనప్ మళ్లీ దారుణంగా కుప్పకూలింది. శ్రీలంక ఫాస్ట్ బౌలర్ కసున్ రజితా తన అరంగేట్ర మ్యాచ్‌లోనే 3 వికెట్లు పడగొట్టి భారత్‌ను షాక్‌కు గురిచేశాడు. మొత్తం జట్టు 18.5 ఓవర్లలో కేవలం 101 పరుగులు మాత్రమే చేయగలిగి మ్యాచ్‌ను కోల్పోయింది.









## మూడో టి20లో న్యూజిలాండ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** మూడో టీ20లో ఉత్కంఠ భరితమైన ముగింపులో న్యూజిలాండ్ వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించింది. దీంతో ఐదు ఆటల సిరీస్‌లో న్యూజిలాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం జరిగిన మూడో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీమర్ కైల్ జేమిసన్ వరుసగా రెండో మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో చేసిన స్కోరుతో ఈ విజయం సాధ్యమైంది. నెల్సన్‌లో న్యూజిలాండ్ సాధించిన తొమ్మిది వికెట్లకు 177 పరుగుల స్కోరును అధిగమించే అవకాశం ఉన్నా కానీ రొమారియో షెపర్డ్ తన కెరీర్‌లో అత్యుత్తమ 49 పరుగుల కోసం చివరి బంతికి డీప్ బౌలర్‌గా క్యాచ్ ఇచ్చి 168 పరుగుల వద్ద ఔటయ్యాడు. 13వ ఓవర్లో వెస్టిండీస్ ఎనిమిది వికెట్లకు 88 పరుగులు చేసి ఆశలు వదులుకున్నట్లు అనిపించింది. ఆ తర్వాత షెపర్డ్ తోటి సీమర్ షమర్ స్ప్రింగర్ బంతిని క్లీన్ గా బౌండరీకి కొట్టడం ప్రారంభించారు. ఈ జంట కేవలం 6.3 ఓవర్లలోనే 78 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్ప్రింగర్ అద్భుతంగా బౌలింగ్ చేసి జాకబ్ డఫీ బౌలింగ్‌లో 39 పరుగులు చేసి ఒక ఓవర్ మిగిలి ఉండగానే బౌలింగ్ చేశాడు.

గెలవడానికి 12 పరుగులు అవసరమైనప్పుడు, చివరి జంట జేమిసన్ వేసిన మొదటి 4 బంతుల్లో కేవలం రెండు మాత్రమే స్కోర్ చేయగలిగింది. ఓపెనర్ డెవాన్ కాన్వే 34 బంతుల్లో 56 పరుగులు చేసి రనౌట్ కావడంతో న్యూజిలాండ్ తన లక్ష్యాన్ని కోల్పోయింది. డారిల్ మిచెల్ మిడిల్ ఆర్డర్‌లో (41) ఆకట్టుకున్నాడు. 31 పరుగులతో అలిక్ అథనాజ్, 24 పరుగులు చేసిన అకీమ్ అగస్టే వెస్టిండీస్ లక్ష్యాన్ని ఛేదించడానికి స్థిరమైన ఆరంభాన్ని అందించినా 35 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోవడం వారి ఆశలను దెబ్బతీసింది. డఫీ 36 పరుగులకు మూడు, ఇష్ సోధి 34 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టారు.




## మెహుల్‌చోక్సీ ఆస్తులు వేలానికి కోర్టు అనుమతి

**ముంబయి, నవంబరు 9:** పంజాబ్‌నేషనల్ బ్యాంకులో ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారుగా విదేశాల్లో ఉన్న గీతాంజలి ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీకి చెందిన ఆస్తులు వేలం వేసేందుకు ముంబయి కోర్టు అనుమతులు ఇచ్చింది. మొత్తం 13 అరక్షిత ఆస్తులు మెహుల్ చోక్సీకి చెందినవిగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈనెల నాల్గవ తేదీ కోర్టు ఈ ఆస్తులు వేలంద్వారా సమకూరిన సొమ్మును విచారణజరుపుతున్న కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఎఫ్‌డిలుగా కోర్టుపేరిట డిపాజిట్‌చేయాలని, అన్ని అనుబంధ వ్యయాలు, ఖర్చులను ఈ సొమ్మునుంచి మినహాయించుకున్న తర్వాత డిపాజిట్లుగా మార్చాలని సూచించారు. కేవలం అరక్షిత ఆస్తులు మాత్రమే వేలం వేస్తారని సెక్యూరిటీ ఉన్న రుణదాతలు చెపుతున్న ఆస్తులజోలికి వెళ్లవద్దని దర్యాప్తు ఏజెన్సీలను ఆదేశించింది. విచారణముగిసిన వెంటనే ఈసొమ్ముపై నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి ప్రకటించారు. బీరీవాలిలో నాలుగు ప్లాట్లు ఉన్నాయి. వాటి విలువ 2.6 కోట్లు ఉంటుందని అంచనా. భారత్ డైమండ్ బౌర్స్ పేరిట బాంద్రా కుర్లా కాంప్లెక్సులో ఒక యూనిట్ ఉంది. 14 పార్కింగ్ స్పేస్‌లు మొత్తం 19.7 కోట్ల విలువైనవిగా చెపుతున్నారు. అలాగే గోరేగాంవ్ ఈస్ట్‌ల ఆరు, ఉద్యోగ్‌నగర్‌లో ఒకటి, పారిశ్రాయిక గేలాలు ఉన్నాయి జైపూర్ కేంద్రంగా వెండి ఇటుకల తయారీ, విలువైన రాళ్లుశుద్ధిచేసే యంత్రాలను కూడా వేలానికి ఉంచారు. 2018లో ఈ ఆస్తుల విలువను మదింపుచేసారు. ఈ విలువల ఆధారంగానే ఇపుడు ఈ ఆస్తులు వేలానికి వస్తున్నాయి.



## బెజోస్ మాజీ భార్య రూ.1.70 లక్షల కోట్ల విరాళాలు!

**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 9:** ప్రపంచ కుబేరుడు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మాజీ భార్య మెకంజీ స్కాట్ తన ఉదారతతో వార్తల్లో నిలిచారు. విడాకుల తర్వాత లభించిన సంపదలో అధిక భాగాన్ని ఆమె దాతృత్వానికే కేటాయిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు ఆమె ఏకంగా 19.25 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.70 లక్షల కోట్లు) విరాళంగా అందించి రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మెకంజీ స్కాట్ తన యీల్డ్ గివింగ్ అనే దాతృత్వ సంస్థ ద్వారా ఈ భారీ విరాళాలను అందిస్తున్నారు. విద్య, విపత్తు నిర్వహణ, ఇతర సామాజిక అంశాలపై పనిచేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలకు ఆమె ఆర్థిక చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా ఆమె ఇచ్చే నిధులు అన్‌రిస్ట్రిక్టెడ్ గ్రాంట్స్ కావడంతో ఆయా సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా ఆ డబ్బును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. 2019లో జెఫ్ బెజోస్‌తో విడాకులు తీసుకున్న సమయంలో అమెజాన్ కంపెనీలో ఆమెకు 4 శాతం వాటా లభించింది. దీని విలువ దాదాపు 139 మిలియన్ షేర్లు. అప్పటి నుంచి తన వాటాను క్రమంగా విక్రయిస్తూ వస్తున్న మెకంజీ, ఆ వచ్చిన డబ్బును పూర్తిగా దానధర్మాలకే కేటాయిస్తున్నారు. ఇప్పటివరకు తన వాటాలో 42 శాతం అంటే దాదాపు 58 మిలియన్ షేర్లను ఆమె విక్రయించారు. ఇంత భారీ మొత్తంలో నిరంతరం విరాళాలు అందిస్తున్నప్పటికీ, మెకంజీ స్కాట్ నికర ఆస్తుల విలువ ఇంకా 35.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3.15 లక్షల కోట్లు)గా ఉంది. సంపదను సమాజ హితం కోసం వెచ్చించడంలో ఆమె ప్రపంచవ్యాప్తంగా ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.



## భారత్ స్కాచ్ విస్కీకి గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్

### 19.2 కోట్ల బాటిళ్లకు పైగా ఎగుమతులు



**న్యూఢిల్లీ, నవంబరు 9:** భారత్ స్కాచ్ విస్కీ మార్కెట్ రానున్న కొన్నేళ్లలో ఇతర అన్ని దేశాలను అధిగమించి ప్రపంచ మార్కెట్ లీడర్‌గామారుతుందని స్కాచ్ విస్కీ అసోసియేషన్‌ప్రకటించింది. శరవేగంగా అభివృద్ధిచెందుతున్న దేశంగా ఉన్న భారత్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న ఫ్రాన్స్‌ను అధిగమించింది. 192 మిలియన్ల బాటిళ్లు ఎగుమతులుచేసింది. విలువలపరంగా ప్రపంచంలో ఐదో అతిపెద్దదేశంగా భారత్‌నిలిచింది. దిగుమతి సుంకాలు తగ్గి, కొత్త వాణిజ్య దేశాలుకలిసివస్తే ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ విస్కీ ఎగుమతుల్లో నిలుస్తుందని అసోసియేషన్ చెపుతోంది. యుకె,భారత్‌లమధ్య స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఇందుకు కలిసొస్తున్నదని అసోసియేషన్ చీఫ్ మార్క్ కెంట్ వెల్లడించారు.

భారతీయ మాల్ట్ విస్కీ అసోసియేషన్ ఈసందర్భంగా కొత్త భాగస్వామ్యాలకు వస్తే భారత్ స్కాచ్‌విస్కీకి మరింత మార్కెట్ లభిస్తుందని చెపుతున్నారు. బ్రిటన్‌తో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల సుంకాలు విస్కీ, జిన్‌లపై 150 శాతంనుంచి 75శాతానికి తగ్గుతాయి. ఆ తర్వాత పదో ఏడాది నాటికి 40శాతానికి తగ్గుతాయని అంచనా. తక్కువ సుంకాలు ఉంటే అంతర్జాతీయంగా మరింత మార్కెట్ పెరుగుతుందని చెపుతున్నారు. ఇప్పటికే యూరోప్ ఇతర దేశాల్లో భారత్‌స్కాచ్ విస్కీకి మంచి మార్కెట్ ఉంది. అమెరికా సుంకాలు ఆదేశంతో వాణిజ్యడీల్‌కొలిక్కివస్తే అమెరికాతోపాటు ఇతర ఆసియా దేశాలకు సైతం మార్కెట్ పెరుగుతుందని అసోసియేషన్ చీఫ్ తెలిపారు.

## టాప్ ఏడు సంస్థల మార్కెట్ విలువల్లో భారీ క్షీణత

వాణిజ్యం



**ముంబయి, నవంబరు 9:** దేశంలోని టాప్ పది సంస్థల్లోని ఏడు సంస్థల మార్కెట్ విలువలు భారీగా క్షీణించాయి. ఈ వారంలో ఈ క్షీణత మొత్తం 88,635.28 కోట్లుగా ఉంది. భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్ సంస్థలు భారీగా దెబ్బతిన్నాయి. బిఎస్ఇ బెంచ్‌మార్క్ 722.43 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ కూడా 229.8 పాయింట్లు ఈ వారంలో క్షీణించింది. అందువల్లనే ఈక్విటీల్లోని టాప్ మార్కెట్ సంస్థల్లో విలువలు కరిగిపోయాయి. అంతర్జాతీయ పరిణామాలు, సుంకాల ఒత్తిళ్లు, డాలర్ రూపాయి మారకం విలువలే కీలకమని తెలుస్తోంది. రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, హిందూస్థాన్ యూనిలీవర్‌లు ఎక్కువ దెబ్బతిన్నాయి. మరోవైపు భారతీయ స్టేట్‌బ్యాంకు, బజాజ్‌ఫైనలన్స్, ఎల్‌ఐసి సంస్థలు మాత్రమే ఈ వారం లాభపడ్డాయి. ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు 30,506.26 కోట్లు క్షీణించి 11,41,048.30 కోట్లకు చేరితే టిసిఎస్ కూడా 23,680.38 కోట్లు క్షీణించి 10,82,658.42 కోట్లకు చేరింది. ఇక హిందూస్థాన్ యూనిలీవర్ 12,253.12 కోట్లుక్షీణించి 5,67,308.81 కోట్లకు చేరింది. అలాగే రిలయన్స్ కూడా 11,164.29 కోట్లు క్షీణించి 20,00,437.77 కోట్లుగా నమోదయింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి ఎంక్యాప్‌కూడా 7303.93 కోట్లు తగ్గి 15,11,375.21 కోట్లుగా ఉంది. ఇన్ఫోసిస్ 2139.52కోట్లు క్షీణించి 6,13,750.48 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు 1587.78 కోట్లు క్షీణించి 9,59,540.08 కోట్లకు చేరింది. ఎల్ఐసి పరంగా 18,469 కోట్లుపెరిగి 5,84,366.54కోట్లకు మార్కెట్ విలువలుపెరిగాయి. అలాగే ఎస్‌బిఐ కూడా 17,492.02 కోట్లుపెరిగి 8,82,400.89 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్‌కుడా 14,965.08 కోట్లకుచేరి 6,63,721.32 కోట్లకు పెరిగింది. ఇక మార్కెట్‌విలువలపరంగారిలయన్స్ ఇప్పటికీ టాప్ వన్‌గానే నిలిచింది. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, ఎల్ఐసి, హిందూస్థాన్ యూనిలివర్‌లు నిలిచాయి.



## అమెరికా దిగుమతులపై 87.82 మిలియన్ డాలర్ల సుంకాలు!

**న్యూఢిల్లీ, నవంబరు 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ విధిస్తున్న దిగుమతి సుంకాలకు ధీటుగా భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై 87.82 మిలియన్ డాలర్ల సుంకాలను ప్రతిపాదించింది. ప్రపంచ వాణిజ్యసంస్థకు ఈ ప్రతిపాదనలిచ్చింది. భారతీయ రాగి ఎగుమతులను పరరిక్షించుకునేందుకు అమెరికా సుంకాలనుంచి రాయితీలు పొందలేకపోతే ఈ సుంకాలు హెచ్చరించింది. రాగి దిగుమతులపై 50శాతం సుంకాలు విధించడాన్ని అమెరికా సమర్థించుకోవడమేకాకుండా భారత్‌సుంకాలను వ్యతిరేకించింది.

భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవు తున్న ఉత్పత్తులపై సుంకాలవల్లసుమారు 182. 54 మిలియన్ డాలర్లు భారంపడుతుందని వీటి లోనే సుంకాల వసూళ్ల కింద 87.82 మిలి యన్ డాలర్లు ఉంటాయని వెల్లడించింది. అందుకు అనుగుణంగానే అమెరికా రాయితీలు రద్దుచేస్తే అందుకు అంతేస్థాయిలో అంతే మొత్తంలో సుంకాలను అమెరికానుంచి దిగుమతయ్యే వాటిపై విధించకతప్పదని స్పష్టంచేసింది. రాగి ఉత్పత్తుల దిగుమతులపై జులై 30 నుంచి కూడా అమెరికా సుంకాలు విధిస్తోంది. 50శాతం సుంకాలపేరిట అన్ని రాగి ఉత్పత్తుల దిగుమతుల పైనా విధిస్తోంది.

## 15 లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు కేంద్రం అనుమతి

**న్యూఢిల్లీ, నవంబరు 9:** కేంద్రం చక్కెర మిల్లులకు 15 లక్షల టన్నుల చక్కెరను ప్రస్తుత సీజన్‌లో ఎగుమతులకు అనుమతించింది. కేంద్ర వినియోగవ్యవహారాలమంత్రి ప్రహ్లాద్‌జోషి వివరాలప్రకారం 50శాతం ఎగుమతి సుంకం మొలాసెస్‌పై విధించిన ఈ సుంకాన్ని రద్దుచేసామని కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు రాసిన లేఖలో వివరించారు. 2025-26 సీజన్‌కు మాత్రమే 15 లక్షల టన్నులు ఎగుమతులు అనుమతిస్తున్నట్లు తెలిపారు. అయితే ఎప్పటినుంచి అనుమతి ఉంటుందన్నది వివరించలేదు. అయితే మిల్లర్లు మాత్రం 20 లక్షల టన్నుల చక్కెరను అనుమతించాలని కోరుతున్నారు. భారతీయ చక్కెర, బయో ఎనర్జీ ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ జనరల్ దీపక్ బల్లాని మాట్లాడుతూ ఈనిర్ణయం వల్ల భారత్‌లో ధరలను క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా ఈసీజన్‌లో మంచి ఉత్పత్తిని సాధించగలుగుతామని అన్నారు. కొంతమేరకయినా నిల్వలు బయటకు పోతాయని, మరికొంత దేశీయ మార్కెట్‌కు సరిపోతుందన్నారు. ఈ సీజన్‌లో 18.5శాతం చక్కెర ఉత్పతినత పెరిగి 30.95 మిలియన్ దన్నులవరకూ ఉంటుందని 3.4 మిలియన్‌టన్నులు ఇథనాల్ ఉత్పత్తికి బదలాయించినా చక్కెర ఉత్పత్తి ఈసీజన్‌లో పెరుగుతుందన్నారు. రాష్ట్రాల్లో కూడా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల్లో చెరకు దిగుబడి భారీగాపెరిగిందని తెలిపారు. ఎక్స్ మిల్లుధరలు కింద క్వింటాలుకు ధరలు 3370నుంచి 37003.930కి పెంచారు. ఈసారి దిగుబడి పెరగడంతో మిగులు చెరకును ఇథనాల్ ఉత్పత్తికి వినియోగించాలని కేంద్రం సూచిస్తోంది. ఇథనాల్ 20శాతం బ్లెండింగ్‌లో 1001కోట్ల లీటర్లకు పెరిగిందని తెలుస్తోంది. ఇథనాల్ వడ్డీరాయితీ పథకం కింద కేంద్రం ఇప్పటికే 435.42 కోట్లు కేటాయించింది. ఒక్క కర్ణాటకలోనే ఇథనాల్ కేటాయింపులు డిస్టిలరీలకు 85 కోట్ల లీటర్లుగా ఉంది. ఈసారి 133 కోట్ల లీటర్ల కేటాయింపు జరిగింది. దీనివల్ల చక్కెర మిల్లులకు ప్రత్యామ్నాయ రాబడులు పెరుగుతాయని కేంద్ర మంత్రి కూడా అంచనావేసారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.